




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



తెలంగాణకు ఐకాన్
ఉస్మానియా విశ్వవిద్యాలయం
రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధికి రూట్ మ్యాప్
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 03

గ్యాస్ సంక్షోభం!
హాస్టళ్లలో 'ఆహారం కోత'లు 05



సంపుటి 09, సంచిక: 103 | శుక్రవారం | 13-03-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# భారత నౌకలకు అనుమతి!

## 'హోర్ముజ్' ద్వారా క్రూడ్ ఆయిల్ దిగుమతికి తొలగిన అడ్డంకులు?

**న్యూఢిల్లీ:** గ్యాస్‌తోసహా దేశంలో పెట్రో ఉత్పత్తుల కొరత తీవ్రమవుతున్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం కొంత ఊరట కలిగించే ప్రకటన చేసింది. హోర్ముజ్ జలసంధి ద్వారా వచ్చే భారత పతకాలంగల నౌకలను అడ్డుకోబోమని ఇరాన్ హామీ ఇచ్చినట్టు పేర్కొంది. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన రవాణా మార్గాల భద్రతపై తీవ్రమైన ఆందోళనలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా హోర్ముజ్ ప్రాంతంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ సముద్ర మార్గం ద్వారా భారత దేశం దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్‌లో సుమారు 40 శాతం రవాణా అవుతుంది. అందువల్ల అక్కడి పరిస్థితులు భారత ఇంధన భద్రతపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి. భారత ప్రభుత్వం వర్గాల ప్రకారం, ఇరాన్ భారత జెండాతో ప్రయాణించే ఆయిల్ ట్యాంకర్ నౌకలకు హోర్ముజ్ జలసంధి ద్వారా సురక్షితంగా వెళ్లేందుకు అనుమతి ఇవ్వనుంది. అయితే ఇరాన్‌కు చెందిన మరో వర్గం మాత్రం అలాంటి ఒప్పందం ఏదీ కుదరలేదని పేర్కొంది. ఈ విభిన్న వ్యాఖ్యలతో పరిస్థితి కొంత అనిశ్చితంగా ఉంది. ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీతో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ వరుసగా మూడు సార్లు ఫోన్ ద్వారా చర్చలు జరిపారు. ఈ చర్చల్లో ముఖ్యంగా సముద్ర రవాణా భద్రత, భారత ఇంధన భద్రతపై చర్చించినట్లు భారత విదేశాంగ శాఖ తరువాయి 2లో



### యుద్ధ విరమణకు ఇరాన్ సానుకూలం..

ఇరాన్ షరతులు

యూదు ఉన్మాది ఇజ్రాయెల్, అమెరికా కలిసి ప్రారంభించిన యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్ అధ్యక్షుడు పెజిష్కయాన్ సానుకూలత వ్యక్తం చేశారు. అయితే, ఇందుకుగాను మూడు షరతులు విధించారు.

**మొదటిది:** ఇరాన్‌కు ఉన్న చట్టబద్ధమైన హక్కులను ఇజ్రాయెల్ గుర్తించాలి.

**రెండవది:** యుద్ధ నష్టాన్ని చెల్లించాలి.

**మూడవది:** భవిష్యత్తులో దాడి చేయబోమని అంతర్జాతీయ గ్యారంటీ కావాలి.

ఈ మూడు షరతులను అంగీకరిస్తే, యుద్ధాన్ని నిలిపివేయడానికి ఇరాన్ సుముఖంగా ఉంది. కాగా, తమ లక్ష్యాలు ఇప్పటికే పూర్తయ్యాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. యుద్ధం త్వరలోనే ముగుస్తుందని ఆయన చేసిన ప్రకటన, ఇరాన్ సానుకూల స్పందన పశ్చిమాసియాలో శాంతి నెలకొనే అవకాశాలు పెంచుతున్నాయి. అదే జరిగితే, గ్యాస్, ముడి చమురు కొరతకు తెరపడుతుంది.

# 16 నుంచి ఒంటిపూట బడులు

## పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలలో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలో ఈనెల 16వ తేదీ నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పాఠశాల తరగతులు జరగనున్నాయి. పదవ తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలో మాత్రం మధ్యాహ్నం 1గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు కొనసాగుతాయి. ప్రస్తుతం 2025–26 విద్యా సంవత్సరం చివరి పని దినమైన ఏప్రిల్ 23వ తేదీ వరకు 'ఒంటిపూట' బడులు విధానం కొనసాగుతుందని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈమేరకు పాఠశాల తరువాయి 2లో





# బలమైన భారతదేశానికి బలహీన ప్రధాని

## ట్రంప్‌కు సాగిలపడటం తప్ప మోదీ మరేపని చేయలేకపోతున్నారు

యుద్ధ ప్రభావంతో ధరల పెరుగుదల..

ముర్ము వైఖరి సమర్థనీయం కాదు

సిపిఐ జాతీయ నాయకుడు నారాయణ

కమ్యూనిస్టులను బలహీనపర్చడమే వారి ధ్యేయం : కూనంనేని

ప్రజాపక్షం/ఖమ్మం

ప్రపంచంలోనే అత్యంత బలమైన ప్రజాస్వామ్యవాదులున్న భారతదేశానికి మోదీ అత్యంత బలహీన ప్రధాని అని, యుద్ధాన్ని ఆపే కనీస పని చేయడం లేదని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె. నారాయణ ఆరోపించారు. ట్రంపుకు సాగిలపడటం తప్ప మోదీ మరేపని చేయలేకపోతున్నారని ఇందిరాగాంధీకి ఉన్న ధైర్యంలో ఐదు శాతం కూడా లేదని ఆయన తెలిపారు. గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ భారతదేశంపై యుద్ధ ప్రభావం ప్రారంభమైందని గ్యాస్ ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని ఎగుమతులు నిలిచిపోవడంతో తరువాయి 2లో

# ఫరూఖ్ అబ్దుల్లాపై హత్యాయత్నం

## పిస్టల్‌తో దుండగుడి కాల్పులు

తృటిలో తప్పించుకున్న మాజీ ముఖ్యమంత్రి



**జమ్మూ :** జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లాపై బుధవారం రాత్రి ఓ దుండగుడు హత్యాయత్నం చేశాడు. అయితే ఈ హఠాత్ ప్రమాదం నుంచి ఫరూఖ్ అబ్దుల్లా అత్యంత చాకచక్యంగా తప్పించుకున్నారు. ఈ సంఘటన కలకలం రేపింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇక్కడ ఒక వివాహమహోత్సవ శుభ కార్యక్రమానికి హాజరై బయటకు వెళుతున్న మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లాపై వెనకనుంచి పిస్టల్‌తో ఓ దుండగుడు పాయింట్‌బ్లాంక్ రేంజిలో కాల్పులకు పాల్పడ్డాడు. ఈ దాడిని గమనించిన ఫరూఖ్ అబ్దుల్లా అత్యంత చాకచక్యంగా తప్పించుకున్నారని అధికారులు తెలిపారు. ఈ సంఘటన జరిగినప్పుడు తరువాయి 2లో

పశ్చిమాసియా పరిస్థితిపై...

# ఉభయ సభలలో చర్చ జరగాలి

కేంద్రానికి ప్రతిపక్ష కాంగ్రెస్ డిమాండ్ 05

# ఆందోళనలో ప్రధాని మోదీ

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్య

ఎల్‌పిజి సిలిండర్ల కొరతపై పార్లమెంటు ప్రాంగణంలో ప్రతిపక్ష పార్టీల నిరసన



**న్యూఢిల్లీ:** దేశంలో గ్యాస్ సరఫరా కొరతపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో రాజకీయంగా కూడా ఈ విషయం పెద్ద చర్చకు దారితీస్తున్నది. వంట గ్యాస్ విషయంలో భయపడాల్సిన అవసరం లేదని ప్రజలకు భరోసా ఇస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అందుకు భిన్నంగా ఇతర కారణాలతో తానే స్వయంగా ఆందోళన చెందుతున్నారని కాంగ్రెస్ నేత తరువాయి 2లో



# హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్

## గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా తెలంగాణ

'ఐలైన్ స్టూడియోస్' కార్యాలయాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

'నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే సాక్షాత్తూ హాలీవుడ్ ఇక్కడికి వచ్చినట్లే' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ రావడం ఎంతో గర్వకారణమని తెలిపారు. హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన 'ఐలైన్ స్టూడియోస్' కార్యాలయాన్ని గురువారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ దిగ్గజ సంస్థ అయిన నెట్‌ఫ్లిక్స్ తన విస్తరణకు హైదరాబాద్‌ను ఎంచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

**ఫ్యూచర్ సిటీలో నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్..**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'ఫోర్త్ సిటీ' (ఫ్యూచర్ సిటీ)లో నెట్‌ఫ్లిక్స్ తన కార్పొరేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. దీనికి కావాల్సిన భూమితో పాటు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీనిచ్చారు. వ్యాపారానికి అనుకూలమైన రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందన్నారు. 'తెలంగాణ అంటేనే వ్యాపారం' అని, పెట్టుబడిదారులకు ఎల్లప్పుడూ ప్రభుత్వం పూర్తి రక్షణ ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రపంచంలోని టాప్ 500 కంపెనీలను తెలంగాణకు తీసుకురావడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

**సినీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా భాగ్యనగరం..**

గతంలో మద్రాసులో ఉన్న పరిశ్రమను ఎన్‌టిఆర్, ఏఎన్ఆర్ వంటి మహానుభావులు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని తెలుగు చిత్ర పరిశ్రమ ప్రస్థానాన్ని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. నేడు బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, కల్కి వంటి సినిమాలతో తెలుగు సినిమా సాంకేతికత ప్రపంచ స్థాయికి చేరిందన్నారు. నెట్‌ఫ్లిక్స్ తరువాయి 2లో

కవితకు ఢిల్లీ హైకోర్టు

# నోటీసులు

అందజేసిన సిబిఐ అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్



ఢిల్లీ లిక్కర్ కేసులో హైకోర్ట్ జారీ చేసిన నోటీసులను సిబిఐ అధికారులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు అందజేశారు. ఈనెల 16వ తేదీన ఢిల్లీ హైకోర్ట్‌కు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ మేరకు హైకోర్ట్ నోటీసులను కవితకు అందజేసేందుకు సిబిఐ అధికారులు హైదరాబాద్‌లోని కవిత ఇంటికి చేరుకున్నారు. అయితే ఆ సమయంలో ఆమె అందుబాటులో లేకపోవడంతో కవిత భర్త అనిల్‌కుమార్‌కు నోటీసులను అందజేసినట్టు తెలిసింది. ఢిల్లీ లిక్కర్ కేసులో ఇటీవల చార్జెస్ ఫ్రేమ్ చేయడానికి కూడా రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరిస్తూ ఆ కేసును కొట్టేవేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ సిబిఐ అధికారులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఢిల్లీ హైకోర్ట్ ఈ కేసుతో సంబంధం ఉన్న వారికి నోటీసులు జారీ చేసింది. ఇందులో భాగంగానే కల్వకుంట్ల కవితకు కూడా నోటీసులు జారీ చేశారు.

**న్యాయబృందంతో చర్చిస్తాం: కవిత**

హైకోర్ట్ నోటీసుల అంశంపైన తమ న్యాయబృందంతో చర్చిస్తామని కల్వకుంట్ల కవిత తెలిపారు. సత్యం తనకు తోడుగా ఉంటుందని, కేసు విషయంలో అధికారులకు సంపూర్ణంగా సహకరిస్తానని ఆమె ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.






# నేటి నుంచి షోరూంలోనే వాహనాల రిజిస్ట్రేషన్

అమల్లోకి 'ఆన్‌లైన్' విధానం

ఉత్తర్వులు జారీ చేసిన రవాణా శాఖ కమిషనర్

ప్రజాపక్షం/హైదరాబాద్



వాహనాలు కొనుగోలు చేసిన షోరూంలోనే శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ విధానం అమలు చేస్తూ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. 'జనవరి 24, 2026 నుండి రవాణా శాఖలో డీలర్ పాయిం ట్ రిజిస్ట్రేషన్ విధానం అమలు చేయబడింది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి నాన్‌ట్రాన్స్‌పోర్ట్ మోటార్ సైకిళ్లు, కార్లు మొదటి రిజిస్ట్రేషన్ సమయంలో ఆర్‌టిఎ కార్యాలయాలకు వాహనాన్ని చూపించే అవసరాన్ని తొలగిస్తూ ముందుగా ఉత్తర్వులు జారీ చేయబడిన విషయం తరువాయి 2లో

మహిళా రైతుల డేటాను సేకరించి

# ప్రత్యేక విధానాన్ని రూపొందించాలి

ఐఐటి మద్రాస్ పరిశోధకురాలు వాణి ప్రశంస

ప్రజాపక్షం/హైదరాబాద్



మహిళా రైతుల డేటా సేకరించి ప్రత్యేక విధానం రూపొందించాలని ఐఐటి మద్రాస్ పరిశోధకురాలు (పిహెచ్‌డి) వాణి ప్రశంస అన్నారు. ఐక్య రాజ్యసమితి 2026 సంవత్సరాన్ని మహిళా రైతు సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మహిళా రైతు సదస్సు జరిగింది. ఈ సదస్సుకు డాక్టర్ పర్లపల్లి అరుణదేవి (అసిస్టెంట్ ప్రొఫెసర్) అధ్యక్షత వహించారు. సదస్సుకు వాణి ప్రశంస, పరుచూరి జమున ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తరువాయి 12లో

## పోలీసు రక్షణలో మొజ్తబాకు చికిత్స

### ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ అధికారిక ప్రకటన



**మాస్కో :** మొజ్తబా ఖమేనీ గాయపడి ఇరాన్ పోలీసుల రక్షణలో చికిత్స తీసుకుంటున్నారని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఎస్మాయిల్ బఘై కొరియర్ వార్తాపత్రిక "డెల్లా సెరా"కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారని టాస్ వార్తాసంస్థ గురువారం ప్రకటించింది. ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని బఘై చెప్పారు. గాయాలు ఆయనను బాధ పెట్టలేదని, ఆయన బాగానే ఉన్నారని చెప్పారు. దేశ సర్వాధినేత పదవికి ముగ్గురు పోటీ పడ్డారని, కానీ 88 మంది సభ్యులుగల ఇరాన్ నిపుణుల పట్టసభలో ఎక్కువ మంది మొజ్తబా నాయకత్వం వైపే మొగ్గుచూపారని, ఆయననే నిపుణుల సభ కొత్త సర్వాధినేతగా ఎన్నుకుందని ఎస్మాయిల్ బఘై తాజా ప్రకటనలో చెప్పారు. ఆయన చికిత్స పొందుతున్నట్లు ముందురోజు అనధికారిక వార్తలు వచ్చినప్పటికీ తాజాగా ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ అధికారికంగా ఈ విషయాన్ని బహిర్గతం చేసింది. దీంతో మొజ్తబా విషయంలో సందేహాలన్నీ తీరిపోయాయి. ఫిబ్రవరి 28వ తేదీ మొదటిరోజు జరిగిన భీకర దాడిలో ఇరాన్ సర్వాధినేత అలీ ఖమేనీ, ఆయన అల్లుడు, కుమార్తె, మనవరాలుతోపాటు ప్రస్తుతం కొత్త సుప్రీంగా నియమితులైన మొజ్తబా ఖమేనీ భార్య కూడా మరణించారు. తండ్రి అలీ ఖమేనీ మరణించినప్పటినుండీ ఆయన రెండో కుమారుడు, అధికార వారసుడుగా నియమితులైన మొజ్తబా ఖమేనీ కూడా కనిపించడంలేదని ప్రపంచవ్యాప్తంగా పత్రికలన్నీ ఘోషిస్తున్నాయి. ఇరాన్ సుప్రీం అధినేతగా ఎవరిని నియమించినాగానీ హతమారుస్తామని ఇజ్రాయెల్ ప్రతిజ్ఞ చేసింది. ఐతే ఈ ఎన్నికను ట్రంప్ తిరస్కరించారు. ఆయన అసమర్ధుడని, ఇరాన్‌లోని సకల వ్యవస్థలను సక్రమంగా నిర్వహించగల సామర్థ్యం ఆయనకు లేదని, ఒకవేళ అధికారం చేపట్టినా ఆయనను ఎంతోకాలం అధికారంలో కొనసాగనివ్వబోమని ట్రంప్ శపథం చేశారు. ఇరాన్ పాలకుణ్ణి ఎన్నుకోవడానికి తమ అనుమతి కావాలని ట్రంప్ అన్నారు. తమ దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని ఇరాన్ తాత్కాలిక త్రిసభ్య పాలక మండలి కూడా ట్రంప్‌కు ఒక హెచ్చరిక చేసింది. ఈ పూర్వరంగంలో మొజ్తబా చికిత్స పొందుతున్నట్లు వార్త వచ్చింది.

## బంగ్లాదేశ్ అధ్యక్షుడిని తొలగించాలని పార్లమెంటు ఎదుట నిరసన ప్రదర్శన



**ఢాకా :** జులై స్ఫూర్తిని, ఉద్యమాన్ని అవమానించిన బంగ్లాదేశ్ అధ్యక్షుణ్ణి పదవి నుండి తొలగించాలని కోరుతూ పార్లమెంటు ఎదుట గురువారం ప్రదర్శకులు నిరసన తెలియజేశారు. జులై ఉద్యమంలో మరణించినవారి కుటుంబీకులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఒకవైపు పార్లమెంటు తొలి సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ఈ నిరసన ప్రదర్శన జరిగింది. దేశాధ్యక్షుడు మహ్మద్ షాబుద్దీన్ ను పదవి నుండి తొలగించడం, ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం సంస్కరణలు అమలు చేయడం, జులైలో జరిగిన దారుణ కేసులపై విచారణ చేయడం అనే మూడు డిమాండ్ల పరిష్కారం కోసం నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆధ్వర్యంలో బాధిత కు టుంబాలు ఈ నిరసన ప్రదర్శన చేపట్టాయి. సామూహిక తిరుగుబాటు, అ మరవీరుల త్యాగం కారణంగా మీరు ఈరోజు పార్లమెంటులో కూర్చోగలుగుతున్నారని, అందువల్ల దేశాధ్యక్షుణ్ణి పదవి నుండి తొలగించాలని వారు కోరుతూ ప్ల కార్డులు ప్రదర్శించారు. జులై ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన నైనా సు ల్తానా తల్లి ఐనున్ నహర్ మాట్లాడుతూ, కొత్త బంగ్లాదేశ్‌కోసం తమ పిల్లలు ప్రా ణాలు అర్పించినాగానీ ఆ కలలు నెరవేరలేదన్నారు. జులై ఛార్టర్ అమలులో ఇక జాప్యాన్ని సహించబోమన్నారు.

## బంగ్లాదేశ్‌లో ఇంటింటా స్వయం సమృద్ధే లక్ష్యం

### పార్లమెంటు తొలి సమావేశంలో ప్రధాని తారిఖ్ రెహ్మాన్ పిలుపు



**ఢాకా:** బంగ్లాదేశ్ ప్రతి కుటుంబం స్వయం సమృద్ధి సాధించడమే తమ ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని ఆ దేశ ప్రధానమంత్రి తారిఖ్ రెహ్మాన్ చెప్పారు. ప్రధానమంత్రి షేక్ హసీనా పదవిచ్యుతురాల్ని చేసిన తిరుగుబాటు ఉద్యమం తర్వాత జరిగిన ప్రతిష్ఠాత్మకమైన ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన బిఎన్పి చైర్మన్ తారిఖ్ రెహ్మాన్ ప్రధానమంత్రి పదవి చేపట్టిన తర్వాత పార్లమెంటు మొదటిసారి సమావేశమైంది. పవిత్ర ఖురాన్ పారాయణంతో సమావేశం ప్రారంభమైన తర్వాత తారిఖ్ రెహ్మాన్ స్వాగత ప్రసంగం చేశారు. గురువారం జాతీయ సంసద్ తొలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లో ప్రతి కుటుంబాన్నీ స్వయంసమృద్ధం చేసేందుకు, దేశాన్ని సంపన్న, సురక్షిత ప్రజాస్వామ్య కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతిపక్షాలు కూడా పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. తాను తన పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, పార్టీ అభిప్రాయాలు, జాతి, మతంతో సంబంధం లేకుండా దేశంలో ప్రజలను తాను ప్రాతినిధ్యం వహిస్తున్నానని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాలు కాపాడటమే తన రాజకీయమన్నారు. స్వావలంబన, సురక్షిత, ప్రజాస్వామ్య బంగ్లాదేశ్‌ను స్థాపించాలని బిఎన్పి రాజకీయ లక్ష్యంగా నిర్దేశించుకుందని, ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే ప్రజలందరూ తమకు పూర్తి మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ మహోన్నతమైన పార్లమెంటులో ప్రతి సభ్యుడూ సహకారం అందించాలని కోరుతున్నానన్నారు. వివిధ రాజకీయపార్టీలు భిన్నాభిప్రాయాలు, కార్యక్రమాలు అమలు చేసినప్పటికీ ప్రజాస్వామ్య విలువల రక్షణ, దేశసార్వభౌమాధికార రక్షణలో మాత్రం ఏకాభిప్రాయం ఉండాలన్నారు. బానిసత్వం, ఫాసిజం లేని సురక్షిత, సార్వభౌమ, సుసంపన్న, ప్రజాస్వామ్య బంగ్లాదేశ్ సాధనలో మన మధ్య (రాజకీయపార్టీల మధ్య) ఎలాంటి భిన్నాభిప్రాయాలు ఉండకూడదన్నారు. దేశంలో పదవీచ్యుతులైన హసీనా ప్రభుత్వం పార్లమెంటును జాతీయ కార్యకలాపాల వేదికగా తీర్చిదిద్దడంలో విఫలమైందని, దేశాన్ని బలహీన పరచిందని విమర్శించారు. దేశంలో కొత్త పాలనా యంత్రాంగం జాతీయ పార్లమెంటును దేశంలోని సమస్యల పరిష్కారానికి ఒక నిర్మాణాత్మకమైన చర్చావేదికగా మార్చాలని కోరుకుంటోందని అన్నారు.

## చైనా చాంగ్ ఈ–7 చంద్రాన్వేషణ ఈ ఏడాదే



**బీజింగ్ :** భూమి ఉపగ్రహం చంద్రుణ్ణి క్షుణ్ణంగా లోతుగా అన్వేషణ చేయడానికి చైనా చేపట్టిన ప్రతిష్టాత్మకమైన అన్వేషణాయానం ఈ ఏడాదిలో షురూ కానున్నది. చంద్రుడి కేంద్రంగా చేసుకుని అనంత రోదసి అన్వేషణకు శ్రీకారం చుట్టడం, చంద్రుడి దక్షిణ ధ్రువంలో నీటిని లక్ష్యంగా చేసుకుని ప్రయోగాలు, లోతైన పరిశీలన నిమిత్తం ఈ ఏడాదిలోనే చైనా ప్రయోగాలకు సన్నద్ధం అవుతోంది. భవిష్యత్తులో చంద్రుడిపై స్థిరమైన మానవ ఉనికిని సాధించడం, కీలకమైన నీటి వనరులను అన్వేషించి ఒక నిర్ణయానికి రావడంకోసం "చాంగ్ ఈ–7 చంద్రాన్వేషణ" ఈ ఏడాదిలోనే ప్రారంభిస్తోంది. ఇస్రో తరహాలో ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేసే చైనా ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ (సిఎఎస్‌సి) ప్రభుత్వ మీడియాకు ఈ విషయం గురువారం తెలియజేసింది. చైనా జాతీయ 14వ పీపుల్స్ కాంగ్రెస్ ముగింపు సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ డిప్యూటీ, చైనా ఏరోస్పేస్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్‌లో లీడింగ్ ఇంజనీరు సన్ జెజౌ బీజింగ్ లో చంద్రాన్వేషణ కార్యక్రమం గురించి వివరించారు. చంద్రుడి దక్షిణ ఉపరితల వాతావరణం, నీటి మంచు నిల్వల అన్వేషణలపైనే ఎక్కువగా ఈ పరిశోధనల్లో దృష్టిపెడతామని ఆయన చెప్పారు. చంద్రుడిపై స్థలం ఆకృతి ఎలా ఉంది? అక్కడి భౌగోళిక వాతావరణం ఎలా ఉంది? నీటి నిక్షేపాలు, పదార్థాల కూర్పు వంటి అనేక అంశాలను ఖచ్చితత్వంలో అన్వేషించి కొలతలు తీసేందుకే ఈ అన్వేషణ ప్రారంభించినట్లు ఆయన చెప్పారు.

## చిలీ అధ్యక్షుడుగా జోస్ ఆంటోనియో కాస్ట్

**శాంటియాగో:** ప్రకృతి వనరులకు ప్రసిద్ధిగాంచిన దక్షిణ అమెరికా పశ్చిమప్రాంత దేశం చిలీ దేశాధ్యక్షుడుగా జోస్ ఆంటోనియో కాస్ట్ (60) పదవీ బాధ్యతలు తీసుకున్నారు. తీరప్రాంత నగరమైన వాల్స్ రైసోలో ఆయన పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. స్వేచ్ఛా ప్రజాస్వామ్య విధానాలను పూర్తిగా వ్యతిరేకించే పచ్చి ఛాందస జాతీయవాది, స్వంత్ర నాయకుడు, ట్రంప్ ఆశీర్వాదాలు పొందిన నాయకుడు జోస్ ఆంటోనియో కాస్ట్. 2002 2018 వరకు ఆయన ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌లో సభ్యుడుగా కొనసాగారు. 2016 వరకూ ఇండిపెండెంట్ డెమోక్రటిక్ యూనియన్‌లో ఆయన సభ్యుడుగా కొనసాగారు. 2019లో రిపబ్లికన్‌పార్టీ స్థాపించారు. 2025 నవంబరులో జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థి, కమ్యూనిస్టు ప్రభుత్వంలో కార్మికమంత్రి జాన్నెత్ జారాతో పోటీపడి డిసెంబరులో జరిగిన రన్నాఫ్ ఎన్నికల్లో విజయం సాధించారు. దేశంలో కమ్యూనిస్టు తరపున అధ్యక్షుడుగా ఉన్న గాబ్రియేల్ బోరిక్ పదవీకాలం ముగిసిన తర్వాత ఇప్పుడు ఆంటోనియో కాస్ట్ దేశాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ట్రంప్ తరహాలోనే దేశంలో అక్రమ వలసలను అరికడతానని ప్రజలకు భరోసా ఇచ్చి 58 శాతం ఓట్లు కాస్ట్ సంపాదించారు. కాస్ట్ చెప్పిన వాగ్దానాలు నెరవేర్చాలంటే సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలి. అందుకు ఎంతగానో భారీ ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే ఆయనకు పెద్ద సవాలు. 1990లో చిలీలో ప్రజాస్వామ్యం తిరిగి వచ్చిన తర్వాత ప్రజలు ఇప్పటివరకూ ఎంతో స్వేచ్ఛగా జీవించారు. ఇక దేశంలో ఛాందసవాద పాలన ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయి.

## చైనా–ఉత్తర కొరియా మధ్య రైళ్ళ పునరుద్ధరణ



**బీజింగ్ :** చైనా–ఉత్తర కొరియా మధ్య రైళ్ళ రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. చైనా రాజధాని బీజింగ్ నుండి ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్‌యాంగ్‌కు ప్రయాణికుల రైలు కె–27 గురువారం ఉదయం బయలుదేరి వెళ్ళింది. ఆరు సంవత్సరాల తర్వాత ఈ రైళ్ళ రాకపోకలు తిరిగి మొదలయ్యాయి. పొరుగుదేశాలతో సంబంధాలు బలోపేతం చేసుకోవడానికి ఇటీవలికాలంలో చైనా అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. చైనా సరిహద్దు నగరం డాంగ్‌యాంగ్‌లో ఆగి విరామం తీసుకున్న తర్వాత బోహై సముద్రం ఉత్తరం వైపు మళ్ళీ బయలుదేరి 24.40 గంటలసేపు రైలు ప్రయాణం చేసి శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు ప్యాంగ్‌యాంగ్ చేరుకుంటుంది. రెండు దేశాలమధ్యా ప్రజల రాకపోకలకు, స్నేహపూర్వక సంబంధాలకు ఇదెంతో ప్రయోజనకరంగా ఉంటుందని చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి చెప్పారు.

## ఇరాన్, లెబనాన్, ఇజ్రాయెల్‌లో 1800 మృతి : 12,500 మందికి గాయాలు

**ఐక్యరాజ్యసమితి :** అమెరికా–ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో 13 రోజులుగా ఇరాన్, లెబనాన్, ఇజ్రాయెల్ దేశాలలో 1800 మంది మరణించారనీ, మరో 12,500 మంది గాయపడ్డారనీ ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అదనామ్ ఘెబ్రేయేసస్ గురువారం చెప్పారు. ఈ ప్రాంతంలో ఆరోగ్య సౌకర్యాలపై కూడా దాడులు విపరీతంగా పెరిగాయని చెప్పారు. ఇరాన్‌లో 18, లెబనాన్‌లో 25, ఇజ్రాయెల్‌లో రెండు ఆరోగ్య సౌకర్యాలపై దాడులు జరిగినట్లు గు ర్తించామన్నారు. ఇరాన్‌లో తమ నిర్దేశిల దాడుల లక్ష్యాలు పూర్తయిన తర్వాత మాత్రమే యుద్ధం ముగుస్తుందని ట్రంప్ చెప్పారు. అమెరికా,ఇరాన్ చర్చల బల్ల దగ్గరకు రాకపోతే యుద్ధం మరో రెండు వారాలు కొనసాగే అవకాశాలు ఉన్నాయి.

## హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్

(మొదటి పేజీ తరువాయి)

రాకతో మన స్థానిక సంస్కృతి, ప్రతిభ అంతర్జాతీయ వేదికపై మరింతగా మెరుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### క్రీడారంగంలో నెట్‌ఫ్లిక్స్ సహకారం..

నెట్‌ఫ్లిక్స్ ఇటీవల క్రీడా ప్రసారాలపై దృష్టి సారించడాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, క్రీడా మౌలిక సదుపాయాల కల్పనలో నెట్‌ఫ్లిక్స్ భాగస్వామ్యం కోరుకుంటున్నామని తెలిపారు. నెట్‌ఫ్లిక్స్ వృద్ధి, హైదరాబాద్ అభివృద్ధి ఒకే దిశలో సాగుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. డివిడి అద్దె సంస్థగా ప్రారంభమైన నెట్‌ఫ్లిక్స్, ప్రపంచ ఓటిటి రంగంలో అగ్రస్థానానికి ఎదగడం ఎంతో ప్రేరణాత్మకమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభను, మంచి కంటెంట్‌ను ప్రేక్షకులకు అందించడం నెట్‌ఫ్లిక్స్ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సిఈఓ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తదితరులు హాజరయ్యారు.

## ఆందోళనలో మోదీ

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. గ్యాస్ కొరత సమస్యపై ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసనలు చేపట్టాయి. ఈ నిరసనల్లో రాహుల్ గాంధీతో పాటు, ప్రియాంక గాంధీ వాద్రా, ఇతర ప్రతిపక్ష ఎంపిలు పాల్గొన్నారు. పార్లమెంట్ భవనం సమీపంలోని మకర్ ద్వార్ వద్ద జరిగిన ఈ నిరసనలో కాంగ్రెస్, డిఎంకె, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఎంపిలు కూడా పాల్గొన్నారు. వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల కొరతపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి ప్రజలకు భయపడొద్దని చెబుతున్నప్పటికీ ఆయన స్వయంగా భయపడుతున్నారని ఎద్దేవా చేవారు. 'ప్రధాన మంత్రి కొన్ని అంతర్జాతీయ అంశాల కారణంగా ఒత్తిడిలో ఉన్నారు' అని ఆరోపించారు. ముఖ్యంగా అమెరికాలో ఉన్న జెఫ్రీ ఎప్‌స్టైన్ కేసుకు సంబంధించిన ఫైళ్ల అంశం, వ్యాపారవేత్త గౌతం అదానీపై అమెరికాలో జరుగుతున్న విచారణల కారణంగా ప్రధాని ఆందోళన చెందుతున్నారని రాహుల్ వ్యాఖ్యానించారు. అందుకే పార్లమెంట్‌లో జరిగే చర్చలకు మోదీ హాజరుకావడం లేదని కూడా ఆయన విమర్శించారు. ఈ నిరసన సమయంలో ప్రతిపక్ష ఎంపిలు 'నామ్ నరేంద్ర, కామ్ సరెండర్' వంటి నినాదాలు చేశారు. మహిళా ఎంపిలు ఒక మాక్ మట్టి పొయ్యిని తీసుకుని నిరసన తెలిపారు. ఇది గ్యాస్ కొరత కారణంగా ప్రజలు సంప్రదాయ వంట పద్ధతులకు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితిని సూచించే ప్రతీకగా ఉపయోగించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కూడా ప్రభుత్వాన్ని విమర్శించారు. దేశం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రధాన మంత్రి ఎన్నికల ప్రచారంలో నిమగ్నమై ఉన్నారని ఆయన ఆరోపించారు. దేశవ్యాప్తంగా గ్యాస్ కొరత వల్ల ప్రజలు క్యూలలో నిలబడాల్సి వస్తోందని, చిన్న పెద్ద పరిశ్రమలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ దౌత్య వైఫల్యం, ఇంధన విధానాల లోపం కారణంగా ఏర్పడిన పరిస్థితిగా ఖర్గే అభివర్ణించారు.

## రిజిస్ట్రేషన్

(మొదటి పేజీ తరువాయి)

తెలిసిందే. ఇప్పటివరకు డీలర్లు ఫాం20 (ఫైనాన్సియర్ సంతకంతో, అవసరమైతే), ఇతర పేపర్ ఆధారిత పత్రాలను స్పీడ్ పోస్ట్ లేదా కొరియర్ ద్వారా సంబంధిత ఆర్‌టిఎ కార్యాలయాలకు పంపిస్తున్నారు. అయితే ఈ విధానం వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆలస్యం జరుగుతున్నట్లు గమనించబడింది. ఈ నేపథ్యంలో క్రింది మార్పులను అమలు చేయాలని రవాణా శాఖ నిర్ణయించింది. ఈ ఆదేశాలు నేటి నుండి అమల్లోకి వస్తాయి' అని ఒక ప్రకటనలో తెలిపారు.

### ముఖ్య నిర్ణయాలు..

- నేటి నుండి, డీలర్లు ఆర్‌టిఎ కార్యాలయాలకు ఫాం20, ఇతర పేపర్ పత్రాలను ఫిజికల్‌గా సమర్పించే విధానాన్ని పూర్తిగా రద్దు చేయబడింది.
- ఇకపై డీలర్లు వాహన యజమానితో పాటు ఫైనాన్సియర్ (అవసరమైతే) సంతకాలతో కూడిన ఫాం20, ఇతర పత్రాల స్కాన్ కాపీలను మాత్రమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- 13వ తేదీ తర్వాత జారీ అయ్యే టెంపరరీ రిజిస్ట్రేషన్ (టిఆర్) ఉన్న వాహనాలకు ఫిజికల్ పత్రాలు ఆర్‌టిఎ కార్యాలయాలు స్వీకరించవు.
- 13వ తేదీకి ముందు టిఆర్ పొందిన వాహనాలకు కూడా, డీలర్లు ఫాం20తో పాటు ఇతర పత్రాల స్కాన్ కాపీలు అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్ ద్వారా శాశ్వత రిజిస్ట్రేషన్ పొందే అవకాశం కల్పించబడింది.
- డీలర్లు అప్‌లోడ్ చేసే పత్రాలకు పూర్తి బాధ్యత వారిదే. తప్పుడు లేదా నకిలీ పత్రాలు సమర్పించినట్లయితే క్రిమినల్ చర్యలు తీసుకోబడతాయి.
- ఆర్‌టిఎ కార్యాలయాల్లో అందిన ఆన్‌లైన్ దరఖాస్తులను రెండు పని దినాల్లోపే పరిశీలించి ఆమోదం లేదా రివ్యూ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయబడినాయి. ఆలస్యం జరిగితే కఠిన చర్యలు తీసుకోబడతాయి.
- డీలర్లు తమ వద్ద 7 రోజులకు మించి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకూడదు. ఉల్లంఘన జరిగినట్లయితే వారి లాగిన్ నిలిపివేయడంతో పాటు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోబడతాయి.
- అన్ని అధీకృత ఆటోమొబైల్ డీలర్లుపై మార్పులను గమనించి, వాహనాల శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం ఫాం20, ఇతర పత్రాలను కేవలం ఆన్‌లైన్ విధానంలోనే సమర్పించాలి.

## బలహీన ప్రధాని

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ ఉత్పత్తుల ధరలు కూడా పడిపోనున్నాయని ఆయ న తెలిపారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఆర్థిక వనరులున్న దేశాలపై దాడులు చేసి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వెనుజులా తర్వాత ఇరాన్‌పై యుద్ధం చేస్తున్నాడని, క్యూబాపై కూడా దాడికి ప్రయత్నం చేస్తున్నాడని తెలిపారు. ట్రంప్‌ను చూసి మోదీ భయపడుతున్నాడని 140 కోట్ల మంది దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని ట్రంప్‌కు తాకట్టుపెట్టారన్నారు. ట్రంప్ కు వ్యతిరేకంగా మోదీ నోరు విప్పాలని మూడో ప్రపంచ యుద్ధ పరిస్థితులు నెలకొంటున్న దశలో శాంతికి అలీనదేశంగా భారత్ గట్టి ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ద్రౌపతిముర్మ వైఖరి సమర్థనీయం కాదని రాష్ట్రపతిగా ఆదివాసీ మహిళ ఉన్నందుకు గర్వపడుతున్నాము కానీ ఆదివాసీలకు నష్టం చేసే చర్యలు ప్రభుత్వానికి అనుమతులివ్వడాన్ని మాత్రం సమర్థించబోమని ఆయన తెలిపారు. అటవీ హక్కుల చట్టాన్ని మార్చి అటవీ భూములను కార్పొరేట్‌కు అప్పగించే భాగంగానే ముర్మకు రాష్ట్రపతి పదవిచ్చి ఆమె చేతనే ఆదివాసీలకు నష్టం కలిగించే చర్యలకు బిజెపి ఆమోదం తీసుకుంటుందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను చంపి, అడవుల నుంచి ఆదివాసీలను తరిమి ఆ భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. మావోయిస్టు నేతలను చంపిన ప్రతిసారి కార్పొరేట్లకు వేల ఎకరాలు స్వాధీనం చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. వ్యక్తులుగా సంహరించి తాత్కాలికంగా ఆనందం పొందవచ్చునేమో కానీ సిద్ధాంతాన్ని నశింపజేయలేరని అది ఎవరి తరం కాదని నారాయణ తెలిపారు. మావోయిస్టు రహిత భారతదేశం కాదని పేదరిక రైతు భారతదేశంగా తయారు చేయాలని ఆయన అమిత్‌షాకు సవాల్ విసిరారు. ఖమ్మం వెలుగుమట్ల ఘటనపై స్పందిస్తూ భూస్వామ్య భూములను కమ్యూనిస్టులు ఆక్రమించే క్రమంలోనే భూదాన ఉద్యమం వచ్చిందన్నారు. ఈ దేశంలో ముఖ్యంగా తెలంగాణలో లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. వెలుగుమట్లలో నివాసాలను కూల్చడం ఎందుకు తిరిగి అక్కడే పట్టాలివ్వడం ఎందుకని నారాయణ ప్రశ్నించారు. అక్కడ నివసించే వారందరూ భారతీయులే కాబట్టి పేదలందరికీ పట్టాలు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అర్థం పర్థం లేని చర్యలు రియల్టర్ల కోసమే జరిగాయని ఇది దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు.

### కమ్యూనిస్టులను బలహీనపర్చడమే వారి ధ్యేయం : కూనంనేని

కమ్యూనిస్టులను బలహీన పర్చడమే వారి ధ్యేయమని అందుకే కమ్యూనిస్టులపై అనవసర విమర్శలు చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. మేము ఎలా పనిచేయాలో మాకు తెలుసునని పేదల పక్షాన పనిచేయడమే మా కర్తవ్యమని విద్వేశంతో మాపై విమర్శలు చేయడం తగదన్నారు. రాష్ట్రంలో ఎనిమిది వేల మంది పేదలతో గుడిసెలు వేయించామని వాటికి పట్టాలివ్వాలని 58 జీవో ద్వారా రెగ్యులర్ చేయాలని పోరాడుతున్నామన్నారు. నివాస స్థలాల పంపిణీ, ఇండ్ల నిర్మాణం ప్రభుత్వ బాధ్యత అని అది భిక్ష కాదని కూనంనేని తెలిపారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే లక్షల ఎకరాల భూమి పంపిణీ జరిగిందని, నిత్యం ప్రజల కోసమే మా పోరాటమని కుహానా వాదుల సూచనలు మాకు అవసరం లేదన్నారు. మావోయిస్టుల త్యాగాలను సిపిఐ గుర్తించిందని, ప్రజా పోరాటాలకు కలిసి రావాలని కోరామన్నారు. వ్యక్తిగత అవసరాల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికే సిపిఐ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. కమ్యూనిస్టుల అవసరం ఈ సమాజానికి ఉందని రానున్న కాలంలో మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ ప్రజా ప్రతినిధులకు ఈనెల 13, 14 తేదీల్లో రెండు రోజుల పాటు పాల్వంచలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జాతీయ నాయకులు కె. నారాయణ, పల్లా వెంకటరెడ్డి, కె. రామకృష్ణ హాజరుకానున్నారని కూనంనేని తెలిపారు. మీడియా సమావేశంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 16 నుంచి ఒంటిపూట బడులు

(మొదటి పేజీ తరువాయి)

విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ ఇ.నవీన్ నికోలాస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ నెల 15వ తేదీ నుంచి ఒంటిపూట బడులు ప్రారంభకానున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కానీ 15వ తేదీ ఆదివారం కావడంతో ఆ మరుసటి రోజు నుంచి ఒంటిపూట బడుల విధానం ప్రారంభకానుంది. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగనున్నాయి. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం (మిడ్ డే మీల్స్) మధ్యాహ్నం 12.30 గంటలకు అందించనున్నారు. ఒంటిపూట బడుల విధానం కచ్చితంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని నవీన్ నికోలాస్ ఆదేశించారు. ఒంటిపూట బడులను అమలు తీరుపైన జిల్లా విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని అన్ని పాఠశాలలకు తెలియజేయాలని, అలాగే నిరంతరం పర్యవేక్షించాలని ఆయన సూచించారు.

## అబ్దుల్లాపై హత్యాయత్నం

(మొదటి పేజీ తరువాయి)

జమ్మూకశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సలహాదారు నాసిర్ అస్లాం వని ఆయన వెంట ఉన్నారు. కాగా నిందితుడు 63 ఏళ్ల కమల్ సింగ్ జమ్వాల్‌ను జమ్మూలోని పురానీ మండి నివాసిగా పోలీసులు గుర్తించారు. తాను 20ఏళ్లుగా ఫరూఖ్ అబ్దుల్లాను చంపేందుకు నిరీక్షిస్తున్నానని నిందితుడు కమల్‌సింగ్ జమ్వాల్ పోలీసుల విచారణలో చెప్పారు. ఈ హత్యాయత్నం ఘటనపై స్పందించిన జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ తన తండ్రి ప్రాణాలను కాపాడినందుకు తాను అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెబుతున్నానని చెప్పారు. 'ప్రస్తుతానికి వివరాలు అస్పష్టంగా ఉన్నాయి. కానీ తెలిసిన విషయం ఏమిటంటే లోడ్ చేసిన పిస్టల్‌ను కలిగి ఉన్న ఓ వ్యక్తి పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లోకి వెళ్లి కాల్పులు జరపగలిగాడు'. జమ్మూ గ్రేటర్ కైలాష్‌లోని రాయల్ పార్క్‌లో జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరైన ఫరూఖ్ అబ్దుల్లాపై హత్యాయత్నం జరిగిందని పోలీసులు చెప్పారు. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆ చర్యను అడ్డుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారని, ఆ తర్వాత ఆ వ్యక్తిని కమల్‌సింగ్‌గా గుర్తించామని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. నేరానికి ఉపయోగించిన పిస్టల్‌ను నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఆ ప్రకటన తెలిపింది. తదుపరి విచారణ కొనసాగుతున్నదని పోలీసులు చెప్పారు. సిసిటీవీ ఫుటేజీలో దుండగుడు ఫరూఖ్ అబ్దుల్లాను వెనక నుంచి సమీపించి చాలా దగ్గరగా కాల్పులు జరపడం కనిపించింది.జమ్మూ కశ్మీర్ భద్రతా విభాగానికి చెందిన ఇద్దరు అధికారులు, ఒక ఇన్‌స్పెక్టర్, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌కు నిందితుడు మతిస్థిమితం లేని స్థితిలో కనిపించాడని అధికారులు వెల్లడించారు. పార్టీ నేత బి.ఎస్.చౌహాన్ కూతురి వివాహం కోసం కార్యక్రమానికి హాజరైన ఫరూఖ్ అబ్దుల్లా, సురీందర్ చౌదరి దాదాపు ఒక గంటకు పైగానే వివాహ వేదిక వద్ద గడిపారని అధికారులు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా కూడా ఉన్న ఒక వివాహ పార్టీలో ఓ దండగుడు లైసెన్స్ పొందిన పిస్టల్‌ను ఉపయోగించి కాల్పులు జరిపిన సంఘటన చోటుచేసుకుంది. నిందితుడిని అరెస్ట్ చేశాం. సమగ్ర దర్యాప్తు జరుగుతోంది. ఈ ఘటనలో ఎలాంటి 'ఉగ్ర కోణం' లేదు అని ఎస్‌పి (సిటీ సౌత్) అజయ్ శర్మ తన 'ఎక్స్' పోస్ట్‌లో చెప్పారు. ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి ఆందోళన వ్యక్తం చేస్తూ 'ఇంత పెద్ద ఉపద్రవం ఎలా జరిగిందో భద్రతా అధికారులను, పోలీసులను మీరే అడగాలి' అని ఆయన విలేకరులను ఉద్దేశించి అన్నారు.

### జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా రద్దే కారణం : ఖర్గే

నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, మాజీ సిఎం ఫరూఖ్ అబ్దుల్లాపై బుధవారం రాత్రి జరిగిన హత్యాయత్నాన్ని పలువురు నాయకులు ఖండించారు. సంఘటనకు రాష్ట్ర హోదా రద్దునే కారణమని గురువారం రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ఈ అంశాన్ని లేవనెత్తారు. మాజీ ముఖ్యమంత్రి భద్రతకు ముప్పు ఉన్నదని ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. 'స్థానిక భద్రత, ఏర్పాట్లు గతంలో రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్నప్పుడు అలాంటి సంఘటనలు జరుగలేదన్నారు. ఫరూఖ్ అబ్దుల్లాను చంపడం ప్రభుత్వ ఉద్దేశమా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి పూర్తి హోదా లభించినప్పుడు ప్రజలు సురక్షితంగా ఉంటారని , కశ్మీర్ ప్రజలు మీ చేతుల్లో సురక్షితంగా లేరు' అని ఖర్గే కేంద్రాన్ని ఉద్దేశించి పేర్కొన్నారు. దీనిపై మాట్లాడిన కేంద్ర మంత్రి జె.పి.నడ్డా మాట్లాడుతూ ప్రభుత్వం ఫరూఖ్ అబ్దుల్లా భద్రత విషయానికి సంబంధించి తీసుకోవాల్సిన అన్ని చర్యలనూ చేపడుతుందని చెప్పారు. ఫరూఖ్ అబ్దుల్లాపై జరిగిన 'హత్యాత్మక దాడి' చాలా ఆందోళనకరమైన, చాలా తీవ్రమైన విషయం అని ఆయన అన్నారు. భారత ప్రభుత్వం ఈ విషయాన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, సమగ్ర దర్యాప్తు జరుగుతున్నదని మంత్రి జె.పి.నడ్డా హామీ ఇచ్చారు.

### 'దేవుడు నన్ను రక్షించాడు' : విలేకరులతో ఫరూఖ్ అబ్దుల్లా

తనపై జరిగిన హత్యాయత్నం ఘటనపై మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దులా మాట్లాడుతూ 'దేవుడు నన్ను రక్షించాడు' అని వ్యాఖ్యానించారు. వేదిక వద్ద తగినంత భద్రత లేకపోవడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తనపై ఎవరు దాడి చేశారో తనకు తెలియదని 88ఏళ్ల అనుభవజ్ఞుడైన నాయకుడు ఫరూఖ్ అబ్దుల్లా అన్నారు. 'ఆ వ్యక్తి గురించి నాకేమీ తెలియదు. అతని ఉద్దేశం ఏమిటో కూడా తనకు తెలియదని ఇక్కడి భటిండాలోని ఆయన నివాసంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఈ హత్యాయత్నం ఘటన అనంతరం హోం మంత్రి అమిత్ షా ఫరూఖ్ అబ్దుల్లాకు ఫోన్ కాల్ చేసి మాట్లాడారని, దీనిపై సమగ్రంగా దర్యాప్తు చేస్తామని హామీఇచ్చారని తెలిపారు.

### హత్యాయత్నం ఘటనపై కేరళ సిఎం పినరయి దిగ్భ్రాంతి

జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లాపై హత్యాయత్నం ఘటనపై ఆయన తీవ్ర ఆందోళ వ్యక్తం చేశారు. జెడ్+ఎన్ఎస్‌జి ప్రొటెక్షన్ ఉన్నప్పటికీ ఇంత భద్రతా ఉల్లంఘన ఎలా జరిగిందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన 'ఎక్స్' పోస్ట్‌లో ప్రశ్నించారు.ఈ సంఘటన అధికారుల నుంచి తక్షణ సమాధానాలను కోరుతున్న తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఫరూఖ్ సాబ్, అతని కుటుంబానికి మేం పూర్తి సంఘీభావం తెలియచేస్తున్నాం అని ఆయన అన్నారు. భారత ప్రజాస్వామ్యంలో హింసకు ఏ మాత్రం తావులేదని సిఎం విజయన్ నొక్కిచెప్పారు.

## భారత నౌకలకు అనుమతి!

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. అయితే ఈ చర్చల అనంతరం ఎలాంటి అధికారిక ఒప్పందం కుదిరిందనే విషయాన్ని రెండు దేశాలు కూడా స్పష్టంగా ప్రకటించలేదు. ఇదే సమయంలో సౌదీ అరేబియా నుంచి చమురు తీసుకువస్తున్న షెన్‌లాంగ్ అనే ఆయిల్ ట్యాంకర్ నౌక హోర్ముజ్ జలసంధి దాటి ముంబయి పోర్టుకు చేరుకుంది. ఈ నౌక స్యూజ్‌మాక్స్ తరహా పెద్ద ట్యాంకర్. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత మధ్యప్రాచ్యం నుంచి భారతదేశానికి చేరుకున్న తొలి చమురు ట్యాంకర్ ఇదే అని సమాచారం. ఇది భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్)కు చమురు అందిస్తుందని తెలిసింది. ఇలావుంటే, భారత ప్రభుత్వం తెలిపిన ప్రకారం ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి తూర్పు, పడమర ప్రాంతాల్లో 28 భారత జెండా గల నౌకలు ప్రయాణిస్తున్నాయి. వీటిలో మొత్తం 778 మంది భారత నావికులు ఉన్నారు. వారి భద్రత కోసం నౌక యజమానులు, షిప్పింగ్ సంస్థలు, నియామక సంస్థలు, భారత రాయబార కార్యాలయాలు పరస్పరం సమన్వయంతో ముందుకు వెళుతున్నాయి. ఇక యుద్ధ పరిస్థితుల కారణంగా భారత్ మానవతా దృక్పథంతో కూడా చర్యలు తీసుకుంది. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఒక నౌక ద్వారా వచ్చిన 183 మంది ఇరానియన్ నావికులకు భారత్ సురక్షిత ఆశ్రయం కల్పించింది. అదేవిధంగా బెంగాల్ ఖాతాలో జరిగిన ఒక నౌకాదళ వ్యాయామం అనంతరం వచ్చిన మూడు ఇరానియన్ నౌకలను కూడా భారత్ తన తీర ప్రాంతాల్లో నిలిపేందుకు అనుమతి ఇచ్చింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇరాన్ హోర్ముజ్ జలసంధిలో కనీసం 16 వాణిజ్య నౌకలపై దాడులు చేసినట్లు సమాచారం. ఇటీవల భారత్‌లోని కాండ్లా పోర్టుకు వెళ్తున్న ఒక థాయ్ నౌకపై కూడా దాడి జరిగింది. ఈ ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం అంతర్జాతీయ నౌకా రవాణా నియమాలకు విరుద్ధమని విదేశాంగ శాఖ పేర్కొంది. హోర్ముజ్ జలసంధి దాదాపు మూసివేసిన పరిస్థితి ఏర్పడటంతో భారత్ ప్రత్యామ్నాయ చమురు వనరులను వెతకాల్సిన అవసరం ఏర్పడుతున్నది. ముఖ్యంగా రష్యా నుంచి ఎక్కువ చమురు కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఏ విధంగా చూసినా, పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా సముద్ర మార్గాల భద్రత అనిశ్చితంగా మారిందనే వాస్తవం కళ్లకు కడుతుంది. ఇది భారత్ వంటి పెద్ద చమురు దిగుమతి దేశాలకు ఒక పెద్ద సవాలుగా మారింది. అందువల్ల భారత ప్రభుత్వం దౌత్యపరమైన చర్చలు కొనసాగిస్తూ ఒకవైపు నౌకా రవాణా భద్రతను కాపాడటంతో పాటు మరోవైపు ప్రత్యామ్నాయ ఇంధన సరఫరా మార్గాలను కూడా అన్వేషిస్తోంది.

కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే

# గ్యాస్ కొరత

మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా, భారతదేశానికి గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడి వంటగ్యాస్, కమర్షియల్ సిలిండర్ల కొరత తీవ్రమైంది. ఈ సంక్షోభం వల్ల హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడుతుండగా, సామాన్యులు గ్యాస్ బుకింగ్స్, డెలివరీలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనితో వంట కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న కేంద్ర ప్రభుత్వం నిమ్మకుండినట్లు వ్యవహరిస్తుంది. రాష్ట్రం నుండి 8 మంది ఎంపిలు ఉన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు. రాష్ట్రానికి సరిపడ గ్యాస్ తీసుకురాలేకపోతున్నారు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్యాస్ సరఫరా పెంచాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం గ్యాస్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాల వల్ల రవాణా రంగం, చిన్న వ్యాపారాలు, గృహ వినియోగదారులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన గ్యాస్ సరఫరా పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి పొన్నం మరోసారి డిమాండ్ చేశారు.

# తెలంగాణకు ఐకాన్ ఉస్మానియా విశ్వవిద్యాలయం

• రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధికి రూట్ మ్యాప్ • రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక ఐకాన్‌గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అటువంటి విశ్వవిద్యాలయం మన రాష్ట్రంలో ఉండడం మనకెంతో గర్వకారణమని, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగంలో నిర్మాణ్ 26 సాంకేతిక సదస్సును ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1917లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు. అందుకు కొనసాగింపుగా 1929 లో విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రారంభం అయిన ఇంజినీరింగ్ కళాశాల యావత్ భారతదేశంలోనే అత్యంత ప్రాశస్త్యమైన కళాశాలలలో ఆరవ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. అంతటి ప్రఖ్యాతిగాంచిన విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించడమే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా రూ.వెయ్యి కోట్లు నిధులు మంజూరు చేయడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఇక్కడి నుండి ఎంతో మేధో సంపద ఉత్పత్తి అయిందని, ఆ మేధస్సు ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్న మెజారిటీ ఇంజినీర్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండే ఎదిగిన వారు అని, అంతే గాకుండా గల్లీ నుండి ఢిల్లీ స్థాయికి ఎదిగిన నేతలు, క్రీడాకారులు, ఉన్నత పదవులు చేపట్టిన వారి అడుగులు ఇక్కడి నుండే మొదలు అయ్యాయని ఆయన చెప్పారు. ఇంజినీరింగ్ విభాగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ తెలంగాణా రాష్ట్ర అభివృద్ధిలో ఇంజినీరింగ్ విభాగం ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన చెప్పారు. నిజాంసాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టులతో పాటు ఎస్ఎల్‌బిసి, దేవాదుల వంటి ఆధునిక ప్రాజెక్టులు ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు. నిర్మాణ్ 26 వంటి సాంకేతిక సదస్సులు విద్యార్థులకు పరిశోధన, సృజనాత్మక తాను పెంపొందించే వేదికలని ఆయన చెప్పారు. మన నిర్మాణాలు కేవలం కట్టడాలకే పరిమితం కాకుండా ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు దోహద పడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోధించారు.

ఖరీఫ్ సీజన్‌కు యూరియా నిల్వలపై

# రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల కేటాయింపు కోరుతూ కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాబోయే ఖరీఫ్ 2026 వ్యవసాయ సీజన్‌కు ముందుగానే యూరియా నిల్వలు సిద్ధం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగు సమయానికి యూరియా నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి కీలక విన్నపం చేశారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు గాను ప్రతి నెల 2.00 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కోరుతూ కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు ఆయన లేఖ రాశారు. గత గణాంకాలను విశ్లేషిస్తూ మంత్రి తుమ్మల ప్రస్తుత పరిస్థితిని వివరించారు. 2024 ఖరీఫ్‌లో 4.65 లక్షల మెట్రిక్ టన్నుల ప్రారంభ నిల్వలు ఉండటంతో సరఫరా సాఫీగా సాగిందని, అయితే 2025లో అవి 1.99 లక్షలకు తగ్గడంతో ఇబ్బందులు ఎదురయ్యాయని గుర్తుచేశారు. ప్రస్తుత రబీ ముగిసే సమయానికి ఖరీఫ్ 2026 కోసం కేవలం 50 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు మాత్రమే ఉండే అవకాశం ఉందని, అందుకే ముందస్తు కేటాయింపులు అత్యవసరమన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఖరీఫ్ సీజన్ కొంత ముందుగానే ప్రారంభమవుతుంది. డిమాండ్ తక్కువగా ఉండే ఏప్రిల్, మే నెలల్లో నిల్వలు చేసుకుంటే, గరిష్ట వినియోగం ఉండే జూలై, ఆగస్టు (నెలకు 3 లక్షల టన్నుల అవసరం) నెలల్లో ఎరువుల కొరత రాకుండా చూడొచ్చు. రాష్ట్ర సాగు విస్తీర్ణంలో 70 శాతం ఖరీఫ్‌లోనే ఉంటుంది. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు యూరియా వినియోగం ఎక్కువని లేఖలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు.

### పారదర్శకత కోసం 'యూరియా యాప్'

ఎరువుల పంపిణీలో అక్రమాలకు తావులేకుండా, పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 'యూరియా యాప్'ను అందుబాటులోకి తెచ్చిందని మంత్రి తెలిపారు. దీని ద్వారా రైతులు తమ సమీపంలో ఎరువుల లభ్యతను తెలుసుకోవచ్చని, అధికారులు కూడా నిల్వలను నిరంతరం పర్యవేక్షించవచ్చని ఆయన తన లేఖలో వివరించారు. ఈ నేపథ్యంలో సరఫరా ప్రణాళిక కింద ఏప్రిల్, మే, జూన్ నెలలకు ప్రతి నెలా 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్రాన్ని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ కేటాయింపులు జరిగితే రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే తగిన నిల్వలు ఏర్పరచుకుని ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా యూరియా అందుబాటులో ఉంచగలదన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, త్వరితగతిన సరఫరా ప్రణాళికను ఆమోదిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.



## భగత్ సింగ్ స్ఫూర్తితో దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలి

ఎఐవైఎఫ్ భగత్ సింగ్ ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవంలో ఇ.టి.నర్సింహ్మా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భగత్ సింగ్ స్ఫూర్తితో దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ(సిపిఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నర్సింహా పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ సి గ్రౌండ్స్‌లో 12వ తేదీ నుండి 17వరకు నిర్వహిస్తున్న భగత్ సింగ్ ప్రీమియర్ లీగ్ (బిపిఎల్) ప్రారంభోత్సవానికి ఇ.టి. నర్సింహా ముఖ్య అతిధిగా హాజరై, క్రీడాకారులతో కరచాలనం చేసి టోర్నీని ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ యువతకు ధైర్యం, త్యాగం, దేశభక్తి యొక్క ప్రతీక అని, ఆయన చూపిన మార్గం మనకు నేటికీ ప్రేరణ అని అన్నారు. నేటి యువత క్రీడల ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడంతో పాటు సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న డ్రగ్స్, మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేణి శంకర్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, కళ్యాణ్, మహేష్, ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు అనీల్ కుమార్, ఓయు అధ్యక్షుడు ఉదయ్ కుమార్, భానులతో పాటు 10 టీమ్‌ల క్రీడాకారులు పాల్గొన్నారు.

# 'టెస్కో' ద్వారానే విద్యార్థులకు వస్త్రాలు

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కూనంనేని సాంబశివరావును కోరిన అఖిల భారత వీవర్స్ ఫెడరేషన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ కార్యాలయాలు, స్కూల్స్, గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన బెడ్ షీట్లు, దుప్పట్లు, యూనిఫామ్ తదితర వస్త్రాలన్నీ టెస్కో ద్వారానే కొనుగోలు చేసేవిధంగా ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకురావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావును అఖిల భారత వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధి బృందం కోరింది. అఖిల భారత వీవర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి చాలా రాజేశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు బసాబత్తిని రాజేశం, రాష్ట్ర కో ఆర్డినేటర్ గడ్డం వెంకటేశ్వర్లు, కోర్ కమిటీ సభ్యులు భోగం లక్ష్మయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, సమితి సభ్యులు కెవిఎల్ తదితరులు హైదరాబాద్,హిమాయత్ నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలోని మఖ్దూం భవన్‌లో కూనంనేని సాంబశివ రావును గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ టెస్కో ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం జిఒను జారీ చేసినప్పటికీ సంక్షేమ శాఖ కార్యదర్శి టెస్కో ద్వారా కాకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టెండర్ల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారని వివరించారు. తద్వారా రాష్ట్రంలో దాదాపు లక్ష మంది చేనేత కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వారు కూనంనేని సాంబశివరావు దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే రుణ మాఫీ అమలు కాక చేనేత కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్ల విధానాన్ని అమలు చేస్తే ఇతర రాష్ట్రాల నుండి నాణ్యతలేని వస్త్రాలను సరఫరా చేసే ప్రమాదం ఉందన్నారు. టెండర్ల ద్వారా చేనేత వస్త్రాల సేకరణను రద్దు చేసి, టెస్కో ద్వారానే కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని కోరారు. దీనిపైన కూనంనేని సాంబశివరావు స్పందిస్తూ టెండర్ల ద్వారా కాకుండా టెస్కో ద్వారానే ప్రభుత్వం వస్త్రాలు కొనుగోలు చేసే అంశాన్ని తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కరానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

## ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల సరఫరాను పునరుద్ధరించండి

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి కెటిఆర్ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వాణిజ్య,గృహ అవసరాలకు చెందిన ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల కొరత విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణ మే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.వెంటనే గ్యాస్ సిలిండర్ల సరఫరాను పునరుద్ధరించకపోతే వేలాది వ్యాపార సంస్థలు మూతపడే ప్రమాదం ఉందని, తద్వారా లక్షలాది మంది కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు కెటిఆర్ కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీకి లేఖ రాశారు. ప్రస్తుతం ఎల్‌పిజి సిలిండర్ల సరఫరాలో ఏర్పడిన తీవ్ర అంతరాయంతో హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు, పిజి హాస్టళ్లు, చిన్న చిన్న ఆహార వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయన్నారు. చిన్న వ్యాపారులను రక్షించే విధంగా స్థాయిల వారీగా ఎల్‌పిజి కేటాయింపు వ్యవస్థను ప్రవేశపెట్టాలని, ఎల్‌పిజి సిలిండర్ల లభ్యతపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించేందుకు రియల్ టైమ్ పబ్లిక్ డ్యాష్‌బోర్డ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో వాణిజ్య సిలిండర్ల ధరలను పెంచకుండా తాత్కాలిక ధరల స్థిరీకరణ చేయాల ని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఐటి కారిడార్ ప్రాంతాల్లో నివసిస్తున్న లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు ఆధారపడే పిజి హాస్టళ్లకు ప్రత్యేక రక్షణ కేటగిరీ కింద గ్యాస్ సరఫరా చేయాలని సూచించారు. గ్యాస్ ఆధారిత శ్మశాన వాటికల్లో కార్యకలాపాలు నిలిచిపోకుండా ఉండేందుకు వాటిని అత్యవసర సేవలుగా గుర్తించి, ప్రాధాన్యత కేటాయింపు ఇవ్వాలని సూచించారు.



## సాధికారత దక్కేవరకూ బిసి మహిళలు పోరాడాలి

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చట్టసభలలో అన్ని వర్గాల మహిళలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ వాటా కల్పించే వరకు పోరాడి సాధించాలని, అప్పుడే మహిళా సాధికారత లభిస్తుందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.మని మంజరి, బిసి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో గురువారం మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహిళలు సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళా బిల్లు బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ మహిళలకు జనాభా దామాషా ప్రకారం సబ్ కోట కల్పించినప్పుడే మహిళా బిల్లుకు సంపూర్ణ సాధికారత లభిస్తుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ చైర్మన్ డాక్టర్ రమణ నాయక్, బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ గౌడ్, బిసి మహిళ నేతలు రాధా రాణి, తారకేశ్వరి, జ్యోతి, సమతా యాదవ్, సంధ్యారాణి, సుజాత, ఉమాదేవి, మీనా, సరిత, విజయలక్ష్మి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్ పోలీసుల నిఘా

ఒక్క నెలలోనే 78 కేసులు నమోదు.. 117 మంది అరెస్ట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో ఫిబ్రవరి నెలలో మొత్తం 78 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని సైబర్ క్రైమ్ అడిషనల్ సిపి ఎం. శ్రీనివాసులు తెలిపారు. 'ఆపరేషన్ ఆక్టోపస్' అనే ప్రత్యేక ఆపరేషన్ ద్వారా, హైదరాబాద్ సిటీ లా అండ్ ఆర్డర్ బృందాలతో కలిసి సైబర్ క్రైమ్ పోలీసులు 16 వివిధ రాష్ట్రాల నుండి 117 మంది నిందితులను అరెస్ట్ చేశామని, వీరికి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో నమోదైన 74 కేసులతో సంబంధం ఉందని పేర్కొన్నారు. బాధితులకు మొత్తం రూ. 34,76,884 విజయవంతంగా రీఫండ్ చేయబడిందని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని అడిషనల్ సిపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.




ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న..

## ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇంటర్ బోర్డు నిబంధనలు పాటించకుండా ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు అఖిల భారత విద్యార్థి సమాఖ్య 'హైదరాబాద్ జిల్లా సమితి' ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ నాంపల్లి కార్యాలయంలో ఇంటర్ బోర్డ్ జాయింట్ సెక్రటరీ వసుందరని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ 'రాష్ట్ర వ్యాపితంగా ఎటువంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నారు. పదవ తరగతి పరీక్షలు పూర్తి కాకముందే విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి మా కళాశాలలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారు. జిల్లాలలో ఉన్న ఇంటర్ విద్యా శాఖా అధికారులు, కార్పోరేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతూ ప్రోత్సహిస్తున్నారు. కావున ప్రైవేట్ ,కార్పోరేట్ విద్యాసంస్థలలో జరుగుతున్న ముందస్తు అడ్మిషన్లపై చర్య తీసుకోవాల్సిందిగా కోరడం జరిగింది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అనిల్ , మెట్టెల చైతన్య యాదవ్, ఓయు అధ్యక్షులు ఉదయ్ కుమార్, శాంతి కుమార్ ,ఆఫీస్ బేరర్లు , రఘు, జోసెఫ్, భాను, అరుణ్ కుమార్, సిద్ధార్థ్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి ఎస్‌సి సెల్ చైర్మన్‌గా కవ్వంపల్లి బాధ్యతల స్వీకారం

హాజరైన టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం, వివేక్, అడ్లూరి, ప్రముఖులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో 17 % ఉన్న ఎస్‌సిలకు 5 ముఖ్యమైన స్థానాలు ఇచ్చామని, భవిష్యత్‌లో పదవుల పంపకాల్లో ఎస్‌సిలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. రాజయ్యను అర్థరాత్రి డిప్యూటీ సిఎం పదవి నుంచి కెసిఆర్ ఎలా తొలగించారో గుర్తు చేసుకోవాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లతో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాలుగు ముక్కలు అయ్యిందని, తెలంగాణలో బిజెపికి చోటులేదన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఎస్‌సి సెల్ చైర్మన్‌గా మానకొండూరు ఎంఎల్ఎ కవ్వంపల్లి సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. గాంధీ భవన్‌లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్‌స్వామి, అడ్లూరి లక్ష్మణ్, ఎఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎ.సంపత్‌కుమార్, ఎంఎల్‌ఎలు వేముల వీరేశం, లక్ష్మీ కాంత్, యెన్నం శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, నాగరాజు, వినోద్, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, మాజీ ఎంఎల్ఎ మోత్కుపల్లి నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ క్లిష్ట సమయాల్లో దళితులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారని, పార్టీలో దళితులకు, ఆదివాసీలకు, బిసిలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. బరువైన బాధ్యతను నమ్మకంతో సిఎంతో కలిసి కవ్వంపల్లి సత్యనారాయణపై పెట్టామన్నారు. కాంగ్రెస్ బలోపేతం కావాలనే ఉద్దేశ్యంతో కవ్వంపల్లి సత్యనారాయణకు పదవి ఇచ్చామని, దళితవాదంతో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు అండగా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. 90 ఏళ్ల తర్వాత కుల సర్వే చేసి అధికారిక డాక్యుమెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్‌సి సమాజం అన్ని రంగాల్లో న్యాయం సాధించేందుకు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఎస్‌సి సెల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కవ్వంపల్లి సత్యనారాయణపై పెద్ద బాధ్యత ఉందని, ఈ అవకాశాన్ని ఎస్‌సి సమాజం సమగ్ర అభివృద్ధికి ఉపయోగించుకోవాలని పార్టీ నాయకులు ఆశిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కార్పొరేషన్లు, ఇతర సంస్థల్లో దళితులకు మరిన్ని స్థానాలు దక్కేలా ఎస్‌సి నాయకులందరూ ఐక్యంగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కవ్వంపల్లి సత్యనారాయణ సారథ్యంలో ఎస్‌సిల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకరావాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి ముఖ్యం విద్య మాత్రమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ నెహ్రూ నుండి రాహుల్ గాంధీ వరకు సామాజిక న్యాయం చేస్తున్నది, దేశ ఐక్యతకు పాటు పడేది కేవలం కాంగ్రెస్ మాత్రమేనన్నారు.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: డివిజన్-30, జిహెచ్ఎంసి.
NIT No. 75 : NIT No.75/E.E.30/GHMC/2025-26 తేది: 11.03.2026
పని పేరు: జిహెచ్ఎంసి, కెజెడ్, డివిజన్-30 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు, అంచనా విలువ: రూ.4.05 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 11.03.2026న సా.5.00గం.ల నుండి మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 12.03.2026న సా.5.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, జిహెచ్ఎంసి 5వ అంతస్తు అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-30, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 16892-PP/CL/ADVT/1/2025-26, Date: 12-03-2026

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, చార్మినార్ జోన్.
Short Tender Notice No. 22/EE.Div.NO.28/GHMC/2025-26 తేది: 12.03.2026
Nit No. Short Tender Notice No. 22/EE.Div.NO.28/GHMC/2025-26, తేది: 12.03.2026. పని వివరణ: నిర్వహణ పనులు (05) నెం.లు, అంచనా విలువ: రూ.74.16 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: ప్రారంభ తేది: 13.03.2026న మ.3.00గం.ల నుండి మరియు స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 17.03.2026న మ.3.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీ షేక్ సనాఉద్దీన్. సెల్ నెం. 7993727669. జతపరచబడినవి: పనుల వివరములు కాపీ.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-28, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 16917-PP/CL/ADVT/1/2025-26, Date: 12-03-2026

తెలంగాణ ప్రభుత్వం దేవాదాయ శాఖ
శ్రీ యల్లమ్మ అమ్మవారి దేవస్థానము
దర్వేశిపురం గ్రామము, కనగల్ మండలము, జిల్లా : నల్లగొండ.
టెండర్ నోటీస్ నెం: 13/SYT/2026 టెండరు కం బహిరంగ వేలము తేది: 11/03/2026
ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! సదరు దేవస్థానమునకు సంబంధించిన టెండరు కం బహిరంగ వేలము వేలము ది: 17-03-2026 వారం రోజున మ. 1:00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.
పూర్తి చేసిన టెండరు టెండరు షెడ్యూలు తేది: 17.03.2026 మ. 12:00 గం.ల వరకు దేవస్థానం నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్స్ నందు వేయవలెను. అదే రోజు మ. 01:00 గం. లకు టెండరుదారుల సమక్షములో దేవాలయ ప్రాంగణం నందు బహిరంగ వేలము నిర్వహించబడును.


| క్ర. సం. | వేలము వివరములు | కాలపరిమితి 1 సం.ము | డిపాజిట్ డబ్బు | సీల్డు టెండర్ షెడ్యూల్ ధర | |
| --- | --- | --- | --- | --- | --- |
| 1 | తలనీలాల సేకరించుకొను హక్కు | తేది: 01.06.2026 నుండి 31.05.2027 వరకు | రూ. 2,00,000/- | రూ. 1000/- | [illegible] |
| 2 | చీరలు, వడిబియ్యం సేకరించుకొను హక్కు | తేది: 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ. 1,00,000/- | రూ. 1000/- | |

డిపాజిట్ నగదు/ డి.డి.లు స్వీకరించబడును. డి.డి.లు కార్యనిర్వహణాధికారి, శ్రీ యల్లమ్మ అమ్మవారి దేవస్థానము, గ్రా. దర్వేశిపురం పేరుమీద తీయవలెను. వేలం పాటలు ప్రస్తుతం ఉన్నటువంటి అధిక పాట రూపాయల మీద నుండి పాట ప్రారంభించడం జరుగును.
నోట్ : సరైన పాట రాకున్న గానీ, సరైన కారణములు తెలుపకనే టెండర్లు రద్దు చేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ దేవాదాయ శాఖ అధికారులకు పూర్తి అధికారము కలదు. ఇతర వివరాలు, వేలం షరతుల కొరకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించగలరు.
సదా శ్రీ అమ్మవారి సేవలో...
కె.భాస్కర్ సహాయ కమీషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ, నల్లగొండ
వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 90000 10884, 9949609848, 9441823191.
సం/- అంబటి నాగిరెడ్డి, కార్యనిర్వహణాధికారి సెల్: 9959198949
DIPR R.O. No. : 16908-PP/CL/ADVT/1/2025-26, Date: 12-03-2026

## వస్త్ర దుకాణాలలో నిషేధిత హుక్కాదందా

గుట్టురట్టు చేసిన పోలీసులు

రూ.15వేల విలువైన హుక్కా ఫ్లేవర్ ప్యాకెట్లు, వైపర్ల స్వాధీనం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** గుట్టు చప్పుడు కాకుండా వస్త్ర దుకాణాలలో కొంతమంది అక్రమార్కులు నిషేధిత హుక్కా దందాను కొనసాగిస్తుండగా సూర్యాపేట పోలీసులు గురువారం చాకచక్యంగా గుట్టును రట్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో ఉన్న ఆర్.వి. ఫ్యాషన్స్, ఎక్స్ట్రీమ్ దుకాణాలలో గుట్టు చప్పుడుగా గత కొంతకాలంగా హుక్కా అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పట్టణ పోలీసులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో రూ.15వేల విలువైన నిషేధిత హుక్కా ఫ్లేవర్ ప్యాకెట్లు, హుక్కా వైపర్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పి కె నరసింహ అధికారికంగా ప్రకటించారు. నిషేధిత హుక్కా సేవించడం వల్ల క్యాన్సర్ వ్యాధి సోకుతుందని, ప్రజల ఆరోగ్యాలను హరించే వ్యాపారాలను ఎవరైనా కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి అమ్మకాలకు సంబంధించి తమకు సమాచారం అందిస్తే అక్రమార్కుల ఆట కట్టిస్తామని చెప్పారు. యువత ఇలాంటి చెడు అలవాట్లకు లోనై తమ జీవితాన్ని ఆగం చేసుకోవద్దని హితవు పలికారు.

## వైభవంగా శోభన్‌బాబు కుమార్తె వివాహం

వధూవరులను ఆశీర్వదించిన

ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ కన్వెన్షన్ హాల్లో సిపిఐ ఎఐటియుసి నాయకులు సామల శోభన్ బాబు కుమార్తె ఆకాంక్ష శ్రీకాంత్‌ల వివాహ వేడుక గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలో సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చిస్తి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తంగళ్లపల్లి రవికుమార్, పోత్నాక్ ప్రమోద్ కుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ జాలిగం విగ్నేష్, సరగడ అమర్ పాల్గొన్నారు. అదేవిధంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బందారపు వెంకటేష్, ఎండీ ఇమ్రాన్ హాజరయ్యారు.

## ఉపాధి హామీ నీటి నిల్వ పనులపై కేంద్ర బృందం పరిశీలన

**ప్రజాపక్షం/నకిరేకల్ (కట్టంగూర్):** మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన నీటి నిల్వ పనులను జలసంచైజల భగీరథ ఇంపాక్ట్ స్టడీ కేంద్ర బృందం గురువారం పరిశీలించి వాటి ప్రభావాన్ని అంచనావేసింది.మండలంలోని కల్మేర,పరడ,ఈదులూర్ గ్రామాల్లో చేపట్టిన సోక్‌పిట్‌లు,ఓవర్‌హెడ్ ట్యాంక్, పెద్ద చెరువు, చెక్‌డాం,ఫారం పాండ్,చేపల చెరువు పనులను బృంద సభ్యులు పరిశీలించారు.ఈ పనుల వల్ల నీటి నిల్వలు పెరిగి ఆయకట్టు రైతుల బోర్లలో నీటి మట్టంమెరుగుపడిందని గమనించారు.దీంతో ప్రాంతంలో పచ్చదనం పెరిగిందని తెలిపారు. ఈదులూర్ గ్రామంలో ఫారం పాండ్‌ను పరిశీలించిన అనంతరం రైతు రాములు మాట్లాడుతూ అందులో నిల్వైన నీరు పత్తి తదితర పంటలకుఉపయోగపడుతోందని తెలిపారు.నీటి ఎద్దడిని తగ్గించడంలో ఫారం పాండ్‌లుఉపయుక్తమవుతున్నాయని వివరించారు. కేంద్ర బృంద సభ్యులు నవనీత్, రాచీ గార్గ్, ప్రతీప్ కోర్ డే నల్లగొండ ,నకిరేకల్ క్లస్టర్ ఏపీడీబీ నరసింహారావు నేతృత్వంలో పరిశీలన జరిగింది.ఈ కార్యక్రమంలో కట్టంగూర్ ఏపీవో కడెం రామ్మోహన్,ఈసీ శ్రీధర్,క్లస్టర్ టీఏ రమణ,ఫీల్డ్ అసిస్టెంట్లు, సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గుండ్లపల్లి స్టేజి వద్ద ఆర్‌టిసి బస్సులు ఆపాలి : సిపిఐ డిమాండ్




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** హైదరాబాద్ యాదగిరిగుట్ట మార్గంలో ప్రయాణించే అన్ని ఆర్టీసీ బస్సులను గుండ్లపల్లి స్టేజి వద్ద నిలపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్ డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించి డిపో సిఐకి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గుండ్లపల్లి నుండి ప్రతి రోజూ వందలాది మంది విద్యార్థులు భువనగిరిలోని కళాశాలలకు వెళ్తుంటారని తెలిపారు. ఉదయం సమయంలో బస్సులు ఆగకపోవడంతో విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంటల తరబడి రోడ్డుపై నిలబడినా డ్రైవర్లు బస్సులు ఆపడం లేదని ఆరోపించారు. గతంలో గోదా యాదగిరి నాయకత్వంలో పోరాటం చేసి, గుండ్లపల్లి రెవెన్యూ పరిధిలోకి బస్టాండ్, డిపో వచ్చేలా సాధించుకున్నామని నాయకులు గుర్తుచేశారు. అధికారులు స్పందించి గుండ్లపల్లి స్టేజి వద్ద అన్ని బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఎఐటియుసి మండల కార్యదర్శి గోపగాని రాజు, వార్డు కార్యదర్శి ముక్కెర్ల పెంటయ్య, భగత్ సింగ్ యూత్ అధ్యక్షుడు కంబాల వెంకటేష్, నాయకులు కంబాల యాదగిరి, తోటకూరి శ్రీశైలం, శెట్టి నరసింహ, సత్యం, బండ రామచందర్ పాల్గొన్నారు.

## ఖదీర్ ఇంట్లో ఎసిబి సోదాలు



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలోని మోత్కూర్ ఎస్టీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఖదీర్ నివాసంలో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. భువనగిరి పట్టణంలో ఉన్న ఆయన ఇంటిపై గురువారం ఆకస్మికంగా దాడులు చేసి పత్రాలు, ఆస్తుల వివరాలను పరిశీలించారు. ఎసిబి అధికారులు ఏకకాలంలో మోత్కూరులోని ఎస్టీఓ కార్యాలయంలో, భువనగిరి పట్టణంలోని ఆయన నివాసంలో సోదాలు నిర్వహించారు.

# గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలి

ప్రజాప్రతినిధులు-అధికారులు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై గ్రామీణ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల శిక్షణ



**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేస్తే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరం,ఏచూరి గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు,గ్రామీణ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని,పట్టణాల్లో పారిశుద్ధ్యం, రోడ్డు భద్రత, యువత మత్తుపదార్థాల నివారణపై దృష్టి పెట్టాలని అన్నారు. రానున్న 5 సంవత్సరాల కాలంలో సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నారుపారిశుద్ధ్యం,డ్రైనేజీ, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని,జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు వస్తే మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాలలో అభివృద్ధిపై దృష్టి సారించాలని, సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు వెళితే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంమిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి, జెడ్‌పిసి ఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డిపిఓ శంకర్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్ హాజరయ్యారు.

### పథకాల అమలులో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ప్రజాపాలప్రగతి ప్రణాళిక సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష జరుగుతున్న తరుణంలో పేద ప్రజలకు ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు నిష్పక్షపాతంగా అమలు చేయాలని ఆయన సూచించారు.రైతుల రుణమాఫీ ఇంకా పూర్తిగా అమలు కాలేదని, మిగిలిన అర్హులైన రైతులందరికీ రుణమాఫీ తక్షణమే అమలు చేయాలని కోరారు. ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు మంజూరు చేసిన తరువాత నిర్మాణ సమయంలో కొత్త ఆంక్షలు విధించి బిల్లులు నిలిపివేయడం సరైంది కాదన్నారు. ఎండాకాలం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అనేక గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందడం లేదని,అధికారులు తక్షణ చర్యలు తీసుకుని అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాలని కోరారు.అలాగే భూగర్భ జలాలు తగ్గిపోవడంతో సాగునీరు లేక పంట పొలాలు ఎండిపోతున్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## కోహేన్స్ ఫార్మసీ కంపెనీలో ప్రమాదం

**షార్ట్ సర్క్యూట్‌తో గ్యాస్ లీకై ఇద్దరికి అస్వస్థత చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు**

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలోని వస్త్రాంతండ, 65వ జాతీయ రహదారి సమీపంలోని కోహేన్స్ ఫార్మసీ కంపెనీలో బుధవారం అర్ధరాత్రి ప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో గ్యాస్ లీకై ఇద్దరు ఉద్యోగులకు గాయాలై తీవ్ర అస్వస్తతకు గురయ్యారు. దీంతో ఫార్మసీ కంపెనీ ఉన్నత అధికారులు వారిని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. దీంతో స్థానికులు, సిపిఐ(ఎంఎల్) నాయకులు కంపెనీ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ జనావాసాల మధ్య ఉన్న ఈ పరిశ్రమ తక్షణమే ఇతర ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి గాయపడ్డ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



## ప్రజల మన్ననలు పొందేలా ప్రజాప్రతినిధులు పనిచేయాలి

మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రజల మన్ననలు పొందేలా ప్రజాప్రతినిధులు పనిచేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి, రాష్ట్ర కెబినెట్ ఆలోచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. ప్రజల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి అవగాహన కల్పించడంతోపాటు అర్హులైన లబ్ధిదారులకు అవి చేరేలా చూడాలన్నారు. ప్రజలకు మంచి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కొంత సమయం కేటాయిస్తే క్షేత్రస్థాయిలో మంచి మార్పు కనిపిస్తుందని సూచించారు. పాలక వర్గాలు లేక గ్రామాలకు నిధులు రాలేదని, గత నెలన్నర కాలంలో పెద్ద ఎత్తున నిధులు విడుదల అయ్యాయని, మార్చి 31 లోపు మరిన్ని నిధులు విడుదల అవుతాయని చెప్పారు. ప్రతి గ్రామానికి జనాభా ఆధారంగా రూ.5లక్షల నుండి రూ.60 లక్షల వరకు నిధులు విడుదల అయ్యాయని, ఈ నిధులు ప్రణాళిక బద్ధంగా వినియోగించాలన్నారు. తెలంగాణలో ఈ ఖరీఫ్ సీజన్‌లో దేశంలో ఎక్కడ లేని విధంగా 148 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండినదని, రైతుల నుండి 72లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి ఒక ఖరీఫ్ పంటకే రైతులకు రూ.20వేల కోట్లు చెల్లించినామన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి, కోదాడ శాసనసభ్యులు మందుల సామేల్, ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి కె నరసింహ, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జడ్‌పి సిఈఓ శిరీష, డిపిఓ యాదగిరి, సిపిఓ కిషన్, డివైఎస్ఓ వెంకటరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణతోపాటు మున్సిపల్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



## యాదగిరి లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/యాదాద్రి:** రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు.ఆలయ ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్‌కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి పూలమొక్కలు అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గవర్నర్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న గవర్నర్ దంపతులకు కార్యనిర్వహణాధికారి భవానీ శంకర్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు 'పూర్ణకుంభం'తో స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ ధ్వజ స్తంభానికి మొక్కి, అంతరాలయంలో స్వామివారికి ప్రత్యేక అర్చన, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం అనుబంధ దేవాలయమైన శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలోని స్పటిక లింగానికి గవర్నర్ దంపతులు అభిషేకం చేశారు. దర్శనం అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి గవర్నర్‌కు స్వామివారి ప్రసాదాన్ని అందజేయగా, కార్యనిర్వహణాధికారి భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపికను (మెమెంటో) బహూకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భార్యపై వేధింపులు.. భర్తకు రెండేళ్ల జైలుశిక్ష

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** భార్యను వేధించిన కేసులో నిందితుడికి నల్లగొండ ప్రత్యేక జెఎఫ్‌సీఎం కోర్టు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు జిల్లా ఎస్‌పిశరత్ చంద్ర పవార్ తెలిపారు.వివరాల ప్రకారం నల్లగొండ మహిళా పోలీస్ స్టేషన్‌లో 2015లో నమోదైన క్రైం కేసులో గిరగాని వేణు వరంగల్ జిల్లా కొండకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన వ్యక్తి. ఆయన ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. భార్యపై వేధింపులకు పాల్పడినందుకు అతనిపై ఐపీసీ సెక్షన్ 498(ఏ) కింద కేసు నమోదు చేసి, పోలీసులు కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన కోర్టు గురువారం నిందితుడు గిరగాని వేణును దోషిగా తేల్చింది.ఐపీసీ సెక్షన్ 498(ఏ) కింద ఒక సంవత్సరం జైలు శిక్ష విధించగా,డౌరి ప్రొహిబిషన్ చట్టం సెక్షన్4 కింద మరో ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే మరో ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అమలులో ఉంటాయని ఎస్‌పి తెలిపారు.

## అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

భువనగిరిలో ప్రజాప్రతినిధులకు 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన పెంచుకుని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుంచాల్సిన బాధ్యత సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, చైర్ పర్సన్లపై ఉందని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం భువనగిరి పట్టణంలోని వికన్వెన్షన్ (న్యూ వివేరా) హాల్లో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక @99 రోజుల కార్యచరణ'లో భాగంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు నిర్వహించిన ఒకరోజు అవగాహన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర గేయం ఆలపనతో ప్రారంభమైన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 6 నుండి జూన్ 12 వరకు కొనసాగే ఈ 99 రోజుల కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ... నూతన ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధికి తోడ్పడుతూ ప్రజలు మెచ్చేలా పాలన సాగించాలని పిలుపునిచ్చారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల వంటి సమస్యలపై తక్షణమే స్పందించాలన్నారు. పంచాయతీ రాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. 10 ప్రధానాంశాల ఆధారంగా గ్రామాలను అందంగా తీర్చిదిద్దాలని, పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేసి పారదర్శక పాలన అందించాలని సూచించారు. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులను వృథా చేయకుండా అంగన్వాడీ భవనాలు, శానిటేషన్ వంటి వినూత్న కార్యక్రమాలకు మళ్లించాలని కోరారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజాప్రతినిధులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిర్మూలనకు, రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రణాళికను వివరించగా, అదనపు కలెక్టర్ భాస్కరరావు, జడ్పీ సీఈవో శోభారాణి, మున్సిపల్ చైర్ పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, పాల్గొన్నారు.

## ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

కోదాడలో షాదీఖానాకు రూ. 3 కోట్లు, ఈద్గాకు రూ.2కోట్లు మంజూరు

రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

**ప్రజాపక్షం/కోదాడ:** ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు జబ్బార్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లౌకిక ప్రభుత్వమని, ముస్లింల సంక్షేమానికి తాను తన సతీమణి ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నామని అన్నారు. ముస్లింల షాదిఖానాకు రూ.3కోట్లు, ఈద్గాకు రూ.2 కోట్లు మంజూరు చేశామని త్వరలో పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. ముస్లింలు చదువుకుని అభివృద్ధి చెందాలన్నారు. ముస్లిం యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. జబ్బార్ తనకు మంచి మిత్రుడని, జబ్బార్ పేదలకు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ ఈద్ ముబారక్ తెలిపారు. కాగా రాష్ట్రంలో ఏర్పడ్డ గ్యాస్ కొరతపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ డీలర్లు కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రేపు హైద్రాబాద్‌లో ఈ సమస్యపై ఛీఫ్ సెక్రటరీతో, గ్యాస్ కంపెనీ యాజమానులతో సమావేశం ఏర్పాటు చేసి గ్యాస్ కొరత లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లేశ్వరి, మాజీ సర్పంచులు ఎర్నేనిబాబు, పారా సీతయ్య, అల్తాఫ్ హుస్సేన్, చింతలపాటి శ్రీనివాసరావు, ఈదుల కృష్ణయ్య, బాగ్దాద్, షాబుద్దీన్, మహిమూద్, జాని, షమ్మి, అలీబాయ్, ఆర్డీవో సూర్యనారాయణ, తహసిల్దార్ వాజీద్‌అలీ, డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, సిఐ శివశంకర్, కమిషనర్ రమాదేవి పాల్గొన్నారు.



## ఆర్‌టిసి బస్సు ఢీకొని మహిళ మృతి

సుభాష్ విగ్రహం చౌరస్తాలో విషాదం

యూ-టర్న్ వ్యవస్థ మార్చాలి

మరో ప్రాణం బలి కాకముందే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి



**ప్రజాపక్షం/నల్లగొండ:** నగరంలోని సుభాష్ విగ్రహం చౌరస్తా వద్ద అర్‌టిసి బస్సు ఢీకొట్టడంతో ఓ మహిళ మృతి చెందిన విషాద సంఘటన గురువారం నల్లగొండ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, కాలినడకన రోడ్డు దాటుతున్న మహిళను యూటర్న్ తీసుకుంటున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో మహిళకు రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనతో నగరంలో విషాద వాతావరణం నెలకొంది.స్థానికుల మాటల ప్రకారం, నల్లగొండ నగర సుందరీకరణలో భాగంగా సుభాష్ విగ్రహం చౌరస్తాను నిర్మించినప్పటికీ రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడం వల్ల బస్టాండ్ నుంచి గడియారం వైపు వెళ్లే బస్సులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా మూల మలుపు వద్ద రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సులను నడిపే కొంతమంది డ్రైవర్లకు సరైన అనుభవం లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్డు ఇరుకుదనం,ట్రాఫిక్ నియంత్రణ లోపం,డ్రైవర్ల నిర్లక్ష్యం కలిసి ఈ ప్రాంతాన్ని ప్రమాదాల కేంద్రంగా మార్చేశాయని వాహనదారులు చెబుతున్నారు.చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నప్పటికీ కొన్ని ఆర్టీసీ బస్సులు వాటిని పట్టించుకోకుండా రాంగ్ రూట్లలో యూటర్న్‌లు తీస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న బస్సుల రద్దీ, రోడ్లపై గుంతలు, స్పష్టంగా కనిపించని బ్లైండ్ స్పాట్లు ఈ ప్రాంతాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తున్నాయని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం దొరకలేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సుభాష్ విగ్రహం చుట్టూ రోడ్లను పునర్వ్యవస్థీకరించి గైడెడ్ యూటర్న్ లేన్లు, ఆటోమేటిక్ బ్యారియర్లు, భద్రతా సెన్సర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.మరో ప్రాణం బలి కాకముందే అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గ్యాస్ సంక్షోభం!

# హాస్టళ్లలో 'ఆహారం కోత'లు..

### సమస్యల్లో 'మధ్యాహ్న భోజనం'

**న్యూఢిల్లీ:** భారతదేశంలో ఎల్‌పిజి గ్యాస్ కొరత క్రమంగా తీవ్రమవుతున్నది. గ్యాస్ సరఫరా అస్థిరత కారణంగా గృహ వినియోగదారుల నుంచి హోటళ్లు, చిన్న వ్యాపారాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వరకు అనేక రంగాలు ప్రభావితమవుతున్నాయి. ముఖ్యంగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం, హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఏర్పడిన ఉద్రిక్తత వల్ల ఇంధన సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఈ మార్గం ద్వారా ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాలో గణనీయమైన భాగం జరుగుతుంది కాబట్టి, అక్కడి పరిస్థితులు భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలపై ప్రభావం చూపుతున్నాయి. భారతదేశంలో వంట గ్యాస్ ప్రధానంగా గృహ అవసరాలకు ఉపయోగపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎల్‌పిజి వినియోగం పెరిగింది. ఈ పరిస్థితుల్లో గ్యాస్ సంక్షోభం ముంచుకొస్తే, ముందుగా గృహావసరాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. సిలిండర్లు సమయానికి అందకపోతే ప్రజలు కట్టెలు, బొగ్గు వంటి సంప్రదాయ ఇంధనాలకు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి. ఇది ఆరోగ్య సమస్యలను, పర్యావరణ కాలుష్యాన్ని పెంచే ప్రమాదాన్ని తెచ్చిపెడుతుంది. ప్రస్తుతం కమర్షియల్ గ్యాస్‌కు కూడా క్రమంగా కొరత ఏర్పడుతున్నట్టు పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. అనేక హోటళ్లు, రెస్టారెంట్లు, తినుబండార కేంద్రాలు పూర్తిగా ఎల్‌పిజి సిలిండర్లపై ఆధారపడతాయి. గ్యాస్ సరఫరా లోపం ఏర్పడితే వ్యాపారులు, ప్రత్యేకించి చిన్న హోటళ్లు, వీధి ఫుడ్ స్టాళ్లు సమస్యలు ఎదుర్కొంటాయి. మధ్యాహ్న ఆహార పథకం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూడా గ్యాస్ కొరత వల్ల సమస్యలు చుట్టుముడుతున్నాయి. పాఠశాలల్లో అమలు చేస్తున్న పిఎం పోషణ్ వంటి పథకాలు గ్యాస్ కొరత కారణంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది. లక్షలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ అందించే ఈ భోజనాన్ని సిద్ధం చేయడానికి ఎల్‌పిజి ముఖ్యమైన ఇంధనం. గ్యాస్ అందకపోతే పాఠశాలలు కట్టెలు లేదా ఇతర ప్రత్యామ్నాయాలపై ఆధారపడాల్సి వస్తుంది. ఇలాంటి చర్యలు తాత్కాలిక ప్రత్యామ్నాయాలే తప్ప, వీటిని దీర్ఘకాలికంగా కొనసాగడం సాధ్యం కాదు. ఈ సమస్యను ఎదుర్కోవడానికి కొన్ని వ్యూహాత్మక చర్యలు అవసరం. మొదటిగా, ప్రభుత్వం గ్యాస్ సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలి. ఆసుపత్రులు, పాఠశాలలు, సామూహిక వంటశాలలు అత్యవసర రంగాలకు అధిక ప్రాధాన్యతనివ్వాలి. అవసరమైతే అత్యవసర నిల్వలను విడుదల చేయడం కూడా ఒక మార్గం. అదే సమయంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించాలి. విద్యుత్ ఆధారిత వంట పరికరాలు, పైప్ గ్యాస్ వ్యవస్థలు, బయోగ్యాస్ వంటి మార్గాలను విస్తృతంగా అభివృద్ధి చేయాలి. నగరాల్లో పైప్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జి) నెట్‌వర్క్‌ను విస్తరించడం ద్వారా సిలిండర్లపై ఆధారాన్ని తగ్గించవచ్చు. గ్యాస్ బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా కట్టడి చేయడం అత్యంత ముఖ్యమైనది. కొరత సమయంలో కొందరు సిలిండర్లను నిల్వచేసి అధిక ధరలకు విక్రయించే ప్రమాదం ఉంటుంది. దీనిపై కఠిన పర్యవేక్షణ అవసరం. సరఫరా వ్యవస్థ పారదర్శకంగా ఉండేలా డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థలను ఉపయోగించాలి. గ్యాస్ వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, అవసరానికి మించి నిల్వ చేయకపోవడం వంటి విషయాలలో ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. వంట సమయంలో గ్యాస్ ఆదా చేసే పద్ధతులను కూడా ప్రోత్సహించాలి. మొత్తం మీద గ్యాస్ సంక్షోభం తాత్కాలికమైనదైనా దాని ప్రభావం విస్తృతంగా ఉంటుంది. సరైన ప్రణాళిక, ప్రత్యామ్నాయ వనరుల అభివృద్ధి, సమర్థవంతమైన నిర్వహణ ద్వారా ఈ సమస్యను అధిగమించడం సాధ్యం. ప్రభుత్వం, పరిశ్రమలు మరియు ప్రజలు కలిసి పనిచేస్తే గ్యాస్ కొరత ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. భారత్‌కు వచ్చే వాణిజ్య నౌకలను హోర్ముజ్ జలసంధి మీదుగా వెళ్లేందుకు ఎలాంటి అడ్డంకులు కల్పించబోమని ఇరాన్ హామీ ఇచ్చినట్టు వస్తున్న వార్తలు కొంత ఊరటనిస్తున్నాయి.




# నివారణ చర్యలు తీసుకుంటున్నాం

### గ్యాస్ సంక్షోభంపై కేంద్ర మంత్రి సురేష్ గోపి

**త్రిస్సూర్ (కేరళ):** దేశంలో ఏర్పడిన ఎల్‌పిజి గ్యాస్ సంక్షోభాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అదనంగా గ్యాస్ సరఫరా పొందేందుకు భారత్‌కు కొత్త మార్గాలు కూడా తెరుచుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, గ్యాస్ సరఫరా సమస్యపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పురి బుధవారం పార్లమెంట్‌లో ఇప్పటికే వివరణ ఇచ్చారని తెలిపారు. అయితే అంతర్జాతీయ దౌత్య సంబంధాల కారణంగా కొన్ని విషయాలను బహిర్గతం చేయలేమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి ద్వారా జరిగే సరఫరాకు సంబంధించిన అంశాలు సున్నితమైనవని చెప్పారు. కాగా, పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో హోర్ముజ్ మార్గం పూర్తిగా మూతబడితే, ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతింటాయని ఐక్యరాజ్య సమితి ఇప్పటికే హెచ్చరించింది. అలా జరిగితే ఆహార ధరలు పెరగడం, జీవన వ్యయం అధికమవడం వంటి ప్రభావాలు కనిపించే అవకాశముంది. ఈ విషయమై వివిధ దేశాలతో ప్రధాని నరేంద్ర మోదీ చర్చలు జరిపారని గోపి అన్నారు. కొన్ని ప్రత్యేక మినహాయింపులు కోరుతూ ఈ చర్చలు సాగినట్టు పేర్కొన్నారు. ఖచ్చితమైన గణాంకాలను వెల్లడించలేనప్పటికీ, భారత్‌కు అదనంగా ఎల్‌పిజి సరఫరాకు ఎలాంటి ఆటంకం ఉండదనే విశ్వసిస్తున్నట్టు చెప్పారు.




గ్యాస్ కొరత కారణంగా ప్రజల రోజువారీ జీవితంపై ప్రభావం పడుతున్నప్పటికీ, అత్యవసర సేవలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రులు, శ్మశానవాటికలు వంటి అవసరమైన సేవలకు గ్యాస్ సరఫరా నిరంతరంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనేక దేశాలలో గ్యాస్ సంక్షోభం ప్రభావం కనిపిస్తున్నప్పటికీ, పరిస్థితిని అధిగమించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. గ్యాస్ ధరలను నియంత్రించేందుకు ఒక విధానం అమల్లో ఉందని, దాని ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని సురేష్ గోపి వివరించారు. ప్రస్తుతం ఉన్న సంక్షోభ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నదని ఆయన తెలిపారు.

## నేతాజీ అస్తికలపై పిటిషన్ స్వీకరణకు సుప్రీం నిరాకరణ

**న్యూఢిల్లీ:** నేతాజీ అస్తికల విషయంలో దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. జపాన్‌లోని టోక్యో నగరంలోని రెంకోజీ టెంపుల్ వద్ద ఉన్నాయని భావిస్తున్న నేతాజీ అస్తికలను భారతదేశానికి తీసుకురావాలని కోరుతూ ఈ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను నేతాజీ కుటుంబానికి చెందిన ఆయన మనవడు ఆశిస్ రే దాఖలు చేశారు. ఈ కేసును ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌తో పాటు న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చీ, విపుల్ ఎం. పాంచోలీతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, నేతాజీ అస్తికలకు తగిన గౌరవంతో ముగింపు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. అయితే కోర్టు ఈ పిటిషన్‌పై ఆసక్తి చూపలేదు. గతంలో కూడా ఇదే అంశంపై ఒక పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించినట్లు ధర్మాసనం గుర్తుచేసింది. కోర్టు ముఖ్యంగా ఒక కీలక ప్రశ్నను లేవనెత్తింది. నిజంగా అవి నేతాజీ అస్తికలేనని నిరూపించే స్పష్టమైన ఆధారాలు ఉన్నాయా? అని ప్రశ్నించింది. అలాగే నేతాజీ వంటి మహానేతకు దేశం మొత్తం గౌరవం చూపుతుందని కూడా పేర్కొంది. మరొక ముఖ్యమైన అంశంగా, నేతాజీకి వారసురాలైన ఆయన కుమార్తె అభిప్రాయం కీలకమని కోర్టు తెలిపింది. ఆమె స్వయంగా కోర్టు ముందు రావాలని సూచించింది. కుటుంబ సభ్యుల మధ్య కూడా ఈ విషయంపై విభేదాలు ఉన్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ పరిస్థితుల్లో పిటిషనర్ తరఫు న్యాయవాది పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి కోరగా, సుప్రీంకోర్టు దాన్ని అనుమతించింది.

# ముడి చమురు సరఫరాపై తీవ్ర అనిశ్చితి

### పెరుగుతున్న ధరలు.. ప్రజల్లో భయాందోళనలు
### భారత్‌లోనూ ప్రభావం చూపుతున్న యుద్ధ పరిస్థితులు

**న్యూఢిల్లీ/ బ్యాంకాక్:** ప్రపంచ మార్కెట్లలో ముడి చమురు ధరలు ఇటీవల తీవ్ర మార్పులకు లోనవుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణంగా భావించే 'బ్రెంట్ క్రూడ్ ఆయిల్' ధర బ్యారెల్‌కు 120 డాలర్లను చేరింది. ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులను పేర్కోవాలి. అదే విధంగా, హోర్ముజ్ జలసంధి వద్ద నెలకొన్న ఉద్రిక్తతలు కూడా క్రూడ్ ఆయిల్ సరఫరాపై అనిశ్చితిని పెంచుతున్నాయి. వివిధ దేశాల నుంచి రవాణా అయ్యే చమురులో సుమారు నాలుగో వంతు ఈ మార్గం ద్వారానే వెళుతుంది. ఈ ప్రాంతంలో నౌకాశ్రయ రవాణా దాదాపు నిలిచిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాపై అనిశ్చితి పెరిగింది. ఇరాన్ వాణిజ్య నౌకలపై దాడులు చేయడం, గల్ఫ్ దేశాలలోని చమురు క్షేత్రాలు, రిఫైనరీలను లక్ష్యంగా చేసుకోవడం వల్ల సరఫరా తగ్గే ప్రమాదం ఉందనే భయం మార్కెట్లలో ఏర్పడింది. దీనివల్ల చమురు ధరలు ఒక్కసారిగా 9 శాతం పైగా పెరిగాయి. అదే సమయంలో అమెరికా ప్రమాణమైన వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ఆయిల్ ధర కూడా బ్యారెల్‌కు సుమారు 94 డాలర్లకు చేరింది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఇఎ) అత్యవసర చర్యలు తీసుకుంది. ప్రపంచ మార్కెట్లలో ధరల ఒత్తిడిని తగ్గించేందుకు తమ అత్యవసర నిల్వల నుంచి సుమారు 400 మిలియన్ బ్యారెల్ల చమురును విడుదల చేయాలని నిర్ణయించింది. ఇదే సమయంలో అమెరికా కూడా తన 'వ్యూహాత్మక పెట్రోలియం రిజర్వ్' నుంచి 172 మిలియన్ బ్యారెల్ల చమురును విడుదల చేయనున్నట్టు ప్రకటించింది. దీనివల్ల మార్కెట్లలో సరఫరా కొంత పెరిగి ధరలు అదుపులోకి వస్తాయని ఆశిస్తున్నారు. అయితే యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో స్పష్టత లేకపోవడం వల్ల చమురు ధరలలో తీవ్ర హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. విశ్లేషకుల అంచనాల ప్రకారం పరిస్థితి మరింత తీవ్రతరమైతే ఒక బ్యారెల్ చమురు ధర 140 డాలర్ల వరకు చేరే ప్రమాదం ఉంది. ఈ అనిశ్చితి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతోంది. చమురు ధరలు పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా రవాణా ఖర్చులు, ఇంధన, విద్యుత్ ఉత్పత్తి వ్యయాలు పెరుగుతాయి. దీని ప్రభావం ఆహార ధరలపై కూడా పడుతుంది. ఇప్పటికే అమెరికాలో వినియోగదారుల ధరలు గత ఏడాదితో పోలిస్తే 2.4 శాతం పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. గ్యాసోలిన్ ధరలు పెరగడం వల్ల ఈ ద్రవ్యోల్బణం మరింత అధికమకమవుతుందని అంటున్నారు. చమురు ధరల పెరుగుదల కారణంగా ప్రపంచ స్టాక్ మార్కెట్లలో కూడా పడిపోవడం కనిపించింది. జపాన్‌లోని నిక్కెయ్ 225, దక్షిణ కొరియాలోని కాస్పీ, హాంకాంగ్‌లోని హాంగ్ సెంగ్ ఇండెక్స్ వంటి ప్రధాన సూచీలు తగ్గాయి. పెట్టుబడిదారులు భవిష్యత్ ఆర్థిక పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆర్థిక వృద్ధి మందగించడం, ద్రవ్యోల్బణం ఒకేసారి పెరగడం అనే 'స్టాగ్‌ఫ్లేషన్' మరో ఆర్థిక ప్రమాదంగా మారే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. చమురు ధరలు పెరగడం, ఉద్యోగ అవకాశాలు తగ్గడం వంటి కారణాల వల్ల ఈ ప్రమాదం పెరుగుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొత్తంగా చూస్తే, పశ్చిమాసియాలోని యుద్ధ పరిస్థితులు చమురు ధరలను మాత్రమే కాదు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి.



# గ్యాస్ ఏజెన్సీల వద్ద కట్టుదిట్టమైన భద్రత



న్యూఢిల్లీ: ఎల్‌పిజి గ్యాస్ సరఫరా లోపం తీవ్ర సమస్యగా మారడంతో, దేశ రాజధాని న్యూఢిల్లీలోని పలు గ్యాస్ ఏజెన్సీల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. గ్యాస్ కొరత కారణంగా నల్లబజార్ (బ్లాక్ మార్కెటింగ్) పెరిగే అవకాశం ఉందని భావించి పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రజలకు గ్యాస్ సిలిండర్లు సరైన విధంగా అందేలా చూసేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్యాస్ ఏజెన్సీల జాబితాను సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పోలీసుల ప్రకారం, గ్యాస్ ఏజెన్సీల వద్ద పోలీసులు, పిసిఆర్ వాహనాలు, మోటార్ సైకిల్ పట్రోలు బృందాలను నియమించారు. గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం లేదా అధిక ధరలకు అమ్మడం వంటి చర్యలను అడ్డుకోవడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశ్యం. గ్యాస్ సరఫరా కొరతను ఉపయోగించుకుని కొందరు వ్యాపారులు సిలిండర్లను అధిక ధరలకు విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కొంతమంది దుకాణదారులు చిన్న సిలిండర్లను అక్రమంగా నింపి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని కూడా పోలీసులు గుర్తించారు. ఇటువంటి చర్యలు కేవలం చట్ట విరుద్ధమే కాకుండా ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు. అనధికారికంగా సిలిండర్లను నింపడం వల్ల అగ్నిప్రమాదాలు లేదా పేలుళ్లు జరిగే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో సాధారణ దుస్తుల్లో ఉన్న పోలీసు సిబ్బంది కూడా గ్యాస్ ఏజెన్సీల పరిసర ప్రాంతాలను గమనిస్తూ సమాచారం సేకరిస్తున్నారు. ఎవరైనా గ్యాస్ సిలిండర్లను అక్రమంగా అమ్ముతున్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా, కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఖాళీ సిలిండర్లతో గ్యాస్ కోసం తిరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. సాధారణంగా రూ.1000–1100కి లభించే గ్యాస్ సిలిండర్ కొన్నిచోట్ల రూ.3000 నుంచి రూ.4500 వరకు నల్లబజార్‌లో అమ్ముతున్నట్లు సమాచారం. పరిస్థితి దృష్ట్యా పోలీసులు గ్యాస్ సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు కొనసాగిస్తున్నారు.


# కట్టెల పొయ్యిపై వంటలు

**కోల్‌కతా/ న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్‌లో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత ఇప్పుడు పాఠశాలల మధ్యాహ్న భోజన కార్యక్రమంపై ప్రభావం చూపుతున్నది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో వంట గ్యాస్ అందకపోవడంతో విద్యార్థులకు అందించే భోజనాన్ని సిద్ధం చేయడం కష్టంగా మారింది. సాధారణంగా మధ్యాహ్న భోజన పథకం కింద ప్రతిరోజూ గ్యాస్ సిలిండర్లతో వంట చేస్తారు. అయితే ఇటీవల సరఫరా తగ్గిపోవడంతో కొన్ని పాఠశాలలు ప్రత్యామ్నాయ ఇంధనాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఉదాహరణకు, దక్షిణ 24 పరగణాస్ జిల్లాలోని కృష్ణచంద్రాపూర్ హై స్కూల్‌లో సుమారు 1500 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి. కానీ గ్యాస్ సిలిండర్లు అందకపోవడంతో మార్చి 11న పాఠశాల అధికారులు మట్టి పొయ్యిలను ఉపయోగించి కట్టెలతో వంట చేయించారు. ముందుగానే గ్యాస్ కొరత వచ్చే అవకాశం ఉందని భావించి కట్టెలను నిల్వచేసినా, అవి ఎక్కువ రోజులు సరిపోవని అధికారులు అంటున్నారు. అలాగే నాదియా జిల్లాలోని బరోజాగులీ గోపాల్ అకాడెమీ పాఠశాలలో కూడా గ్యాస్ సిలిండర్లు పూర్తిగా అయిపోయాయి. ఈ కారణంగా అధికారులతో స్థానిక గ్యాస్ సరఫరాదారులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యాహ్న భోజన పథకం ఆగకూడదని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. మరోవైపు రాణి రష్మోనీ హై స్కూల్‌లో గ్యాస్ కొరత కారణంగా పూర్తిస్థాయి వంట చేయలేక విద్యార్థులకు పరిమితమైన ఆహారం మాత్రమే అందిస్తున్నారు. దేశ వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. దేశంలో ఎల్‌పిజి గ్యాస్ సరఫరాపై అనిశ్చితి పెరగడంతో ప్రజలు ప్రత్యామ్నాయ వంట పద్ధతుల వైపు మళ్లుతున్నారు. ఫలితంగా, ఇండక్షన్ కుక్‌టాప్‌లు, ఇతర విద్యుత్ వంట పరికరాల అమ్మకాలు అకస్మాత్తుగా పెరిగాయి. గ్యాస్ సిలిండర్లు సరిపడా లభించకపోవచ్చనే భయంతో ప్రజలు, రెస్టారెంట్ల యజమానులు ముందుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం ప్రారంభించారు. కనాట్ ప్లేస్‌లో ఉన్న ఒక కిచెన్ ఉపకరణాల దుకాణ యజమాని తెలిపిన ప్రకారం, గత రెండు రోజులుగా కస్టమర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. సాధారణంగా ఇండక్షన్ స్టవ్‌లను ఎక్కువగా హోటళ్లు, రెస్టారెంట్లు మాత్రమే కొనుగోలు చేసేవి. కానీ ఇప్పుడుగ్యాస్ సరఫరా నిలిచిపోతుందేమో అనే ఆందోళనతో సాధారణ గృహాల ప్రజలు కూడా విద్యుత్ ఆధారిత వంట పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. దుకాణాలకు వచ్చిన వినియోగదారుల సంఖ్య మాత్రమే కాకుండా ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ విచారణలు కూడా పెరిగాయి. ఇండక్షన్ స్టవ్‌లతో పాటు వాటికి అనుకూలమైన పాత్రలపై కూడా డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు, కాస్ట్ ఐరన్ పాన్‌లు వంటి ఇండక్షన్‌కు సరిపడే పాత్రల అమ్మకాలు కూడా పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. కొన్ని దుకాణాల్లో ఇండక్షన్ కుక్‌టాప్‌ల అమ్మకాలు సుమారు 70 నుండి 75 శాతం వరకు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. గ్యాస్ కొరత ప్రభావం రెస్టారెంట్లపై కూడా కనిపిస్తోంది. దేశంలోని అనేక రెస్టారెంట్లు వంట కోసం ప్రధానంగా ఎల్‌పిజి సిలిండర్లపై ఆధారపడతాయి. సరఫరా తగ్గడంతో కొంతమంది రెస్టారెంట్లు తాత్కాలికంగా విద్యుత్ ఆధారిత వంట విధానాలను ప్రయత్నిస్తున్నాయి. అయితే అన్ని వంటకాలను ఇండక్షన్ లేదా విద్యుత్ పరికరాలతో తయారు చేయడం సాధ్యం కాకపోవడంతో మెనూను పరిమితం చేయాల్సి వస్తోంది. కొన్ని చిన్న హోటళ్లు , తినుబండార కేంద్రాలు కట్టెలు లేదా బొగ్గు వంటి సంప్రదాయ ఇంధనాల వైపు కూడా మళ్లుతున్నాయి. ఈ అనిశ్చితి ఎంతకాలం కొనసాగుతుందనేది ప్రశ్న.




# రూ. 'కోటి' కేసు 'సుప్రీం' కొట్టివేత

**న్యూఢిల్లీ:** ఒక ఆసక్తికరమైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు గురువారం కొట్టివేసింది. లక్నోకు చెందిన న్యాయవాది అశోక్ పాండే దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో, మాజీ ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాను రక్షించేందుకు 2018లో తాను దాఖలు చేసిన ఆరు కేసుల కోసం రూ.1 కోటి ఫీజు, ఖర్చులు చెల్లించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఈ కేసును సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌తో పాటు న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చీ, విపుల్ ఎం. పాంచోలీతో కూడిన ధర్మాసనం పరిశీలించింది. అనంతరం ఇది పూర్తిగా తప్పుదారి పట్టిన అభ్యర్థనగా పేర్కొంటూ కొట్టివేసింది. న్యాయవాది అశోక్ పాండే వాదన ప్రకారం, 2018లో అప్పటి సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తులు నిర్వహించిన ఒక మీడియా సమావేశం నేపథ్యంలో తాను ఆరు కేసులు దాఖలు చేశానని చెప్పారు. అప్పటి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా గౌరవాన్ని కాపాడేందుకు, న్యాయవ్యవస్థను రక్షించేందుకు తాను ఈ కేసులు వేసినట్లు తెలిపారు. ఈ కేసుల కోసం తాను సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేశానని, ఆ డబ్బును తన కుమార్తె నుంచి తీసుకున్నానని కూడా ఆయన కోర్టుకు వివరించారు. అయితే కోర్టు ఈ వాదనలను అంగీకరించలేదు. ఆ కేసులను సంస్థ కోసం చేసిన సామాజిక సేవగా పేర్కొంది. ఇలాంటి సామాజిక సేవకు ధర నిర్ణయించడం సాధ్యం కాదని వ్యాఖ్యానించింది. దాన్ని ఒక కోటి లేదా రెండు కోట్ల రూపాయలుగా ఎలా అంచనా వేయగలం? అని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. 'మీరు చేసిన పని సామాజిక సేవగా భావిస్తే మేము దానికి అభినందనలు తెలుపుతాం' అని కూడా ధర్మాసనం పేర్కొంది. ఇంతకు ముందు అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ కూడా ఈ పిటిషన్‌ను తిరస్కరించింది.



అలాగే న్యాయ మంత్రిత్వ శాఖ కూడా 2024లో ఆయన చేసిన రూ.1 కోటి చెల్లింపు డిమాండ్‌ను తిరస్కరించింది. చివరగా సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పును సమర్థిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో అశోక్ పాండే చేసిన రూ.1 కోటి ఫీజు మరియు ఖర్చుల డిమాండ్‌కు పూర్తిగా తెరపడింది.

**అమరవీరులను గౌరవించండి..**

ఒక యుద్ధ స్మారక చిహ్నం నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ దాన్ని విచారణకు స్వీకరించడానికి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌తో పాటు న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చీ, విపుల్ ఎం. పాంచోలీతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికులను గౌరవించాలని పిటిషనర్‌కు కోర్టు సూచించింది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న 'సైన్య ధామ్' అనే యుద్ధ స్మారక చిహ్నానికి సంబంధించిన కేసు ఇది. పిటిషనర్ వాదన ప్రకారం, ఈ స్మారక చిహ్నం నిర్మిస్తున్న భూమి అటవీ భూమి కావడంతో అక్కడ నిర్మాణం చేయకూడదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఉత్తరాఖండ్ హైకోర్టు ఈ ఏడాది జనవరిలో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టు ఇప్పటికే ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి పిటిషనర్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన సైనికుల కోసం నిర్మిస్తున్న స్మారక చిహ్నంపై మీకు అభ్యంతరం ఉందా? కనీసం వారి త్యాగాన్ని గౌరవించాలి కదా?' అని వ్యాఖ్యానించారు. హైకోర్టు ఈ పిటిషన్‌ను కేవలం కొట్టివేయడమే కాకుండా భారీ జరిమానాతో తిరస్కరించాల్సిందని కూడా ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ పిటిషన్ వెనుక ఎవరి ప్రేరణ ఉందో తెలుసుకునేందుకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని కోర్టు ఆలోచించింది. ఇది కావాలని దాఖలు చేసిన తప్పుడు పిటిషన్‌లా కనిపిస్తోందని కూడా పేర్కొంది. పిటిషనర్‌పై ఒక లక్ష రూపాయల జరిమానా విధిస్తూ కేసును కొట్టివేయాలని కోర్టు సూచించింది. అయితే, ఈ పరిస్థితిలో పిటిషనర్ తరఫు న్యాయవాది పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి కోరారు. కోర్టు ఆ అభ్యర్థనను అనుమతించింది. ఇక రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో ఇచ్చిన వివరాల ప్రకారం, ఈ భూమిపై రెవెన్యూ శాఖ మరియు అటవీ శాఖ కలిసి సంయుక్త సర్వే నిర్వహించాయి. ఆ నివేదికలో ఈ భూమి అటవీ భూమి కాదని స్పష్టంగా పేర్కొన్నట్లు ప్రభుత్వం తెలిపింది. అటవీ శాఖకు కూడా ఈ నిర్మాణంపై ఎలాంటి అభ్యంతరం లేదని వెల్లడించింది. ఈ యుద్ధ స్మారక చిహ్న నిర్మాణం 2021లో ప్రారంభమై ప్రస్తుతం దాదాపు పూర్తయ్యిందని రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు వివరించింది. చివరగా సుప్రీం కోర్టు కూడా ఈ అంశంలో జోక్యం చేసుకోవడానికి అవసరం లేదని భావించి పిటిషన్‌ను విచారణకు స్వీకరించలేదు.

# పశ్చిమాసియా పరిస్థితిపై... ఉభయ సభలలో చర్చ జరగాలి

### కేంద్రానికి ప్రతిపక్ష కాంగ్రెస్ డిమాండ్

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా పరిస్థితి, భారతదేశంపై దాని ప్రభావాల విషయమై ఉభయ సభలలో చర్చ జరగాలని గురువారం ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కేంద్రాన్ని డిమాండ్ చేసింది. అయితే నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ అంశంపై చర్చకు భయపడుతున్నదని, అలాంటి చర్చను మొండిగా నిరాకరిస్తోందని, దీంతో ప్రభుత్వం విధానం ఏమిటన్నది 'ఇప్పటికే దారుణంగా బహిర్గతమైంది' అని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. విద్యుత్ కొరతకు దారితీసిన పశ్చిమాసియాపై పార్లమెంట్‌లో పూర్తి స్థాయి చర్చ జరగాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలతో కలిసి డిమాండ్ చేస్తున్నాయి. దేశ ప్రజలు నిజం తెలుసుకోవాలని కోరుతున్నాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి కమ్యూనికేషన్స్ జైరాం రమేశ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ విదేశీ విధానం ఇప్పటికే దారుణంగా బహిర్గతమైందని విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ దేశంలో విద్యుత్ సంక్షోభం తీవ్రం అవుతోందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నిప్పులు చెరిగారు. 'మోదీ ప్రభుత్వం నకిలీ మూలాల ఆధారిత హామీలు దాని పూర్తి అసమర్థతను తెలియజేస్తున్నాయి. పశ్చిమాసియాలో రాబోయే యుద్ధం గురించి కేంద్ర ప్రభుత్వానికి ముందే తెలుసు. అయినప్పటికీ భారతదేశం ఇంధన సరఫరాను భద్రపర్చడానికి అది ఏమీ చేయలేదు అని ఆయన తన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. సోమవారం పార్లమెంట్ ఉభయసభలలో విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ చేసిన ప్రకటనపై అసంతృప్తి వ్యక్తంచేసిన కాంగ్రెస్ రాజ్యసభ నుంచి వాకౌట్ చేసింది. లోక్‌సభలో నిరసన తెలిపింది. పశ్చిమాసియా పరిస్థితిపై పార్లమెంట్‌లో విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేసిన ప్రకటనను ప్రతిపక్షపార్టీ సోమవారం 'వాస్తవం' అని కొట్టిపారేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ విధానం (తప్పుడు) సాహసోపేతత్వం' ప్రభుత్వం భారతదేశ విదేశాంగ సేవను అణగదొక్కడంతో కలిసి భారతదేశాన్ని 'బానిసత్వం'లోకి నెట్టివేస్తోందని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యానించింది. భారతదేశం ఆసియాలో ఉద్రిక్తతలను తగ్గించాలని సోమవారం కాంగ్రెస్ కేంద్రానికి సూచించింది. ఇంధన భద్రత, వాణిజ్యాన్ని భద్రపర్చడంతో పాటు ఈ ప్రాంతంలోని దాదాపు కోటిమంది భారతీయుల భద్రతను ప్రాధాన్యతగా తీసుకుని, సంభాషణ, దౌత్యం ద్వారా అన్నింటినీ పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఫిబ్రవరి 28న అమెరికాఇజ్రాయెల్ ఒక పెద్ద సైనిక దాడిని ప్రారంభించింది. ఇరాన్ సుప్రీంలీడర్ ఆయతుల్లా ఖమేనీని చంపేశాయి. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ పార్లమెంట్‌లో ఒక సుమోటో ప్రకటన చేస్తూ ఈ ప్రాంతంలోని అన్ని రాష్ట్రాల సార్వభౌమత్వాన్ని, భూభాగ సమగ్రతను కాపాడుకోవడానికి భారతదేశం కట్టుబడి ఉందని అన్నారు. మానవతావాదంపై తీసుకున్న సరైన నిర్ణయంగా భారత ఓడరేవులో ఇరాన్ డాక్‌ను అనుమతించడాన్ని మంత్రి జైశంకర్ సమర్థించారు. ఈ ప్రాంతంలో మారుతున్న పరిస్థితిని భారత ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో పర్యవేక్షిస్తున్నదని ఆయన తెలియజేశారు. సంఘర్షణ ప్రాంతం నుంచి చిక్కుకున్న 67,000 మంది భారతీయులను తిరిగి స్వదేశానికి తీసుకువచ్చామని చెప్పారు.

## ఆన్‌లైన్ మోసాల కేసులో దేశ వ్యాప్తంగా సిబిఐ సోదాలు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా పెద్ద స్థాయి ఆన్‌లైన్ ఆర్థిక మోసం కేసులో దర్యాప్తు చేపట్టిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) గురువారం 15 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. విదేశీ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫారమ్ పివైవైపిఎల్ ద్వారా జరిగిన ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న చార్టర్డ్ అకౌంటెంట్ అశోక్ కుమార్ శర్మను ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయనను కస్టడీకి తీసుకునేందుకు సిబిఐ ప్రయత్నిస్తోంది. ఈ కేసును సిబిఐకి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన సైబర్ నేర విభాగం 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్' (ఐసిసిసిసి) అప్పగించింది.

SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS07UH 4105 | Ranjith Chinthakindi | FORCE TEMPO TRAVELLER -P | 2019 |
| 2 | TS07UC 0104 | Rajesh Renukuntla | TOYOTA INNOVA-P | 2015 |
| 3 | TS15UB 0533 | Ravindhar Reddy Manchinilla | AL 4923 | 2014 |

AUCTION DATE : 14-03-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
D.No:5-11-503 & 504, Kandakatla Gateway 3rd floor, KUC X Road, Hanamkonda - 506009. Cell : 9849955900 & 9573787776

# తెరపైకి మహిళా రిజర్వేషన్ అమలు

చట్ట రూపం పొందినప్పటికీ కోల్డ్‌స్టోరేజ్‌లో పడిన చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్‌ల అమలుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా పావులు కదుపుతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. ఇదే నిజమైతే జనాభాలో సగమైన మహిళలకు శాసన రూపకల్పనలో మరింత భాగస్వామ్యం లభిస్తుంది. దశాబ్దాల పోరాటాల ఫలితంగా 2023 సెప్టెంబర్‌లో నారీ శక్తి వందన అధినియమం పేరిట రాజ్యాంగానికి 160వ సవరణ ద్వారా మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఆమోదించింది. తద్వారా శాసనసభ, లోక్‌సభలో మూడవ వంతు మహిళలకు రిజర్వేషన్‌లు దఖలు అవుతాయి. సరిగ్గా నాటి పార్లమెంటు సార్వత్రిక ఎన్నికలకు ముందు బిజెపి ఈ చట్టం చేయడం ద్వారా తాము మహిళా చట్టాన్ని తీసుకువచ్చామని ప్రచారమైతే చేసుకుంది. కానీ, దాని అమలు మాత్రం మరో దశాబ్దం తర్వాత అనే విధంగా మెలిక పెట్టింది మోదీ ప్రభుత్వం. నిజానికి 2026 తరువాత జరిగే జనాభా లెక్కలు పూర్తయిన అనంతరం నియోజకవర్గాల పునర్విభజన తరువాత వీటిని అమలు చేయనున్నట్లు చట్టంలో చేర్చారు. అంటే 2023లో చట్టం వచ్చినప్పటికీ, మహిళా రిజర్వేషన్‌లు అమలయ్యేందుకు రెండు ఎన్నికల వరకు ఆగవలసిందే. చేతిలో బెల్లం పెట్టి మోచేతిని నాకించిన చందంగా ఉంది. అందుకే రిజర్వేషన్‌లు వచ్చినప్పటికీ అమలుకు దశాబ్దం ఆగాల్సి రావడం మహిళా లోకానికి ఉసూరుమనిపించింది.

ఇప్పుడు అకస్మాత్తుగా మనస్సు మార్చుకొని తక్షణమే మహిళా రిజర్వేషన్‌లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం తలపోస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఇందుకు పార్లమెంటులో విపక్ష పార్టీలతో అనధికార మంతనాలు మొదలెట్టింది. మహిళా రిజర్వేషన్‌ల చట్టాన్ని వెంటనే అమలులోకి తీసుకు వచ్చేందుకు చట్ట సవరణకు ప్రతిపాదనలు తీసుకొని వస్తుంది. ప్రభుత్వ ఉద్దేశాలేవైనా, ఇది ఆహ్వానించాల్సిందే, కానీ మూడేళ్ళ క్రితమే చట్టమైనా తక్షణ అమలుకు గోడలు కట్టిన ప్రభుత్వం, వాటిని కూల్చేందుకు సిద్ధమవటం వెనుక పెద్ద పథకం ఉందనే కథనాలు వెలువడుతున్నాయి.

దేశంలో అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో బిజెపి వరుసగా మూడవ సారి గెలిచే ఎత్తులో భాగమే ఈ తలంపునకు కారణమని తెలుస్తోంది. ఈ రాష్ట్ర శాసనసభకు 2027 మార్చిలో ఎన్నికలు రానున్నాయి. ఆ ఎన్నికల్లో బిజెపి విజయంపై నిరుటి పార్లమెంటు ఎన్నికల ఫలితాలు ప్రమాద ఘంటికలను మోగించాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో బిజెపి లోక్‌సభ సభ్యుల సంఖ్య 62 నుంచి 2024 ఎన్నికల్లో 33కు పడిపోయింది. ఆ లెక్కన శాసనసభ సెగ్మెంట్‌లను చూసుకుంటే సమాజ్‌వాదీ పార్టీకి 178 స్థానాలలో ఆధిక్యత లభించింది. మొత్తం 403 స్థానాలు కలిగిన ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభలో తన భాగస్వామి కాంగ్రెస్‌కు ఆధిక్యం లభించిన శాసనసభ నియోజకవర్గాలను కలుపుకుంటే, ఎస్‌పి సులువుగా మెజారిటీ మార్కును దాటుతుంది. ఇది బిజెపి కలవరపాటుకు కారణమైంది. ఎందుకుంటే 2014లో బిజెపి జాతీయ స్థాయిలో అధికారంలోకి కొనసాగటానికి ఆ రాష్ట్రమే బలమైన పునాది. 2014, 2019 లోక్‌సభ,2017, 2022 శాసనసభ ఎన్నికల్లో బిజెపి గరిష్ట స్థానాలను దక్కించుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో అధికారాన్ని దక్కించుకుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో లోకసభ స్థానాలు తగ్గడంతో, ఆ ప్రభావం జాతీయ స్థాయిలో పడి లోక్‌సభలో మెజారిటీ మార్కును బిజెపి సొంతంగా అందుకోలేకపోయింది. దీంతో టిడిపి, జెడి(యు)ల మద్దతుతో మోదీ మూడవసారి ప్రధాని కాగలిగారు.

కంచుకోటలాంటి రాష్ట్రానికి పడిన బీటలను రాజకీయ చాణక్యంతో మరమ్మత్తు చేసుకోవాలని కాషాయం పార్టీ తలపోస్తోంది. ఇందుకు వచ్చే శాసనసభ ఎన్నికల నాటికి పుంజుకునేందుకు మహిళా రిజర్వేషన్‌ను అస్త్రంగా చేసుకుంటోంది. ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభలో మొదటి నుంచి మహిళల ప్రాతినిధ్యం తక్కువే. ప్రస్తుతం అక్కడ 51 మంది మహిళా ఎంఎల్‌ఏలే ఉన్నారు. ఇది పది శాతానికి కొంత ఎక్కువ. అందులో 30 మంది బిజెపి నుంచే గెలిచారు. గతంలో త్రిపుల్ తలాఖ్‌ను ఎత్తివేయటం ద్వారా మైనారిటీ మహిళల ఓట్లు గెలుచుకున్నామని లెక్కలు వేసుకున్న బిజెపి, ఈ సారి మొత్తంగా మహిళలను ఆకట్టుకోవాలని భావిస్తోంది. అకస్మాత్తుగా మహిళా రిజర్వేషన్‌లు తీసుకొస్తే 120 స్థానాలకు పైగా వారికి దక్కుతాయి. ఆ స్థాయిలో మహిళా నాయకులు బిజెపి యేతర పక్షాలకు లభించటం కష్టమవుతోంది. దీనిని ఉపయోగించుకొని మహిళ ఓట్లను గంపగుత్తగా దక్కించుకొని ఉత్తర్‌ప్రదేశ్‌లో బలాన్ని పెంచుకొని, తద్వారా ఆపై వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి మరింత బలోపేతం కావాలనేది బిజెపి వ్యూహంగా భావించబడుతోంది.

ఎన్నికల కోసం ఏదైనా చేసేందుకు బిజెపి సిద్ధమే. 2016 నవంబర్ 8న ఎవరూ ఊహించని విధంగా వెయ్యి, ఐదొందల నోట్లను రద్దు చేస్తున్నట్లు మోదీ ప్రకటించారు. ఇది ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే చేశారని చెప్పుకుంటారు. ప్రత్యర్థుల వద్ద ఆర్థిక వనరులు నిర్వీర్యం చేసి, తాము అధికారం కైవసం చేసుకునేందుకు నోట్ బందీని తీసుకవచ్చింది. ఇది ఫలించి 2017 ఎన్నికల్లో యుపిలో బిజెపి 312 అసెంబ్లీ సీట్ల భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2022 ఎన్నికల నాటికి 255 స్థానాలకు దిగజారింది. ఇప్పుడు ఎట్లాగైనా అతి పెద్ద రాష్ట్రాన్ని తమ చేతిలో నుంచి జారవిడుచుకోకుండా ఉండడమే, బిజెపికి మహిళా రిజర్వేషన్‌ల అమలుపై తాజా అవ్యాజ్య ప్రేమకు కారణం.

నిజానికి మహిళా రిజర్వేషన్ కోసం పోరాడిన, ప్రధాన రాజకీయ ఎజెండాలోకి తీసుకువచ్చిన ఘనత కమ్యూనిస్టు పార్లమెంటేరియన్ గీతా ముఖర్జీదే. మహిళా రిజర్వేషన్ చట్టం తీసుకువస్తే చాలు, ఇంకేమి వద్దని తనకు వచ్చిన కేంద్ర మంత్రి ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించిన యోధ. ఒకసారి పార్లమెంటులో ప్యానల్ స్పీకర్‌గా ఉండి అకస్మాత్తుగా మహిళా రిజర్వేషన్ బిల్లును చర్చకు తీసుకువచ్చేందుకు కూడా ప్రయత్నించారు. చివరకు సభలో సాధ్యం కాని రోజు కంటతడిపెట్టి, తన భర్త మరణించిన నాడు కూడా ఇంత బాధపడలేదని వెక్కి వెక్కి ఏడ్చిన నిబద్ధురాలు.

ఆ తరువాత యుపిఏ అధ్యక్షురాలు సోనియాగాంధీ పట్టుబట్టి పార్లమెంటు ఎగువసభలో బిల్లును ఆమోదింపచేసి సజీవంగా ఉంచారు. మూడు దశాబ్దాలు చట్టసభల్లో నలిగిన ఈ బిల్లు 2023లో చట్టమైనప్పటికీ, దశాబ్ద కాలం ఎండమావిగా మారింది. ఇప్పుడు స్వార్థ చింతనతో అయినప్పటికీ మహిళా రిజర్వేషన్‌ను ముందుగా అమలులోకి తెచ్చేందుకు రాజ్యాంగ సవరణ బిల్లు తేవాలని ఆలోచించటం, ప్రతిపక్షాల సహకారంకోసం ప్రయత్నించటం ఆహ్వానించదగినదే.



### మహిళలు నాయకత్వం వహించాలి

ఈరోజు మహిళల పాత్రపై ప్రత్యేకంగా మాట్లాడే అవకాశం రావడం ఆనందంగా భావిస్తున్నాను. ముఖ్యంగా వ్యవసాయం, ఆహార ఉత్పత్తి వ్యవస్థల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, విధాన రూపకల్పన, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలు, నాయకత్వ స్థాయిల్లో వారికి ఇంకా ఎక్కువ స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. ఈ రంగంలో మహిళల భాగస్వామ్యం పెరిగితే వ్యవసాయ అభివృద్ధి మరింత సమానత్వంతో ముందుకు సాగుతుంది. మహిళల విజయ కథలను విస్తృతంగా ప్రచారం చేయడం కూడా చాలా ముఖ్యం. సాంకేతికత వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలను తెరవుతోంది. భవిష్యత్తులో మహిళలు వ్యవసాయ రంగంలో నాయకత్వం వహించేలా మనం కలిసి కృషి చేయాలి. ఐక్యరాజ్యసమితి 2026 సంవత్సరాన్ని మహిళా రైతుల అంతర్జాతీయ సంవత్సరంగా ప్రకటించడం కూడా ఈ దిశలో ఒక ముఖ్యమైన అడుగు.

- ద్రౌపది ముర్ము, భారత రాష్ట్రపతి

# మావోయిస్టు పార్టీ రేపటి రూపమేమిటి?

దేశంలో దశాబ్దాలపాటు రహస్య జీవితం నుంచి పీడిత ప్రజల పక్షాన ప్రాణాలకు తెగించి పోరాడిన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఇప్పుడు సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటున్నది. ఆ పార్టీకి భవిష్యత్తు లేదన్న భావన రోజు రోజుకు బలపడుతుంది. మావోయిస్టు పార్టీ వీరాభిమానులు సైతం కాదనలేని పరిస్థితి. తీరు మారక తప్పదనుకుంటున్న మావోయిస్టు పార్టీ రేపటి రూపేంటి అన్న ప్రశ్న చాలామంది మదిలో మెదులు తుంది. సాయుధ పోరాటం స్థానే ప్రజాస్వామిక పద్ధతుల్లో ప్రజల పక్షాన పోరాటాలు సాగిస్తారా అన్నది కూడా చర్చనీయాంశంగా ఉంది. ఒక రూపంలో నుంచి మరో రూపంలోకి శక్తి మారినట్లుగానే దశాబ్దాల పాటు సాగిన మావోయిస్టు పార్టీ ప్రజా ఉద్యమం మార్చి 31 తర్వాత నిద్రావస్థకు చేరుకుంటే క్రియాశీలక కార్యకర్తలు, వీరికి నాయకత్వం వహించిన వారు అస్త్ర సన్యాసం చేసి చేష్టలుడిగి చేతులు కట్టుకుని జీవిస్తారా? ఈ సమాజం గురించి, పాలకుల తీరు గురించి, అణగారిన ప్రజల జీవితాల గురించి, జరుగుతున్న దోపిడీ గురించి ఆలోచించి నోరు విప్పరా? ఒకవేళ నోరు విప్పితే దానికి కానున్న వేదిక ఏమిటన్న ప్రశ్న ఉదయించక తప్పదు. కేంద్ర ప్రభు త్వం మావోయిస్టుల పట్ల అత్యంత కర్కశంగా వ్యవహరించి ఎదురుగానో, వెనకనుంచో, పట్టుకు వచ్చో కాల్చి చంపింది. ప్రభుత్వ హింసాత్మక చర్యల నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులలో సాయుధ పోరాటాన్ని కొనసాగించలేమన్న భావనతో దశాబ్దాల పోరాటానికి సెలవు అని అనేకమంది లొంగుబాట పట్టారు. లొంగిపోయిన వారిలో అతికొద్దిమందిని మినహాయిస్తే మిగిలిన వారంతా సిద్ధాంతం పట్ల అత్యంత విశ్వాసాన్ని ప్రకటించడమే కాదు సమాజ మార్పుకు, దోపిడీ అంతానికి ఆ సిద్ధాంతం తప్ప మరో మార్గం లేదన్నారు. ఆ విశ్వాసంతో ఉన్న వారు ఆ భావనను ఏదో ఒక రూపంలో మళ్లీ ప్రజల్లోకి తీసుకుపోరా? అప్పుడు వారు తీసుకునే నిర్ణయం రేపటి రాజకీయాలపై ప్రభావం చూపవచ్చు. ఈ నేపథ్యంలోనే దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టుల పట్ల కొంత సానుకూలత కనిపిస్తుంది. అది క్రమేపి పెరుగుతుంది. కమ్యూనిస్టు పార్టీలలో ఇప్పటికిప్పుడు వేలు, లక్షల సంఖ్యలో చేరకపోవచ్చు కానీ సమాజానికి కమ్యూనిస్టుల అవసరం ఉందని గుర్తిస్తున్నవారి సంఖ్య పెరుగుతుంది. ఇది కాదనలేని సత్యం. నేను కాకపోయినా ఎవరో ఒకరు కమ్యూనిస్టులుగా ఉంటేనే పాలకుల తీరును ప్రశ్నిస్తారని అది ఈ సమాజానికి అవసరం అన్న భావన చాలామందిలో వ్యక్తమవుతుంది. కమ్యూనిస్టుల ప్రత్యామ్నాయం రాజకీయంగా ఓట్లు, సీట్ల పరంగా కాకపోవచ్చు కానీ మిగిలిన అన్ని అంశాలలో బిజెపికి కాదనలేని ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులే.

1970 దశకంలో కాంగ్రెస్ తీరును ఇప్పుడు బిజెపి తలపిస్తుంది. కాంగ్రెస్‌కు మించి మరో అడుగు ముందుకేసి మతచాందస వాదాన్ని ప్రేరేపిస్తూ మతం మాటున బలపడటం ద్వారా అంతం లేని అధికారాన్ని అనుభవించేందుకు రంగం సిద్ధం చేసుకుంటుంది. ఇదే సమయంలో తమ వ్యతిరేకులను ఏదో ఒక రూపంలో రాజకీయంగానో, భౌతికంగానో ప్రజల నుంచి వేరుచేసే పనిలో ఉంది. ఇందులో అధికారంలో ఉన్నా, లేని బూర్జువా పార్టీలు, వారి నేతలు ఉండటం గమనార్హం. కమ్యూనిస్టులను ఆగర్భ శత్రువుగా భావించే బిజెపి ఇటు అడవులను జల్లెడ పట్టి వీలైనంత మందిని హతమార్చిన తర్వాత అర్బన్ నక్సలైట్ నినాదాన్ని ముందుకు తెచ్చింది. ఇది భవిష్యత్తులో తీవ్ర రూపం దాల్చి ప్రశ్నించే వారిని కట్టడి చేసే ఆయుధంగా మారవచ్చు. దేశంలో ప్రజల పక్షాన ఆలోచించే కమ్యూనిస్టులే బిజెపికి లక్ష్యం. ఇటువంటి పరిస్థితుల్లో మరింత బలాన్ని కూడగట్టుకుని బిజెపికి ఎదురు నిలవాల్సిన స్థితి కమ్యూనిస్టులది. దశాబ్దాల పాటు ఎర్రజెండా నీడలో ప్రజల పక్షాన పనిచేసిన మావోయిస్టు పార్టీ వివిధ స్థాయి నాయకులు ఈ వాస్తవిక సత్యాన్ని గ్రహించాలి. తమ భావజాలానికి అనుగుణంగా ఇప్పుడు రాజకీయాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లొంగిపోయిన వారిలో చాలామంది బహిరంగ వేదికల మీద ఇదే భావాన్ని వ్యక్తీకరిస్తున్నారు. ఇటువంటి వారంతా వామపక్ష ప్రజాతంత్ర శక్తులతో కలిసి పనిచేయటమే సమాజానికి మేలు చేస్తుంది. ప్రజాస్వామిక పద్ధతుల్లో ప్రజా పోరాటాల ద్వారా బిజెపిని నిలువరించేందుకు క్రియాశీలకం కావాలి. దశాబ్దాల త్యాగమయ జీవితానికి అర్థం, పరమార్థం ఉండేరీతిలో మావోయిస్టు పార్టీలో పనిచేసిన నాయకులు, కార్యకర్తల ఆలోచన సాగాలి. భారత కమ్యూనిస్టుపార్టీ మావోయిస్టు రేపటి రూపం మతోన్మాద్మ దోపిడీ శక్తులకు ఎదురొడ్డి పోరాడుతున్న వారికి బలం కావాలి. రాజ్యహింసతో మావోయిస్టుల కమ్యూనిస్టు ఆలోచన, కార్యాచరణ నిస్సారం కావని, రేపటి రాజకీయ రూపం అణగారిన ప్రజలకు, దోపిడీకి గురికాబడుతున్న వారికి బలమై ముందుకు సాగాలని ఆశిద్దాం.

**ఏనుగు వెంకటేశ్వరరావు,**
ప్రజాపక్షం, ఖమ్మం, 94909 52439

# గల్ఫ్‌లో యుద్ధంతో భారత్‌కు ఆర్థిక విపత్తు

ఇరాన్‌లో భౌగోళిక రాజకీయ కంపనతో ఆకస్మిక భయాందోళనతో బ్రెంట్ క్రూడ్ కొనుగోలు జరుగుతోంది. సౌదీ అరేబియాలోని అతిపెద్ద రిఫైనరీ రస్ తనూర, కటార్‌లోని ఎల్‌ఎన్‌జీ మెగా కాంప్లెక్స్ రస్ లఫాన్ ఉత్పత్తి నిలిపివేశాయి. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ట్యాంకర్‌ల ప్రయాణం నిలిచిపోయింది. వాటికి యుద్ధగండం, బీమా ప్రీమియం పెరుగుతున్నాయి, ఆయిలు ట్యాంకర్లపై ఇరాన్ రివల్యూషనరీ గార్డుల దళం దాడుల ముప్పు హెచ్చుతోంది. వివిఎల్‌సిసి/ఎల్‌ఎన్‌జి రవాణా ఛార్జీలు మూడు రెట్లు పెరిగాయి. ఇది భారత్‌కు పెద్ద ఆర్థిక విపత్తును సూచిస్తోంది. భారత్ రోజూ దిగుమతి చేసుకునే 50లక్షల బ్యారల్స్ క్రూడ్ ఆయిల్‌లో 26 లక్షల బ్యారల్స్ గల్ఫ్ దేశాలు, ఇరాన్ నుంచి ఇరుకైన హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణా జరుగుతుంది.

ఇరాన్ గగనతలంలో యుద్ధం, హోర్ముజ్ దిగ్బంధనం దీర్ఘ కాలం కొనసాగితే భారతదేశ కరెంట్ ఖాతా లోటుపై వినాశకర ప్రభావం చూపుతుంది. మోదీ ఛాతీ (56 అంగుళాలు) చరుచుకునే ప్రచారం ఎలా ఉన్నప్పటికీ, ఆసియా కరెన్సీలో అత్యంత బలహీనంగా మన రూపాయి మారకపు విలువ డాలర్‌కు వంద రూపాయలకు పడిపోవటానికి రంగం సిద్ధంగా ఉంటుంది. ద్రవ్య ఒత్తిళ్లతో కరెంటు ఖాతాలోటు విస్తృతం కావటంతో భారత్‌లో ద్రవ్యోల్బణం పెరుగుతుంది. దాంతో దలాల్ స్ట్రీట్ నుండి డాలర్లు ఉపసంహరణ వేగవంతమవుతుంది.

భారతదేశం ఎగుమతుల్లో 15శాతానికి గమ్యం గల్ఫ్. యూరప్, ఆసియాలకు భారత్ ఎగుమతుల రవాణాకు ఓడలకు సరుకు బదిలీ కేంద్రం దుబాయి. గల్ఫ్ దేశాల్లో (జిసిసి)లో పనిచేస్తున్న కోటిమంది భారతీయ కార్మికులు గత సంవత్సరం – విదేశాల నుంచి భారతీయులు జమచేసిన 135 బిలియన్ డాలర్లలో 40 శాతం పంపారు. భారతీయ ఆర్థిక సంపన్నులకు యుఎఇ అభిమాన గమ్యస్థానం. దాని విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, ఐదు నక్షత్రాల హోటళ్ళు, మానవ తయారీ దీవుల్లోని విలాసవంతమైన విల్లా ఆవాసాలు ఇరాన్ డ్రోన్, మిస్సైల్ దాడులకు గురవుతుంటే అవి వారిలో సురక్షితం కాదన్న భయం పుట్టిస్తున్నాయి.

యుఎఇలో నివసిస్తున్న 38లక్షల మంది భారతీయులు భారత్ నుంచి ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులకు మంచి మార్కెట్. అమెరికా తదుపరి ఇదే రెండవ పెద్ద మార్కెట్. దుబాయి ఆస్తి బుడగ ముగింపు, ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ బాంబుదాడులు అక్కడి భారతీయ సంతతికి ఆర్థికంగా, వాణిజ్యపరంగా, దౌత్యపరంగా మానవ విపత్తుగా పరిణమిస్తున్నది. భారతీయ కుబేరులు ఇప్పుడు సింగపూర్, హాంగ్‌కాంగ్, స్విట్జర్లాండ్, మాల్టాలను సురక్షితంగా చూస్తున్నారు.

**రూపాయ పతనం :**

అమెరికా డాలర్‌తో మారకంలో భారత రూపాయి గత రెండేళ్లలో 10శాతం విలువ కోల్పోయింది. 2014 మే నెలలో నరేంద్ర మోదీ తొలిసారి ప్రధానమంత్రిగా ఎన్నికైనప్పుడు డాలర్‌తో రూపాయి విలువ 58. ఇప్పుడది 92కు పడిపోయింది. ఆర్థిక అద్భుతాలు సాధించామని బిజెపి చెప్పుకుంటున్న ఈ దశాబ్దంలో రూపా యి విలువ దారుణంగా 48శాతం క్షీణించింది. గల్ఫ్‌లోని మహా సంపన్నులు భారత ప్రైవేటు ఈక్విటీలో పెట్టుబడులు పెట్టటానికి సందేహించటానికి ఇదొక కార ణం.

**సెప్టెంబర్ వరకూ యుద్ధం!**

అమెరికన్ ప్రతినిధుల సభ (కాంగ్రెస్) 7 ఓట్ల తేడాతో ఇరాన్ పై యుద్ధంలో ట్రంప్‌ను బలపరిచింది. అది పెద్ద వార్త కాదు. యుద్ధం కనీసం సెప్టెంబర్ వరకూ కొనసాగవచ్చని మిలటరీ భావిస్తున్నట్లు పెంటగన్ (రక్షణ శాఖ కార్యాలయం) జారీ చేసిన మెమో గుండెలు గుభేలుమనిపించింది. ఎందుకంటే అది కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికల ప్రచారంలోకి వెళుతుంది. ఇరాన్‌తో యుద్ధాన్ని రిమోట్ కంట్రోలుతో నడుపుతున్న తమ థాంప హెడ్ క్వార్టర్‌కు 100మంది ఇంటెలిజెన్స్ అధికారులు అవసరమని ఆ మెమో పేర్కొన్నది.



1973 యుద్ధ అధికారాల చట్టం ప్రకారం అధ్యక్షుడు విదేశాలకు సైన్యాలను పంపిన తర్వాత 60 రోజులలోపు కాంగ్రెస్ ఆమోదం కోసం రావాలి. కాని సెప్టెంబర్ దాకా యుద్ధమంటే ఆ కాలపరిమితి ఎంతో మించుతుంది. మెజారిటీ అమెరికన్‌లు ఈ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నారు. ట్రంప్ ప్రభుత్వం రోజుకు 1బిలియన్ డాలర్లు పన్ను చెల్లింపుదారుల సొమ్మును వెచ్చిస్తున్నది. మిలటరీ మెమో ఊహిస్తున్నంతకాలం యుద్ధం సాగితే అమెరికా యుద్ధ వ్యయం 100–150 బిలియన్ డాలర్లు అవుతుందని హౌస్ అప్రోప్రియేషన్ కమిటీ సభ్యుడు జోయి మొరెల్లె అంచనా వేశారు. ఇప్పుడు అనుమతి పొందిన ఒక ట్రిలియన్ డాలర్లకు మించి ధనం అవసరమైతే పెంటగాన్ కాంగ్రెస్ ముందుకు రావలసి ఉంటుంది. అమెరికన్‌లలో 27శాతం మాత్రమే (యుద్ధం మొదలు కాక ముందు) ఇరాన్‌తో యుద్ధాన్ని బలపరుస్తున్నారు. అమెరికా కాల్బలాన్ని పంపటాన్ని అనుకూలిస్తారా అన్న ప్రశ్నకు 12శాతం మాత్రమే సుముఖత తెలిపారు.

మరో పూర్వోదంతం రిపబ్లికన్ పార్టీని భయపెడుతున్నది. ఇరాన్ అణ్వస్త్ర సామర్థ్యాలను ధ్వంసం చేయటం యుద్ధం లక్ష్యంగా ట్రంప్, నెతన్యాహు చెప్పారు. అందుకోసం గత సంవత్సరం జరిపిన 12రోజుల యుద్ధం సఫలమైనట్లు అప్పుడు చెప్పారు. మరోవైపు నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయి. ట్రంప్ 150లక్షల మందిని ఆరోగ్య సంరక్షణనుంచి తొలగించారు.

**మొజ్తాబా ఖమేని**

అమెరికా–ఇజ్రాయెల్ బాంబుదాడులు హతమార్చిన ఇరాన్ సుప్రీంలీడర్, తన తండ్రి అలీ ఖమేనీ స్థానంలో మొజ్తాబా ఖమేనీ మార్చి 9(సోమవారం) సర్వోన్నతాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అతివాదులు బలమైన పట్టుకలిగి ఉండటాన్ని ఇది సూచిస్తోంది. ఇరానియన్ సంస్థలు, రాజకీయవేత్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు కొత్త సుప్రీంలీడర్‌కు విధేయతా పూర్వక ప్రకటనలు చేశారు. ఇరాన్‌లో ఇస్లామిస్ట్ ప్రభుత్వాన్ని మార్చాలని దశాబ్దాలుగా పశ్చిమ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఇస్లామిస్ట్ వ్యతిరేక, షియా వ్యతిరేక వైఖరిని ప్రోత్సహించేందుకు దేశంలో ప్రజాస్వామ్యం లేదని, మహిళలను అణచివేస్తున్నారని, సామాజికంగా, ఆర్థికంగా ప్రతిష్టంభన ఏర్పడిందని నోరెత్తి అరిచారు. దీనివెనుకనున్న అసలు వాస్తవం – ఇరాన్ ఆయిలు, ఖనిజ సంపదపై కంట్రోలు సాధించటం, పెట్టుబడిదారీ భావజాలానికి దేశం తలవంచేటట్లు చేయటం. కొత్త సర్వోన్నతాధికారి ఎంపికలో తమకు పాత్ర ఉండాలన్న అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ డిమాండ్‌ను ఇరాన్ నాయకులు లక్ష్యపెట్టకపోవటం గమనార్హం.

ముఖ్య నాయకుణ్ణి అంతం చేయటం ద్వారా తమ వ్యతిరేక ప్రభుత్వాలను మార్చాలనే అమెరికా, పశ్చిమ దేశాల దుష్ట వ్యూహం అమలు తాత్కాలిక అస్థిరత సృష్టించవచ్చుగాని సునాయాసంగా ప్రభుత్వం మార్పును, సుస్థిరతను ఇవ్వలేవని ఇరాక్, సిరియా, లిబియా నిరూపించాయి. నాల్గవ దేశం – ఇరాన్ గూర్చి ఎంత దుష్ప్రచారం చేసినా అది నిలదొక్కుకుని ప్రతిఘటిస్తున్నది. ఇక అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్ తన అధికారాన్ని పటిష్టం చేసుకున్నట్లు కనిపిస్తున్నది.

ఇరాన్ పరిపాలనా సఖ్యతను, భౌగోళిక ఐక్యతను పరిరక్షించుకోగలదా అన్నది ఇప్పుడు దానిముందున్న పెద్ద సమస్య. 'డీప్ స్టేట్' మనుగడ, ప్రభుత్వ వ్యవహారాలు నడిపే సివిల్ బ్యూరోక్రసీ, టెక్నోక్రాటిక్ తరగతి సఖ్యతపై ఇది ఆధారపడి ఉంటుంది. అంతేగాక, రెగ్యులర్ ఆర్మీ(అర్తేష్), ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి) మధ్య ఐక్యత కొనసాగటంపై భౌగోళిక సమగ్రత ఆధారపడుతుందని ప్రొఫెసర్ ఫర్జానెగర్ అభిప్రాయపడ్డారు.

**– మతీన్ ఖలిద్, మార్క్ గ్రుయెన్‌బర్గ్, అసద్ మీర్జా**
**(ఐపిఎ సర్వీస్)**

# 'సర్'తో సమస్య ఎక్కడ వస్తుంది!

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రక్షాళనే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(ఎస్ఐఆర్–సర్) ప్రక్రియ ఇప్పుడు తెలంగాణకు వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 53 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 3.39 కోట్లమంది ఓటర్ల వివరాలను సరిచూసేందుకు ఎన్నికల సంఘం భారీ ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయిలో ఓటర్ల గణన, మ్యాపింగ్ కోసం 35,985 బూత్ లెవెల్ ఆఫీసర్లు (బిఎల్వోలు) రంగంలోకి దిగారు. ప్రతి మండలం, మున్సిపాలిటీలో తహసిల్దార్ స్థాయి అధికారి (అసిస్టెంట్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్) ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఓటర్ల జాబితాలో డూప్లికేషన్ తొలగించేందుకు 2002 ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. తల్లిదండ్రుల రికార్డుల ఆధారంగా ప్రోజెనీ మ్యాపింగ్( వంశవృక్ష నిర్ధారణ) ద్వారా ఓటర్లను ధృవీకరిస్తున్నట్లు తెలిసింది. మొదటి విడతలో బిహార్, యుపి రాష్ట్రాల్లో చేపట్టి పూర్తి చేసినట్లు, రెండో విడతలో భాగంగా ప్రస్తుతం దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్నది. మూడో విడతలో తెలంగాణ సహా మిగతా రాష్ట్రాలకు సంబంధించిన షెడ్యూల్ ఈ ఏడాది ఏప్రిల్–మే నెల మధ్యలో చేపడుతామని తెలిపారు.

**రాజకీయ పార్టీలతో సమావేశం:**

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సర్ ప్రక్రియపై రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించేందుకు వాటి సహకారాన్ని కోరేందుకు ఫిబ్రవరి 5న రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో కీలక సమావేశాన్ని నిర్వహించారు. సర్ ప్రక్రియ చేపట్టినట్టు, దీనిపై అనుమానాలను నివారిస్తూ సహకరించాలని కోరారు.

గతంలో బిహార్ లో జరిగిన ఎస్ఐఆర్ అనుభవాన్ని గుర్తు చేస్తూ, తెలంగాణ లోను స్థానిక నివాసం లేని, మరణించిన వారి ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్స్ ను చేర్పింపు ప్రక్రియ పై అప్రమత్తగా ఉండాలని ఓటర్లకు ప్రతిపక్షాలు సూచిస్తున్నాయి.

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరుగుతున్న ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఇప్పటికే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నది. దీనిపై పలు ప్రతిపక్ష పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇప్పుడు ఈ సర్ ప్రక్రియ.. అందులో భాగస్వాములైన బూత్ స్థాయి అధికారులకు (బిఎల్ఒలు) శాపంగా మారింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో నమోదవుతున్న బిఎల్ఓ ల మరణాలు ఈ ప్రక్రియలో అద్దం పడుతున్నాయి. తీవ్ర పనిఒత్తిడి, నిర్దేశిత టార్గెట్‌ను చేరుకోవాలంటూ అధికారుల నుంచి బెదిరింపులు, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వేధింపులు బిఎల్ఓ లను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ సర్ ప్రక్రియలో ఉన్న బిఎల్ఓ లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు అవుతున్నాయి. మరోవైపు గుజరాత్‌లోని సర్ లో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న బిఎల్ఓ ల పరిస్థితి కూడా అదే విధంగా ఉన్నది. అహమదాబాదులోని ఖోక్రా డేటా అప్‌లోడింగ్ సెంటర్ వద్ద దాదాపు 20,050 మంది బిఎల్వోలు తమ పనిని నిలిపివేసి మరీ ధర్నాకు దిగారు.

సర్ పనుల్లో భాగంగా తాము తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని ఆరోపించారు. మరో పక్క తాము ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపకుండా అధికారులు బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. ప్రాథమిక పాఠశాల అధ్యాపకులైన ఈ బిఎల్ఓలు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సరైన మార్గదర్శకత్వం ఇవ్వకుండానే కఠినమైన గడువులను పెడుతున్నారని తమ బాధను వెళ్లగక్కుతున్నారు. ముఖ్యంగా మహిళ బిఎల్ఓ ల ఫోన్ నెంబర్లు బహిర్గతం కావడంతో రాత్రి వేళల్లో కాల్స్ వస్తున్నాయని దీంతో తాము వేధింపులకు గురవుతున్నామని వారు చెప్పారు.

**సర్వర్ సమస్యలు..**

ఎక్కువ పని గంటల పట్ల కూడా బిఎల్ఓ లు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం 7 గంటలకు సెంటర్‌కు చేరి మధ్యాహ్నం వరకు ఫీల్డ్ వర్క్ చేసి, తిరిగి అప్లోడింగ్ పనులకు రావటంతో తాము తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నామని వివరించారు. సర్వర్ సమస్యలతో రాత్రి వేళలోనూ పని చేయాల్సి వస్తుందని చెప్పారు. అర్ధరాత్రి 12, 1 గంట సమయాల్లోనూ అధికారులు ఫోన్ చేసి సర్వర్ పని చేస్తే వెంటనే డేటా ఎంట్రీ చేయాలని చెప్తారు.

**అవగాహన కల్పించకపోవడం తప్పు :**

సమగ్ర ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్ఆర్) పత్రములో ప్రతి ఓటరు వ్యక్తిగత వివరాలను నింపాలి. పుట్టిన తేదీని, ఆధార్ కార్డు సంఖ్యను (తప్పనిసరి కాదు), తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి పేర్లను, ఓటర్ కార్డు గుర్తింపు సంఖ్య ఉంటే దానిని ఇవ్వాలి. అంతవరకు బాగానే ఉంది. ఎస్ఐఆర్ పత్రంలో దిగువ(రెండో) భాగంతోనే పేచీ వస్తోంది. అందులో ప్రతి ఓటరు తమ కుటుంబం గత 23 ఏళ్లుగా భారతదేశంలోనే నివసిస్తున్నట్లు ధృవీకరించే వివరాలను ఇవ్వాల్సి ఉంటుంది. ఓటర్లు ఈ దేశ పౌరులేనని నిర్ధారించడానికి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణమిది. ఈ వివరాలను ఇవ్వని వారి పేర్లను ఓటరు జాబితాల నుంచి కొట్టేసే ప్రమాదం ఉంది. అయితే ఈ మాటను అధికారికంగా బయటకు చెప్పకపోవడం వేరే సంగతి.

**పాత వివరాలు వెతకడం ఎలా?**

తాజా ఎస్ఐఆర్ దరఖాస్తు పత్రంలో ప్రస్తుత ఓటరు ఫారం దిగువ భాగంలో 2003 నాటి వ్యక్తిగత వివరాలను కానీ, అతడు లేదా ఆమె తాత తండ్రుల పేర్లను కానీ ఇవ్వాలి. 2003 నాటి ఓటరు జాబితాలను ఎన్నికల సంఘం వెబ్ సైట్ లో ఉంచారు. ఏ ఓటర్ అయినా 2003 జాబితాలోని తన అసెంబ్లీ నియోజకవర్గం కానీ, పోలింగ్ బూత్ కానీ స్పష్టంగా తెలియకపోతే చిక్కులో పడినట్లే. తల్లితండ్రులు, తాత నాయనమ్మల పేర్లను వెబ్‌సైట్లో వెతకడం కష్టం. అవి పిడిఎఫ్ రూపంలో, ప్రాంతీయ భాషలో ఉండటమే దీనికి కారణం. ఉదాహరణకు ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి వివరాలు హిందీ భాషలో పిడిఎఫ్ రూపంలో ఉన్నాయి. ఓటరు దీర్ఘకాలంగా ఒకే చోట నివసిస్తున్నా, నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం మారిపోయి ఉండవచ్చు. సర్ ఫారం ఎగువన స్థానిక బూత్ స్థాయి అధికారుల(బీఎల్ వో ల) ఫోన్ నెంబర్లు ఇవ్వడం కొంత నయమని చెప్పాలి. అయితే, ఓటరు వారికి ఫోన్ చేసి బూత్ గురించి తెలుసుకోవాలనుకున్నా, ఆ సమయములో బిఎల్వోలు వేరే పనులు ఉంటే ఫోన్ ఎత్తకపోవచ్చు. అంతకన్నా పై అధికారుల పరిస్థితి కూడా అలాగే ఉండవచ్చు. కొంతమంది బిల్ వోలు, ముఖ్యంగా గ్రామాల్లోని వారు సర్ పత్రంలోని మొదటి (ఎగువ) భాగాన్ని నింపి ఇచ్చివేయాలని, వివరాలను వారే భర్తీ చేస్తున్నారు. రెండు (దిగువ) భాగంలోని వివరాలను వారే భర్తీ చేస్తున్నారు. ఒకవేళ బిఎల్ఒలు ఫారం దిగువ భాగాన్ని నింపలేకపోతే పత్రం సగం ఖాళీగా మిగిలిపోతుంది. ఖాళీ పత్రాలను సమర్పించిన తర్వాత ఓటరుకు 2003 నాటి వివరాలు తెలిస్తే, వాటిని స్వీకరించడానికి తమకు అధికారం లేదంటూ బిఎల్వో లు నిరాకరిస్తున్నారు. గడువులోగా పని పూర్తి చేయాలని పై వాళ్ళ నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక కొందరు బిఎల్ఓ లు తమకు తోచిన వివరాలతో ఫారాలను నింపేస్తున్నట్లు తెలుస్తుంది. ఇలాంటి ఓటర్ల పేర్లు గడువు తేదీకల్లా ప్రచురితమయ్యే తొలి జాబితాలో లేకపోతే, కొత్త ఓటర్లుగా రిజిస్టర్ కావడానికి నెం.6 ఫారాన్ని సమర్పించాల్సి వస్తుంది. కొంతమంది ఓటర్ల పేర్లు వారి తాతతండ్రుల పేర్లు 2003 ఓటర్ల జాబితాలో ఉన్నప్పటికీ ప్రస్తుత జాబితాలో లేకపోవడంతో ఎస్ ఐ ఆర్ ఫారాన్ని పొందలేక పోతున్నారు. వీరి పేర్లను ఉద్దేశపూర్వకంగా కానీ, కాకతాళీయంగా కానీ జాబితా నుంచి తొలగించి ఉండవచ్చు. ఇలాంటివారు కూడా కొత్త ఓటర్లుగా 6 నెంబర్ ఫారాన్ని సమర్పించాల్సి వస్తోంది.

**రత్నాకర్ ఉజ్జిని**

# అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్రే కీలకం

## గ్రామాల స్వయం సమృద్ధికి కృషి చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్:**గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని.. విధులు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి గ్రామాల స్వయం సమృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రం లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని సర్పంచ్‌లకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు హాజరై, 99 రోజుల కార్యాచరణలో చేపట్టాల్సిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై ప్రసంగించారు.. 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు వచ్చే నిధులు, ఆదాయ వ్యయాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై సర్పంచ్‌లకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. పన్నుల వసూలుతో పాటు సొంతంగా ఆదాయం పెంచుకోవాలని సర్పంచ్‌లకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు సర్పంచ్‌లు వార్డు సభ్యుల సహకారంతోనే పేదలకు సక్రమంగా అందుతాయని పేర్కొన్నారు.

**ప్రజలకు మరింత చేరువ కావాలి:ఎమ్మెల్యే**

మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. 99 రోజుల కార్యాచరణలో అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక బృహత్తర కార్యక్రమమని దీన్ని సర్పంచ్‌లు అంత చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ఇది సదా అవకాశమని.. నూతన సర్పంచ్‌లు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అందరి సహకారంతో గ్రామాలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్,ఆర్‌డిఒ మహేశ్వర్, డిపిఒ జగదీశ్వర్, డిఎంహెచ్‌ఓ వెంకటరమణ, డిఆర్‌డిఒ శ్రీధర్, డిఎఒ భాగ్యలక్ష్మి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



**పరిపాలన విధానంపై అవగాహన పెంచుకోవాలి: కలెక్టర్**

నగరం పట్టణాల అభివృద్ధిలో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పాత్ర కీలకమని, అందరం కలిసికట్టుగా జిల్లాను అభివృద్ధిలో ముందు వరుసలో నిలుపుదామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాల ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పలు అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, వివిధ ప్రభుత్వ శాఖలు ప్రజల కోసం అందించే సేవా కార్యక్రమాలు, పథకాల గురించి పి.పి.టి ద్వారా వివరించారు. మున్సిపల్ చట్టాలు, మున్సిపాలిటీలోని వివిధ విభాగాలు నిర్వహించే కార్యక్రమాలు, అధికారులు, సిబ్బంది విధులు, బాధ్యతలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ కార్పొరేటర్లు, వార్డు సభ్యులు ఎంత బాధ్యతగా ఉంటే ఆ పట్టణాలు అంతలా అభివృద్ధి చెందుతాయని అన్నారు. నిత్యం శానిటేషన్ విధానం పర్యవేక్షించాలని, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వార్డులను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల ఎదురుగానే పరిష్కారం కావాలని ఉద్దేశంతో మున్సిపాలిటీల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్, దరఖాస్తుల పరిష్కారం చురుగ్గా సాగుతోందని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పాలుపంచుకుంటూ అంతిమంగా ప్రజా సేవే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పౌరుల సేవలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అవినీతి రహిత పాలనతో ఆదర్శంగా నిలవాలని సూచించారు. మున్సిపల్ చట్టాలపై అవగాహన పెంచుకొని ప్రజలకు సేవలు అందించాలని అన్నారు. ప్రతి కార్పొరేటర్ డివిజన్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ మున్సిపల్ చేపట్టే పనులను పర్యవేక్షించాలని కోరారు. వేసవి దృష్ట్యా తాగు నీరు వృథా చేయకుండా అవగాహన కల్పించాలని, ఎక్కడైనా పైపు లైన్ మరమ్మతులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,డిప్యూటీ మేయర్ సునీల్ రావు, ఆర్‌డిఒ రమేష్, హుజురాబాద్ మునిసిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, వైస్‌చైర్‌పర్సన్ గూడూరి అంజలి, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ మహమ్మద్, చొప్పదండి మున్సిపల్‌చైర్‌పర్సన్ వడ్లూరి సరిత, వైస్ చైర్పర్సన్ పెరుమాండ్ల మానస, మున్సిపల్ కమిషనర్లు సయ్యద్ ముసాబ్ అహ్మద్, మనోహర్, మహమ్మద్ ఆయాజ్ పాల్గొన్నారు.

## సింగరేణి కంపెనీని రాజకీయాలకు బలి చేయొద్దు


**ప్రజాపక్షం/రామగిరి:** సింగరేణి కంపెనీను కొందరు రాజకీయ నాయకులు అధికారులు రాజకీయ వేదికగా మార్చడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం కొంతమంది అధికారుల వ్యవహార శైలి చూస్తే జీఎం కార్యాలయాలు ప్రభుత్వ కార్యాలయాలుగా కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లా మారుతున్నాయనే భావన కలుగుతోందనికొంతమంది అధికారులు ప్రజా ప్రతినిధులకు సేవ చేయాల్సిన స్థితిలో కాకుండా పాలేరుల్లా పనిచేస్తూ కంపెనీ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే సింగరేణి కంపెనీ భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉంది.సింగరేణి కంపెనీపై ఆధారపడి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 42,000 మంది కార్మికులు వారి కుటుంబాలు జీవిస్తున్నారు. ఈ కంపెనీ బలహీనపడితే వేలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి సింగరేణిని రాజకీయాల బలి చేయకుండా కంపెనీ అభివృద్ధి కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.లేదంటే కార్మికులు ప్రజలు ఈ పరిస్థితిపై తీవ్రంగా స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పత్రిక ప్రకట ద్వారా బిజెపి నాయకులు మోలుమూరి. శ్రీనివాస్ తెలిపారు.

## కెజిబివి పాఠశాల ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బా లికల పాఠశాలను డిఆర్‌డిఒపిడి కలిందిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చే శారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి చదువులు, వసతి సౌకర్యాలపై వి వరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా అనే విషయాన్ని పరిశీలించా రు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, ప్రిన్సిపాల్ స్వప్న,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజం కోసం న్యాయవాదుల ఉద్యమం




**ప్రజాపక్షం/మెట్‌పల్లి :**గురువారం రోజున నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి మెట్‌పల్లి లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మించడమే లక్ష్యంగా పోస్ట్ కార్డు ఉద్యమం ప్రారంభించానని ప్రకటించారు. ఈ ఉద్యమంలో ప్రతి న్యాయవాది,రేవంత్ రెడ్డికు పోస్ట్ కార్డు పంపి, ప్లాస్టిక్ నిషేధానికి మద్దతు తెలియజేయాలని సూచించారు.మెట్ ప ల్లి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి ప్రారంభించిన ఉద్యమం సమాజానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు:మల్లిఖార్జున్, మగ్గిడి వెంకట నర్సయ్య, కోటగిరి వెంకటస్వామి, దయాకర్ వర్మ,ఓగులపు శేఖర్, అలాల సత్యనారాయణ,వంగరి గంగ రాజం,పులి నర్సయ్య,బక్కూరి రమేష్, మ్యాన నరహరి,హరిభూషన్,చింతకుంట శంకర్,అందె సంజయ్,తరి పురుషోత్తం,తదితరులు పాల్గొన్నారు

## సిలిండర్ల కొరతపై అధికారులు అప్రమత్తం



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :**ఇరాన్‌ఇజ్రాయిల్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధపరిస్థితుల నేపథ్యంలో చమురు దిగుమతులు తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో జగిత్యాల జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త, పాత బస్టాండ్ ప్రాంతాలతో పాటు టవర్, కరీంనగర్ రోడ్‌లలో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లపై సివిల్ సప్లై అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. గృహ అవసరాలకు కేటాయించిన గ్యాస్ సిలిండర్లను అక్రమంగా హోటళ్లు, రెస్టారెంట్లలో వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. 22కిపైగా సిలిండర్లను సీజ్ చేశారు. గృహ అవసరాలకు ఉపయోగించే సిలిండర్లను అక్రమంగావ్యాపారానికి వాడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గృహ అవసరాలకు సిలిండర్లను ఉపయోగించే వినియోగదారులు పొదుపుగా సిలిండర్లను వాడాలని కోరారు. సిలిండర్ బుకింగ్ వ్యవధిని 25 రోజులకు పెంచినట్లు వివరించారు. ఈ దాడుల్లో డిఎస్ఒ జితేందర్ రెడ్డి,ఎఎస్ఒ వెంకటేష్,డిటిసిఎస్ విష్ణు, ఎఫ్ఐలు రాజేంద్ర ప్రసాద్, స్వామి, రాజేందర్ రావుతో పాటు సివిల్ సప్లై సిబ్బంది తదితరులు ఉన్నారు.

## క్రీడలతో శారీరక దారుఢ్యం పెంపొందుతుంది: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జగిత్యాల :**క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు శారీరక దేహ దారుఢ్యాన్ని పెంపొందిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని వివేకానంద మిని స్టేడియంలో తెలంగాణ యూత్ స్పోర్ట్స్ అథారిటి ఆధ్వర్యంలో అస్మిత ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి ఆటల పోటీలను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో క్రీడల అభివృద్ధికి అనునిత్యం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇటీవల బాక్సింగ్ క్రీడలో ఉత్తమ పథకాలు సాధించిన విద్యార్థిని నీట్‌లో సీటు సాధించడం ఆనందదాయకమన్నారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులతో క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ తదితర పోటీల్లో తమ ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీవైఎస్‌వో రవి కుమార్, కౌన్సిలర్ అరవ లక్ష్మి తదితరులు ఉన్నారు.

## కరీంనగర్‌లో 73 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు..

**ప్రజాపక్షం/కరీంనగర్:**పదవ తరగతి వార్షిక పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో పరీక్షల నిర్వహణకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్, తాగునీరు, ప్రతి సెంటర్లో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు రవాణా ఏర్పాట్లతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 194 ప్రభుత్వ స్కూళ్లతో పాటు 147 ప్రైవేట్ స్కూళ్లు మొత్తం 341 పాఠశాలల్లో చదివిన 13157 స్టూడెంట్స్ పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రభుత్వ స్కూళ్లలో చదివిన విద్యార్థులు 6292 మంది కాగా ప్రైవేట్ లో చదివిన విద్యార్థులు 6864 మందిలో బాలికలు 6289, బాలురు 6867 మంది ఉన్నారు. ఇందుకు గాను అధికారులు జిల్లా వ్యాప్తంగా 73 పరీక్షా కేంద్రాలను ఏ ర్పాటు చేశారు. పరీక్షలు నిర్వహణకు సరిపడా సిబ్బందిని ని యమించారు.ఇందులో భాగంగా 73 మంది సూపరింటెండెంట్లను, 73 డిపార్ట్ మెంట్ ఆఫీసర్లు, నలుగురు ఫ్లైయింగ్ స్క్వా డ్ లు, 73 సిట్టింగ్ స్క్వాడ్ లు, 694 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు అధికారులు వెల్లడించారు.

## ఎల్లాగౌడ్‌పై ఆరెల్లి పోషం వ్యాఖ్యలు గర్హణీయం

### ఎఐటియుసి బ్రాంచి నాయకులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :**సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శిగా పని చేసి రాజీనామా చేసి ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్‌పై ఆరోపణలు చేసిన ఆరెల్లి పోషం వ్యాఖ్యలను ఖండిస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, ఉపాధ్యక్షుడు సంకె అశోక్,మాదన మహేష్ లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరెల్లి పోషం ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి గా కొనసాగుతూ యూనియన్ లో ఎల్లా గౌడ్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని, బ్రాంచి లెక్కలు చెప్పడం లేదని ఈ నెల 5 న గోదావరిఖని లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం లో యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ కు రాజీనామా లేఖ ఇచ్చారని దీని పై కేంద్ర నాయకత్వం ఈ నెల 7 న గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్,పిట్ కార్యదర్శుల సమావేశం ఏర్పాటు చేశారని, ఇట్టి సమావేశంలో ఆరెల్లి పోషం ఇచ్చిన రాజీనామా లేఖపై సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కేంద్ర నాయకత్వం సూచించినప్పటికినీ మధ్యలోనే సమావేశం నుంచి వెళ్ళిపోయారని వారు పేర్కొన్నారు. ఇట్టి సమావేశంలో నాయకత్వం తీసుకున్న నిర్ణయాలను తెలుసుకోకుండా రాజీనామా చేశానని మీడియాలో ఎల్లా గౌడ్ పై ఆరోపణలు చేస్తూ ప్రకటన విడుదల చేయడం సరైన విధానం కాదని వారు పేర్కొన్నారు. ఆరెల్లి పోషం ఇచ్చిన రాజీనామా లేఖపై సభ్యులతో చర్చించి వారంలోగా బ్రాంచి కమిటీ ఆర్థిక పరమైన అంశాల పై వివరాలు అందించాలని నిర్ణయించిందని, ఇది తెలుసుకోకుండా సమావేశం మధ్యలోనే బయటికి వచ్చి ఎల్లా గౌడ్ పై నిరాధారమైన ఆరోపణలను చేయడాన్ని వారు ఖండించారు

## జగిత్యాల మున్సిపల్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యం

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాల :**జగిత్యాల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 83.99 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హాజరై మాట్లాడుతూ తెలంగాణలో ఏ మున్సిపాలిటిలో లేని విధముగా యూఐడీఎఫ్ స్కీం ద్వారా జగిత్యాల మున్సిపాలిటికి అత్యధికంగా రూ. 62 కోట్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. భావితరాలను దృష్టిలో ఉంచుకుని సహజ వనరులు, చెరువులు, కుంటలను పరిరక్షిస్తూ జగిత్యాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. పన్నులను సకాలంలో చెల్లించాలన్నారు.




అదనపు కలెక్టర్ రాజ గౌడ్ మాట్లాడుతూ ప్రాధాన్య క్రమంలో నిధులు వెచ్చిస్తూ జగిత్యాల మున్సిపాలిటి అభివృద్ధిపరచాలన్నారు. అనంతరం చైర్ పర్సన్ సమిండ్ల వాణి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా మున్సిపల్ బడ్జెను రూపొందించామని పేర్కొన్నారు. పారిశుద్ధ్యనిర్వహణకు రూ. 3.09 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ జీనత్ పర్వీన్ మున్నా, కమిషనర్ స్పందన, అకౌంట్స్ ఆఫీసర్ గణేష్, డిఇఇ ఆనంద్, ఉఇఇలు అనీల్, లక్ష్మి, ఎఒ శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.


## ఎమర్జెన్సీకే ప్రమాదం.. అసలు తప్పెవరిది?




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:**ప్రమాదశవాత్తు ఎమర్జెన్సీకి ఫోన్‌చేస్తే చాలు ఇట్టే వాలిపోయే 102 వాహనంకు ఎలక్ట్రిక్ బస్సు ఢీకొట్టిన సంఘటన ఎల్లారెడ్డిపేట కొత్తబస్టాండ్‌లో నెలకొంది.వివరాల్లోకి వెళితే గురువారంమధ్యాహ్నం ప్రాం తంలో కామారెడ్డి వైపుకు వెళుతున్న ఎలక్ట్రిక్ బస్సు ప్రాంగణంలోకి మలుపుతిప్పుతూ వెళుతుండగా రోడ్డు ట్రాఫిక్ బ్రేకర్లు లేక పోవడం, దీంతో పాటుగా మదర్‌లవ్ బొమ్మ రోడ్డుమధ్యన ఉండటం వలన రోడ్డుప్రమాదాలకు తావిస్తోంది.గతంలో కొంతమంది ప్రాణాలు కూడ హరి అన్నా యి.అయినా తీరు మార్చుకోవడం లేదంటూ స్థానికులు ఆ గ్రహం చేస్తున్నారు.సంబంధిత అధికారులు పట్టించుకుని బొమ్మను వెనుక భాగం ఆక్రమిస్తూ బస్తాండ్ వెలుపలికి వెళ్ళేంత విస్తీర్ణం లేదని ఇతరప్రాంతాలనుండి కొత్తగా వచ్చేవారికి బస్తాండ్ ప్రాంగణం కనిపించక వేగం పెంచుతున్నా రు.కావున ప్రాణాలు పోతేకాని పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రయాణీకులు తెలుపుతున్నారు.పాలకవర్గం చొరవతీసుకుని బొమ్మను వెనుకభాగంకు మార్పిడి చేయాలని,లేదంటే పత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవాలని కోరుతున్నారు.తప్పు ఎవరిదైన భారీవాహనాలదే తప్పని అందరు భావిస్తున్నారు.ఎల్లారెడ్డిపేట బస్టాండ్ ప్రాంగణంలోకి బస్సువెళ్ళాలంటే భయంతో ప్రయాణీకులు,డ్రైవర్లు మలుపుతిప్పడం పట్ల స్థానికంగా చుట్టుపక్కల చిరు వ్యాపారులు,ఆసుపత్రికి వెళ్ళేవారు ఆందోళనకు గురవుతున్నారు,సంబంధిత అధికారులు నిర్ణయం పై ఆధారపడి ఉంటుందని అంటున్నారు.ఇప్పటికైన బస్టాండ్ వసతుల పట్ల సౌకర్యంగా ఉంటేట్లుగా చూడాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/పెగడపల్లి :** ధర్మపురి నియోజకవర్గంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు.గురువారం పెగడపల్లి మండలం నంచర్ల గ్రామంలో లబ్ధిదారులు సాయిల సూరమ్మ మునిలకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని మంత్రి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి విడత కింద 3,500 ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోయిన బిల్లుల సమస్యను వెంటనే పరిష్కరించి, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. వచ్చే ఏప్రిల్ మాసంలో మరికొంత మంది అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, స్థానిక సర్పంచ్ కుంటాల వనజ శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఎడ్ల శ్యామ్ సుందర్ రెడ్డి, హౌసింగ్ పీడీ ప్రసాద్, హౌసింగ్ ఏఈ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, డైరెక్టర్లు శ్రీనివాస్, చాట్ల విజయభాస్కర్, కిషన్, శ్రీరామ్ అంజయ్య, సర్పంచులు మోకినపల్లి గోపాల్,రమేష్ నాయక్, వార్డు సభ్యులు మేక రాయమల్లు, తడగొండ శ్రీలత, సంకినపల్లి రాధ, పచ్చిమట్ల భాగ్య, అక్కెం గంగాధర్, సాయిళ్ళ రాకేష్, మాజీ సర్పంచులు గోలి మహేందర్ రెడ్డి, కుంటాల అంజయ్య, నాయకులు దీకొండ మహేందర్,బొడ్డు రమేష్,బుర్ర తిరుపతి, రమేష్, అనిల్, లింగాల తిరుపతి, కుంటాల విష్ణు,కొత్తూరు విష్ణు, కుంటాల బాబు,ముంజ మధుకర్,దుర్గాప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలి

### ఎస్‌సిఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ప్రజా ప్రతినిధులు అందరూ ప్రజాసేవ ప్రధాన లక్ష్యంగా సమాజమే దేవాలయంగా భావించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేయాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.ప్రభుత్వం చేపడుతున్న సంక్షే మం, అభివృద్ధి కార్యక్రమాలకుప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో రెడ్డి సంక్షేమ భవన్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికపై మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, గ్రామసర్పంచ్‌లకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఈ అవగాహన కార్యక్రమాన్ని నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసమావేశానికి అధ్యక్షతన వహించిన జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల కోసం జిల్లాలో ఇప్పటికే ఐదురోజుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 99 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఐదు అంచెల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైనలబ్ధిదారులకు చేరేలా ప్రజాప్రతినిధులు కృషిచేయాలన్నారు. 99 రోజుల ప్రణాళికతో పాటు మార్చి 6 నుండి 15 వరకు అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాల్టీలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లుక్లియర్ చేయటం అన్నారు. ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు వైద్య ఆరోగ్య శాఖ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఏప్రిల్ 13 నుండి 18 వరకు పోలీసు,రవాణ శాఖ ఆధ్వర్యంలో సురక్షితంగా చేరుకోండి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 20 నుండి 25 వరకు ఎస్సీఎస్టీ బిసి, మైనార్టీ సంక్షేమ శాఖలు, గృహనిర్మాణ శాఖ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 27 నుండి మే 2వరకు పోలీసు,మహిళ శిశు సంక్షేమం వారు పిల్లల భద్రత, డ్రగ్స్‌కు అడ్డుకట్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే 4 నుండి 9 వరకు వ్యవసాయ ఇరిగేషన్, రెవెన్యూ ఇరిగేషన్ విద్యుత్ శాఖ రైతు సంక్షేమం. వ్యవసాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే 11 నుండి 16 వరకు విద్యశాఖ సంబంధిత కార్యక్రమాలు, 18 నుండి 23 వరకు యువజన శాఖ,క్రీడలు సంబంధించిన అంశాలు, 25 నుండి 30 వరకు మహిళా సంక్షేమం, సెర్ప్, మెప్మా మహిళా అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 1 నుండి జూన్ 12 లవరకు పరావరణం, కాలుష్య నియంత్రణ,కార్యాక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధికి కట్టుబడి పనిచేయాలన్నారు. గ్రామసమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. సంక్షేమ,వసతి గృహాల్లో చదువుకునేందుకు వచ్చిన పేద విద్యార్థులకు అవసరరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హామీద్ పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం

### ఎస్‌సి,ఎస్‌టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**ప్రజాపక్షం/ధర్మపురి :** గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి,వికలాంగులు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. గురువారం జగిత్యాల జిల్లా ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను ఆశా వర్కర్లు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని ఇందులో భాగంగా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.



## ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోమారం గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇండ్లు లబ్దిదారులు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి చేతులమీదుగా ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. గోమారం గ్రామానికి చెందిన గొల్ల కళ్యాణి, కుక్కల రేణుక, నూతన ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో నిరుపేదలకు ఎలాంటి ఇండ్లు మంజూరు కాలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో అర్హులైన పేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, గోమారం సర్పంచ్ హైమావతి ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్‌గుప్తా, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బుర్ర మురళీగౌడ్, ఉపసర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, దొంతిరెడ్డి అరుణారెడ్డి, పాంబండ సర్పంచ్ నాయిని సమతవేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కాముని శ్రీనివాస్‌పాల్గొన్నారు.

## వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

### ఐటిడిఎ పిఒ యువరాజ్ మార్మాట్

**ప్రజాపక్షం/ఉట్నూర్ :** ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యలో పాటు నాణ్యమైన వసతులు కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం నార్నూర్ మండలంలోని జెండా గిరిజన ఆశ్రమ పాఠశాల, దిశ మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆహారం నాణ్యతను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించి, వారికి స్వయంగా పాఠాలు బోధించారు. విద్యార్థుల చదువు, ఆరోగ్యం, మెనూ అమలుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దళితులకు న్యాయం జరగకపోతే నిరసన ఉధృతం చేస్తాం

### అదనపు కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** దళితుల భూములు లాక్కోవాలని అగ్గడిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు బంగారు సాయిలు, పాశంకుమార డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద నిరసన చేపట్టి మాట్లాడారు. ఇందల్వాయి మండలం గన్నారం గ్రామ శివారులో గత 40 ఏళ్ల క్రితం 856/9 లో అసైన్డ్ భూమి దళితులకు పట్టాలు ఇవ్వటం జరిగిందన్నారు. బతుకుదెరువు కోసం ఈ భూమిని సాగు చేసుకుంటున్నారని బోరు, కంచె వేసుకున్నారన్నారు. అగ్రకులాల వారు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో బుధవారం దళితులను కొట్టి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. తెలంగాణ ఐక్యవేదిక కన్వీనర్ బంగారు సాయిలు, రాష్ట్ర నాయకులు పాశంకుమార్, కిష్టయ్య సంఘటన స్థలానికి చేరుకుని దళితులకు అండగా నిలిచామని ఎస్సై, సిఐలతో మాట్లాడి వారిని మందలించామన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించామని ఈ రోజు ధర్నాచౌక్‌లో 200 మందితో ధర్నా అనంతరం జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించామన్నారు. ఈ ధర్నాలో మహేష్, రవి, నర్సింలు, గంగాధర్, గంగానర్సయ్య, మహిళలు పాల్గొన్నారు.




## నత్త నడకన ప్రజాపాలన ప్రగతిపథం

### అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా


**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** జిల్లా ఉన్నతాధికారుల బాధ్యతారాహిత్యంతోనే ప్రజాపాలన ప్రగతి పథం పనులు నత్తనడకన నడుస్తున్నాయని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. గురువారం నిజామాబాద్‌లోని బూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మార్చి 6 నుండి జూన్ 12 వరకు చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి పథంపై జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత బాగుంటేనే ప్రభుత్వం అనుకున్న ప్రగతి సాధించవచ్చునని, జిల్లా కలెక్టర్ ఒక ప్రణాళికతో ముందుకు వెళుతున్నప్పటికి ఆయా శాఖల ఉన్నతాధికారులు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమానికి చిత్తశుద్ధితో పనిచేయడం లేదని అన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తు ఉన్నప్పటికి ఆయా శాఖలలో ఉన్న ఉన్నతాదికారుల నిర్లక్ష్యం వల్ల కిందిస్థాయి సిబ్బందిసేవలు గుర్తించకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, మునిసిపల్ కమిసనర్ దిలీప్ కుమార్, నగర మేయర్ ఉమారాణి, డిప్యూటి మేయర్, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు అందజేత

**ప్రజాపక్షం/కౌడిపల్లి :** కౌడిపల్లి మండలంలోని రాయిలపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, హాల్ టికెట్ కవర్లు రాయిలపూర్ ఉప సర్పంచ్సర్పంచ్ సంతోష్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ సంతోష్ మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థులు విద్యార్థులు కష్టపడి 10 జిబి సాధించి రాయిలపూర్ ఉన్నత పాఠశాలకు అలాగే తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం రాయిలపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు ఉప సర్పంచ్ సంతోష్ కు శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లవీన జ్యోతి, మాజీ సర్పంచ్ సంజీవులు, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు దొంతుల దుర్గయ్య, నర్సింలు, సత్యనారాయణ, రాంరెడ్డి, శంకర్ నాయక్, పంచాయతీ సెక్రెటరీ సలీం, ప్రవీణ్, కుమార్, రాజు నందు, రవి, ఉపాధ్యాయులు కవిత, జగదీష్, అనిల్ ప్రసాద్ రెడ్డి, కృష్ణవేణి, లక్ష్మి, దీపిక, కృష్ణమూర్తి, పిఈటి కృష్ణ గౌడ్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో కార్పొరేట్ 'గాలం'

### పది పరీక్షలు కాకముందే అడ్మిషన్ల దందా..!
### (ప్రైవేట్ పాఠశాలల నుండి డేటా లీక్ రూ.లక్షల్లో ఫీజుల వసూలు..! ర్యాంకుల పేరిట నకిలీ హామీలతో తల్లిదండ్రులకు మాయమాటలు..!)



**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల నగారా ఇంకా మోగక ముందే కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమ అడ్మిషన్ల పర్వం జోరందుకుంది. విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతూ పరీక్షల ఒత్తిడిలో ఉంటే ప్రైవేట్ కళాశాలల ప్రతినిధుల (పిఆర్ఓలు) మాత్రం వారి ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకుని,పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఫోన్ నంబర్లు,చిరునామాలతో కూడిన సమగ్ర జాబితాను ఈ కార్పొరేట్ సంస్థలు చేజిక్కించుకున్నాయి.

**డేటా చోరీ..ఇంటింటికీ ఏజెంట్ల వేట :**
జిల్లాలోని ప్రముఖ ప్రైవేట్ పాఠశాలల నుండి విద్యార్థుల వ్యక్తిగత సమాచారం అక్రమంగా కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ డేటా ఆధారంగా పిఆర్వోలు ప్రతిరోజు వందలాది మంది తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తూ,నేరుగా వారి ఇళ్లకే వెళ్లి మాయమాటలతో ప్రలోభపెడుతున్నారు.''మీ అబ్బాయి/అమ్మాయికి స్కూల్లో మంచి మార్కులు వస్తున్నాయి.మా కాలేజీలో చేరిస్తే ఐఐటీ ఖాయం'' అంటే ఆకాశానికి ఎత్తేస్తూ అడ్మిషన్ల కోసం ఒత్తిడి తెస్తున్నారు.చదువుపై దృష్టి పెట్టాల్సిన సమయంలో ఈ ఏజెంట్ల తాకిడి విద్యార్థులను తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తోంది.

**ఫీజుల మాయాజాలం..**
**రూ.3 లక్షల వరకు దోపిడీ..!**
ఈ ప్రచారపర్వంలో ఫీజుల దోపిడీ ఆకాశాన్ని తాకుతోంది.సాధారణ ఇంటర్మీడియట్ కోర్సులకు సైతం ఐఐటీ,నీట్ కోచింగ్ పేరు తగిలించి,ఒక్కో విద్యార్థి నుండి రూ.1,50,000 నుండి ఏకంగా 3 లక్షల రూపాయల వరకు వసూలు చేసేందుకు ఈ సంస్థలు సిద్ధమయ్యాయి.
''ముందుగా సీటు రిజర్వ్ చేసుకుంటే రూ.20 వేల నుండి 50 వేల వరకు రాయితీ ఇస్తాం'' అని ఆశచూపుతూ,గడువు ముగిసిపోతుందని భయపెడుతూ ముందస్తుగా వేల రూపాయల అడ్వాన్సులు వసూలు చేస్తున్నారు.మధ్యతరగతి తలిలదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకుని లక్షలాది రూపాయల ఫీజులను దండుకుంటున్నారు.

**ర్యాంకుల బాధ్యత మాదే..**
**అంతా అబద్ధమైనా..?**
''మా దగ్గర చేరిస్తే మీ బిడ్డకు దేశంలోని ప్రతిష్టాత్మక సంస్థల్లో సీటు రావడం ఖాయం,ఆ ర్యాంకు తీసుకువచ్చే బాధ్యత మాది'' అంటూ గప్పాలూ కొడుతున్నారు.గతంలో ఎక్కడో,ఏ నగరంలోనో వచ్చిన ర్యాంకులను స్థానిక విద్యార్థులకు చూపిస్తూ, నకిలీ హామీలతో తల్లిదండ్రులను అయోమయానికి గురిచేస్తున్నారు. వాస్తవానికి ఈ సంస్థలు కేవలం ఉత్తమ ప్రతిభ ఉన్న విద్యార్థులపైనే దృష్టి సారిస్తాయని,మిగిలిన వారిని పట్టించుకోవని తెలిసినా,ప్రచార ఆర్భాటంతో సామాన్యులను బురిడీ కొట్టిస్తున్నారు.

**నిబంధనలు గాలికి..**
**విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు...!**
విద్యాశాఖ నిబంధనల ప్రకారం పదో తరగతి పరీక్షలు ముగిసి,ఫలితాలు వెలువడకముందే అడ్మిషన్లు తీసుకోవడం పూర్తిగా విరుద్ధం. అయినప్పటికీ, నిర్మల్ జిల్లాలో ఈ దందా బహిరంగంగానే సాగుతోంది. కార్పొరేట్ సంస్థల రంగుల ప్రపంచాన్ని చూసి మోసపోవద్దని,కేవలం ప్రకటనల ఆధారంగా లక్షల రూపాయలు గుమ్మరించవద్దని విద్యావేత్తలు తల్లిదండ్రులను హెచ్చరిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి, ఇలాంటి అక్రమ అడ్మిషన్ల ప్రక్రియపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.




## రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా ఆధునిక వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్ సముదాయ ఆవరణలో ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు మినీ ట్రాక్టర్లను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పంపిణి చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎస్సీ ,ఎస్టీ రైతులకు ఒక్కోటి రూ. .4.9లక్షల విలువ గల 20 హెచ్‌పి కెపాసిటీ మినీ ట్రాక్టర్లను 60 శాతం సబ్సిడితో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయం, ఉద్యాన రంగాల అభివృద్ధికి యాంత్రీకరణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. చిన్న ,సన్నకారు, రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ అమలు చేస్తోందని తెలిపారు. రైతులు ఆదునిక పద్ధతులు ,యంత్రాలను వినియోగించి సాగు ఖర్చును తగ్గించుకోవడంతో పాటు ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. రైతుల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని రైతులకు అండగా ప్రభుత్వం ఎల్లప్పుడు ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడి చోంగ్లు ,జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమశ్వరరావు డిఆర్‌డిఓ జ్యోతి తదితర జిల్లా అధికారులు సంబంధిత లబ్దిదారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసే బాధ్యత ప్రజాప్రతినిధులదే

### అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్ళాలి
### కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎమ్మెల్యే రోహిత్ రావు





**ప్రజాపక్షం/మెదక్ :** గ్రామమైనా, పట్టణమైనా అభివృద్ధి చేసే బాధ్యత ప్రజా ప్రతినిధులపైనే ఉందని, నా గ్రామం, నా పట్టణం, నా వార్డు అనే భావనతో అందరూ పనిచేయాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మెదక్ జిల్లాలోని మెదక్ డివిజన్, నార్సాపూర్, తూప్రాన్ డివిజన్లకు సంబంధించిన మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులకు ప్రభుత్వ పథకాలపై మినిట్ టు మినిట్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక నోడల్ అధికారి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ పట్టణ, గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక బృహత్తర కార్యాక్రమం చేపట్టిందని అన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, జీరో విద్యుత్, సన్న బియ్యం, అనేక పథకాలు ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో నడవాలంటే ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారం చూపించాలని స్పష్టం చేశారు.
అంతకు ముందు సమాచార పౌర సంబంధాల శాఖ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల ఫోటో ఎగ్జిబిషన్‌ను అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులతో కలసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తిలకించారు. ఈ కార్యాక్రమంలో జడ్పీ సిఇఒ ఎల్లయ్య, ఆర్డీఓ రమాదేవి, సైన్స్ అధికారి రాజిరెడ్డి, మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, కౌన్సిలర్లు, సర్పంచులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత

**ప్రజాపక్షం/పాపన్నపేట :** మండల పరిధిలోని నాగుసానిపల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు అవసరమయ్యే పరీక్షల సామాగ్రిని అదే గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ వాలి జగదీశ్వర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ దండెం సుశీల,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చంద్రమ్మ,స్థానిక ప్రధానోపాధ్యాయులు నజీరుద్దీన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, నవీన్ కుమార్ ఎస్.వో, రాజు, సిఎంవో, రిటైర్ ప్రధానోపాధ్యాయులు రాంకిషన్, మహిపాల్ రెడ్డి, వట్టం సంగమేశ్వర్, సాయి కృష్ణ, నాయకులు దుర్గేష్, విజయ వి.వో, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అశోక్ కుమార్, నర్సిములు, సిద్దేశ్వర్, రేఖా, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు క్రమశిక్షణకు నిదర్శనం

### ఎంఎల్‌ఎ కోవ లక్ష్మి

**ప్రజాపక్షం/రెబ్బన :** క్రీడలు యువతలో క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయని ఆసిఫాబాద్ ఎంఎల్‌ఎ కోవ లక్ష్మి తెలిపారు. రెబ్బన మండలం గంగాపూర్ గ్రామంలో పిఏసిఎస్ మాజీ వైస్ చైర్మన్ రంగు మహేష్ గౌడ్ తండ్రి రంగు వేంకటి గౌడ్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్ రెడ్డి, రెబ్బన సర్పంచ్ దుర్గం భరద్వాజ్, ఉపసర్పంచ్ వరలక్ష్మి దుర్గారావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ కర్నాతం సంజీవ్, నాయకులు మధునయ్య, తిరుపతి, బొమ్మినేని శ్రీధర్, ప్రభాకర్, వినోద్ జైస్వాల్, శంకరమ్మ, పద్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికతోనే జిల్లా సమగ్రాభివృద్ధి

### కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** నిర్మల్ జిల్లాలో ''ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక''ను పకడ్బందీగా అమలు చేసి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అద్భుతమైన ప్రగతిని సాధిద్దామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. గురువారం నిర్మల్ పట్టణంలోని తిరుమల గార్డెన్స్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు,మున్సిపల్ కౌన్సిలర్ల కోసం నిర్వహించిన అవగాహన సదస్సు అత్యంత అట్టహాసంగా జరిగింది. ఈ సదస్సులో నిర్మల్, ముధోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

**99 రోజుల ప్రత్యేక కార్యాచరణ..** ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి చేరాలనే ఉద్దేశంతో 99 రోజుల ప్రత్యేక ప్రణాళికను ప్రారంభించినట్లు వెల్లడించారు.ఈ ప్రణాళికను ప్రారంభించినట్లు వెల్లడించారు.

**ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం..** నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ,ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం లభించినందుకు ప్రజాప్రతినిధులు గర్వపడాలని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని కోరారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ,స్థానిక సంస్థల్లో యువత ప్రాతినిధ్యం పెరగడం వల్ల గ్రామాల్లో నూతనోత్సాహం కనిపిస్తోందని,ప్రభుత్వ పథకాల అమలులో యువ ప్రతినిధులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**గ్రామ వికాసంలో సర్పంచుల పాత్ర...** ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడు గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే ప్రధాన పాత్ర అని,వారు ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేయాలని పేర్కొన్నారు.ప్రతి నెలా గ్రామసభలు నిర్వహించి,స్థానిక అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు,కిషోర్ కుమార్,బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,ఆర్డీ రత్నకళ్యాణి,నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య,వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి,బైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ,డిఎల్ఎస్ఏ సెక్రటరీ రాధికతో పాటు పెద్ద సంఖ్యలో సర్పంచులు,కౌన్సిలర్లు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమంలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలులో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని అమ్మ గార్డెన్స్‌లో సర్పంచ్‌లు, మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12 వరకు 99 రోజుల పాటు సాగే ఈ ప్రణాళిక ద్వారా పారిశుధ్యం, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మున్సిపాలిటీలు, పంచాయతీలలో ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ నిరంతరాయంగా జరగాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్, త్రాగునీరు, ప్రహరీ గోడల వంటి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడాలని, విద్యుత్ ఆదాకు సౌర దీపాలపై దృష్టి సారించాలని కోరారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిపి ఎ.భాస్కర్, అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభం




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** ప్రజా పాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా తంతోలి గ్రామంలో గిరిజన బాలుర డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శివకృష్ణ మట్లాడుతూ ఈ శిబిరం మార్చి 12 నుండి 18 వరకు ఏడు రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధి, సామాజిక బాధ్యత, ప్రజల్లో వివిధ సామాజిక సమస్యల పట్ల అవగాహన కల్పించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల్లో సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి , ఉపసర్పంచ్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి వెంకన్న, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, పాఠశాల ఇన్చార్జ్ హెచ్ఎం మహేష్, కళాశాల అధ్యాపకులు లక్ష్మణ్, సురేందర్, విఠల్, సంకీర్త్, సంతోష్, ఎన్ఎస్ఎస్ వాలంటరీలు పాల్గొన్నారు.

# ధోనీకి లైన్ క్లియర్



## కేసు కొట్టేసిన బిసిసిఐ

ఐపిఎల్ 19వ సీజన్ ప్రారంభానికి ముందే మహేంద్ర సింగ్ ధోనీకి భారీ ఊరట లభించింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందుతున్నారని అతడిపై వచ్చిన ఫిర్యాదును బిసిసిఐ ఎథిక్స్ ఆఫీసర్ తోసిపుచ్చారు. దాంతో.. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున మరోసారి తన మ్యాజిక్ చూపించేందుకు తాలా సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే నెట్స్‌లో సాధన చేస్తున్న మహీ భాయ్.. కేసు కొట్టివేతతో మరింత జోరు పెంచనున్నాడు. భారత క్రికెట్‌లో వివాదరహితుడుగా పేరొందిన ధోనీపై పరస్పర విరుద్ధ ప్రయోజనాల కేసు అభిమానులకు ఒకింత ఆశ్చర్యం కలిగించింది. సిఎస్‌కె ఆటగాడిగా కొనసాగుతున్న ధోనీ.. ఒక క్రికెట్ అకాడమీ నడుపుతున్నాడు. ఆర్కా స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ అనే అకాడమీలో ధోనీ భాగస్వామిగా ఉన్నాడు. అందుకని.. బిసిసిఐ నియమ నిబంధనల ప్రకారం అతడు పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందుతాన్నారని ఫిబ్రవరి 28న ఫిర్యాదు నమోదైంది. 2017లో రిజిష్టర్... ఐపిఎల్ ప్లేయర్‌గా ఉంటూనే అకాడమీని నిర్వహించడం ద్వారా ధోనీ బిసిసిఐ నియమావళిని ఉల్లంఘించారని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. అంతేకాదు 2018లో బిసిసిఐ సవరించిన పరస్పర విరుద్ధ ప్రయోజనాల నియమాల ప్రకారం సిఎస్‌కె స్టార్.. తాను పొందుతున్న లాభాలను బహిర్గతం చేయలేదు. కాబట్టి ధోనీపై చర్యలు తీసుకోవాలని బిసిసిఐని కోరారు. అయితే.. బిసిసిఐ ఎథిక్స్ ఆఫీసర్ జస్టిస్ అరుణ్ మిశ్రా స్పందిస్తూ ధోనీపై చర్యలుండవని తేల్చేశారు. ధోనీ క్రికెట్ అకాడమీ 2017లో రిజిష్టర్ అయిందని.. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన నియమాలను 2018 సెప్టెంబర్లో అమలులోకి వచ్చాయని అరుణ్ మిశ్రా వెల్లడించారు. క్రికెట్ అకాడమీ నిర్ణయాల్లో ధోనీ పాత్ర పరిమితమేనని స్పష్టం చేసిన ఆయన.. ఫిర్యాదుదారు పేర్కొన్న అంశాల ప్రకారం ధోనీపై చర్యలు తీసుకోవడం కుదరని చెప్పేశారు. 'ధోనీపై వచ్చిన ఫిర్యాదు సహేతుకమైనది కాదు. ఈ కేసు వెనకాల థర్డ్ పార్టీ పాత్ర ఉంది. తనకు నష్టం కలిగించారనే కోపంతోనే ఫిర్యాదుదారు ధోనీపై కక్షపూరితంగా కేసు వేశారు. ఆర్కా స్పోర్ట్స్ మేనేజ్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభించిన క్రికెట్ అకాడమీకి ధోనీని యజమానిగా పేర్కొంటున్నారు. అయినప్పటికీ ఆ ఒప్పందం 2017లో జరిగింది. ఆ సమయంలోనే ధోనీ భారత జట్టు కెప్టెన్‌గా కొనసాగారు. కానీ, అతడిపై అప్పుడు పరస్పర విరుద్ధ ప్రయోజనాల కేసు నమోదు కాలేదు. సో.. ఫిర్యాదుదారు ఆరోపణలను తోసిపుచ్చుతున్నాం' అని అరుణ్ మిశ్రా వెల్లడించారు.

## తండ్రి మెడలో టి-20 మెడల్

### 'నా జీవితంలో నిజమైన హీరో' అంటూ భారత క్రికెటర్ శివం దూబే పోస్ట్..!



పొట్టి ప్రపంచకప్‌లో భారత జట్టు విజయాల్లో కీలకమైన శివం దూబేపై ప్రశంసలు కురుస్తున్నాయి. టీమిండియా వరుసగా రెండోసారి విజేతగా నిలవడంలో దూబే కనిపించని హీరో అని మాజీ ఆటగాళ్లు అతడిని ఆకాశానికెత్తేస్తున్నారు. అయితే.. భారత స్టార్ మాత్రం తాను రియల్ హీరోగా భావించే వ్యక్తిని అభిమానులకు పరిచయం చేశాడు. ఆయన ఎవరో కాదు అతడికి జన్మనిచ్చిన తండ్రి. పొట్టి ప్రపంచకప్ విజేతలుగా ఇళ్లకు చేరుకున్న భారత ఆటగాళ్లు తమ సంతోషాన్ని కుటుంబంతో పంచుకుంటున్నారు. ఆల్రౌండర్ శివం దూబే మాత్రం తన తండ్రి రాజేశ్ దూబే మెడలో ప్రపంచకప్ మెడల్ వేసి సంబురపడ్డాడు. టీమిండియా జెర్సీ ధరించిన తండ్రి మెడలో తనకు బహుమతిగా లభించిన మెడల్ వేసి మురిసిపోయాడు. ఆ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టాడు దూబే. 'నా జీవితలో నిజమైన హీరో' అనే క్యాప్షన్‌తో అతడు పెట్టిన ఫొటోలు నెట్టింట వైరలవుతున్నాయి.ఐపిఎల్ సంచలనంగా భారత టి20 జట్టులోకి దూసుకొచ్చిన శివం దూబే.. నమ్మదగిన ఆటగాడిగా ఎదిగాడు. రెండేళ్ల క్రితం పొట్టి ప్రపంచకప్‌లో పర్లేదనిపించిన దూబే.. ఈసారి మాత్రం మెరుపు ఇన్నింగ్స్‌లతో చెలరేగాడు. చేసింది కొన్నిపరుగులే అయినా.. భారత జట్టు విజయానికి అవి ఎంతో కీలకమయ్యాయి. దూకుడే మంత్రంగా 169.06 స్ట్రయిక్ రేటుతో రెండు అర్ధ శతకాలతో కలిపి 235 రన్స్ సాధించాడీ హిట్టర్. వరల్డ్‌కప్ సవిజేతగా సొంతూరికి రైల్లో వెళ్లి అందరిని ఆశ్చర్యపరిచిన దూబే.. ఇంటికి వెళ్లాక తండ్రితో తన సంతోషాన్ని పంచుకున్నాడు.

## సెమీస్‌కు భారత్

### వేల్స్‌పై ఘనవిజయం...నవనీత్ కౌర్ హ్యాట్రిక్

ఎఫ్ఐహెచ్ ఉమెన్స్ హాకీ వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో భారత మహిళల జట్టు సెమీఫైనల్‌కు దూసు కెళ్లింది. గచ్చిబౌలిలో బుధవారం రాత్రి భారత జట్టు.. 4–1తో వేల్స్‌పై ఘనవిజయం సాధించి పూల్–బి నుంచి సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంది. నవనీత్ కౌర్ హ్యాట్రిక్ (29, 34, 55 నిమిషాల్లో) గోల్స్ చేసి భారత్‌ను తిరుగులేని స్థితిలో నిలుపగా సాక్షి రాణా (7వ నిమిషంలో) ఒక గోల్ కొట్టింది. వేల్స్ నుంచి థామస్ బెట్సన్ ఒక గోల్ చేసింది. ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా సెమీస్ బెర్తును దక్కించుకునే అవకాశమున్న భారత్.. నాలుగు క్వార్టర్స్‌లోనూ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించి ఏకపక్ష విజయం సాధించింది. తొలి క్వార్టర్స్ ఏడో నిమిషంలోనే సాక్షి.. కెప్టెన్ సలీమ అందించిన బంతిని బలమైన రివర్స్ హిట్‌తో ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌కు పంపి తొలి గోల్ అందించింది. రెండో క్వార్టర్ నుంచి నవనీత్ మాయ మొదలైంది. పెనాల్టీ కార్నర్‌ను తొలి గోల్‌గా మలిచిన ఆమె.. మూడో క్వార్టర్‌లోనూ మరో గోల్తో మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేసింది. ఆఖరి క్వార్టర్‌లో వేల్స్ గోల్ కొట్టి ఆతిథ్య జట్టు ఆధిపత్యాన్ని తగ్గించినా 55వ నిమిషంలో నవనీత్ హ్యాట్రిక్‌తో భారత్ భారీ విజయం సాధించింది. సెమీస్‌లో భారత జట్టు శుక్రవారం.. ఇటలీతో తలపడనుంది.



## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

### రాజ్యాంగంపై అంతిమ వ్యాఖ్యాత ఎవరు?



☞ ఆభరణాల తయారీలో బంగారంతో కలిపే లోహం ఏది?
రాగి
☞ గాలిలోని తేమను కొలిచే సాధనం ఏది?
హైగ్రోమీటర్
☞ ఎల్పీజీ (వంట గ్యాసు లో ఉండేది?
బ్యూటేన్
☞ స్వైన్ ఫ్లూ కారక హెచ్ఐఎస్ఐ వైరస్కు ఉన్న వైద్యనామం?
ఇన్ఫ్లూయెంజా
☞ రిజర్వ్ బ్యాంకు గుణాత్మక పరపతి నియంత్రణలో ఏది చేరదు?
మోతాదు అవసరంలో మార్పు
☞ ట్రాన్స్ అంటార్కిటిక్ పర్వతాల పొడవు?
3050 కి. మీ.
☞ కంప్యూటర్ సీపీయూల్లో అనుబంధం కాని భాగం?
అడ్రస్ రిజిస్టర్స్
☞ విద్యుత్ ఫ్యూజు తీగ తయారీలో వాడే పదార్థానికి ఉండాల్సిన గుణం?
అల్ప ద్రవీభవన స్థానం
☞ రాజ్యాంగం ఏ అధికరణ ద్వారా పత్రిక (ప్రెస్) స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తుంది?
19
☞ భారత అంతరిక్ష పితామహుడని ఎవరిని అంటారు?
విక్రమ్ సారాభాయి
☞ వజ్రం దేని రూపాంతరం?
కార్బన్
☞ 'ట్రకోమా' వ్యాధి శరీరంలోని ఏ భాగానికి వస్తుంది?
కళ్లు
☞ భూకంపాలు, అగ్ని పర్వతాలు ఎక్కువ గల పర్వత ప్రాంతం?
ఆండీస్
☞ సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఎక్కడ ఉంది?
కాసర్ గోడ్
☞ బక్సార్ యుద్ధ వీరుడు ఎవరు?
హెక్టర్ మన్రో
☞ దక్షిణ అమెరికా ప్రధాన భాష?
లాటిన్
☞ 'చంద్రయాన్ 2'ను భారతదేశం కింది ఏ దేశంతో ఉమ్మడిగా రూపొందించింది?
రష్యా
☞ ప్రపంచంలో మిక్కిలి పొడవైన పర్వత శ్రేణులు?
ఆండీస్
☞ భారతదేశంలో మొదటిసారిగా బంగారు నాణేలను ఎవరు ప్రవేశపెట్టారు?
ఇండో గ్రీకులు
☞ ఆసియాలో అతి పొడవైన నది
యాంగ్జె
☞ మాసాబాంకును తవ్వించిందెవరు?
కానమ్ గా
☞ వాల్మీకి జయంతిని ప్రభుత్వం ఏ రోజున అధికారికంగా నిర్వహించింది?
అక్టోబరు 27
☞ రెడ్ క్రాస్ అండ్ రెడ్ క్రిసెంట్ సొసైటీ ఎక్కడ ఉంది?
జెనీవా
☞ రాచకొండను పాలించిన చివరి పద్మనాయక పాలకుడు ఎవరు?
మూడో సింగమ నాయకుడు
☞ ఎన్ని సంవత్సరాలకు వెదురు పుష్పిస్తుంది.
3
☞ నీటిని శుద్ధి చేయడంలో ఉపయోగించే కిరణాలేవి?
యూవీ కిరణాలు
☞ బ్యాంకాక్ ఏ నది ఒడ్డున ఉంది?
చావో ప్రయ
☞ ఇందిరాసాగర్ డ్యామ్ ఏ నదిపై ఉంది?



తపతి
☞ పీష్వా అంటే ఎవరు?
ప్రధానమంత్రి
☞ మూసీ నది వెంబడి ఉద్యానవనం అభివృద్ధి చేసేందుకు ప్రారంభించిన ప్రాజెక్టు ఏది?
నందనవనం
☞ భారతదేశంలోని ఏ రాష్ట్రాన్ని 'షుగర్ బౌల్' అంటారు?
ఉత్తర్ ప్రదేశ్
☞ కండరాల నొప్పులు, పక్షవాతం చికిత్స కోసం వాడేవి.
పరారుణకిరణాలు
☞ భారతదేశ మొదటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
హెచ్ కానియా
☞ మానవుల జీర్ణవ్యవస్థలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం ఏది?
హైడ్రోక్లోరిక్ ఆమ్లం
☞ ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం సుప్రీం కోర్టు ఏ ప్రకరణ (ఆర్టికల్) ప్రకారం రిట్లను జారీ చేస్తుంది?
32
☞ కంప్యూటర్లలోని సమాకలన వలయాల్లో ఉపయోగించే మూలకం?
సిలికాన్
☞ భారత రాజ్యాంగంపై అంతిమ వ్యాఖ్యాత ఎవరు?
సుప్రీంకోర్టు
☞ 2015 జూన్లో స్వీడన్ పర్యటనలో భాగంగా స్వీడన్ పార్లమెంటు, రాజధాని స్టాక్ హోమ్ ని నోబెల్ బహుమతులు ప్రదానం చేసే మందిరాన్ని సందర్శించిన భారతీయ ప్రముఖుడిని గుర్తించండి.
ప్రణబ్ ముఖర్జీ
☞ ఏ దేశ జాతీయపక్షిగా రాబిన్ అనే పక్షి ఆన్లైన్ పోల్లో ఇటీవల ఎంపికైంది?
బ్రిటన్
☞ భారత జాతీయ కాంగ్రెస్ మొదటి మహిళా అధ్యక్షురాలు ఎవరు?
అనిబిసెంట్

# ఎండిన పంటకు పరిహారం ఇవ్వాలి

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్

### బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు ద్వారా మునుగోడు ప్రాంతానికి సాగునీరు ఇవ్వకపోతే రైతు ఉద్యమం



**ప్రజాపక్షం/మునుగోడు :** మండలంలోని కలవలపల్లి గ్రామంతో పాటు పలు గ్రామాల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వరి పంటలు పూర్తిగా ఎండి పోయాయని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆరోపించారు. గురువారం నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కలవలపల్లి గ్రామానికి చేరుకున్న ఆయన రైతులతో కలిసి ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు. సాగునీటి కోసం ట్యాంకర్లతో పంటలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందుతుందన్న ఆశతో రైతులు వరి పంటలు సాగు చేసినప్పటికీ, 7–ఆర్ కాల్వ నిర్మాణం పూర్తికాకపోవడంతో పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాల్లో కూరుకుపోయామని రైతులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. ఈప్రాంతం పచ్చని పంటలతో కళకళలాడాలంటే బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు ద్వారా నీరు అందించాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మునుగోడుకు సమీపంలో ఉన్న బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు నుంచి కిష్టాపురం చెరువులోకి నీరు తరలించి మునుగోడు, నల్లగొండ మండలాల చెరువులను నింపాలని కోరారు. ఈ ప్రాంతానికి సరైన కోలమానాలు లేకుండా నకిరేకల్, నల్లగొండ ప్రాంతాలకు నీరు మళ్లించడం అన్యాయమని విమర్శించారు. మునుగోడు ప్రాంతంలోని సుమారు 17 గ్రామాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయాయని, నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.40వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఎండిపోతే రైతుకు కలిగే బాధ ఎంతో తాను వ్యవసాయం చేసిన వ్యక్తిగా తెలుసునని పేర్కొన్నారు. 7ఆర్ కాల్వ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి 18 గ్రామాలకు సాగునీరు అందించాలని బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు డిఇ పిచ్చయ్యతో ఫోన్‌లో మాట్లాడారు. సకాలంలో సాగునీరు అందించకపోతే రైతులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని నెల్లికంటి సత్యం హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, కలవలపల్లి మాజీ సర్పంచ్ గట్టుపల్లి నర్సిరెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజా రామచంద్రం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నరసింహ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి, మండల కార్యదర్శి చాపల శ్రీను, మండల సహాయ కార్యదర్శి మందుల పాండు, సిపిఎం మండల కార్యదర్శి మల్లేశం, ఉపసర్పంచ్ వీరమల్లు, ఎంపల్ల సాయిలు, పంతంగి లక్ష్మయ్య, గుండెబోయిన ధనమ్మ, పర్ని లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు తగ్గించడం సరికాదు

### తగ్గించిన నెలల ఏరియర్స్ జీతాలు కార్మికులకు అందించాలి

### మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్




**ప్రజాపక్షం/అమరచింత :** మెడికల్ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు తగ్గించడం సరికాదని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ కార్మికుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఆత్మకూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం గతంలో 30 పడకల సామర్థ్యానికి అనుగుణంగా పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులను విధుల్లోకి తీసుకున్నారని తెలిపారు. గత సంవత్సరం ఏప్రిల్ నెల నుండి 30 పడకల నుండి 23 పడకలకు తగ్గించిన నేపథ్యంలో ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య, భద్రత, రోగి సంరక్షణ కార్మికులకు భారీగా వేతనాలు తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమం కోసం మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ, వైద్య విధాన పరిషత్ పరిధిలోని జిల్లా వైద్య సమన్వయ అధికారి డాక్టర్ చైతన్యగౌడ్, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ హరినాథ్ కృషితో 30 పడకల ఆసుపత్రిగా కొనసాగించేందుకు అనుమతి వచ్చిందన్నారు. తగ్గించిన నెలల ఏరియర్స్ బడ్జెట్ వెంటనే విడుదల చేసి కార్మికులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఆస్పత్రి బ్రాంచ్ యూనియన అధ్యక్షులు ఎండి.సత్తార్, నాయకులు శ్రీకాంత్, ఎ.బాలకిష్టమ్మ, మైనోద్దీన్, బాలరాజ్, ఇ,బాలకిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ జోక్యంతో సింగరేణిని దివాలా తీయించారు

### సమస్యల పరిష్కారానికి ఆందోళనలకు సిద్ధంకండి

### కార్మికవర్గానికి రాజ్‌కుమార్ పిలుపు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణిని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆదుకుంటే తెలంగాణ ఏర్పాటు తర్వాత ఏర్పడిన ప్రభుత్వాలు విపరీత రాజకీయ జోక్యంతో రూ.51 వేల కోట్ల బకాయిలను పదమూడు సంవత్సరాలు దాటిన చెల్లించకుండా సంస్థను దివాలా తీయించారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందినందున గుర్తింపు సంఘం ఎఐటియుసి ఆందోళన కార్యక్రమాలకు పిలుపు నిచ్చిందన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి రెండు సంవత్సరాలు గడిచినా యాజమాన్యం కొన్ని సమస్యలను స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో అంగీకరించి ఇంతవరకు వాటిపై అమలు కోసం యాజమాన్యం సర్క్యులర్లు జారీ చేయలేదన్నారు. సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తుందని కనుక ఎఐటియుసి ఈనెల 17 నుండి 30 వరకు సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపు నివ్వడం జరిగిందని రాజ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లాగౌడ్, వై.వి.రావు, కేంద్ర కార్యదర్శులు కవ్వంపల్లి స్వామి, కందుకూరి రాజారత్నం, జూపాక రాంచందర్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్, ఆకునూరి శంకరయ్య, దాసరి శ్రీనివాస్, మిట్టపల్లి మొగిళి, మల్లయ్య, ఎవిఎస్. ప్రకాశ్, వినయ్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, ఏ.రవికుమార్, కనకరాజు, చంద్రయ్య, మహేందర్‌రావు, రాజయ్య, జగన్, రమేశ్ కుమార్ పాల్గొన్నారు.




## కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి



### బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు

**ప్రజాపక్షం/వరంగల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ హామీలను అమలు చేయనందుకు నిరసనగా, బడ్జెట్‌లో బిసిలకు రూ.55వేల కోట్లు కేటాయింపులు చేయాలని కోరుతూ వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం బిసిలకు బడ్జెట్ లో రూ.20వేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత గడిచిన రెండు సంవత్సరాలలో రూ.20 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని, అందులో కేవలం రూ.6వేల కోట్లు మాత్రమే బిసిలకు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. అది కూడా ఇందిరమ్మ చీరలకు రూ. 2500 కోట్లు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. గడచిన రెండు బడ్జెట్‌లో తక్కువ కేటాయింపులు చేసినందుకుగాను ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కలుపుకొని మొత్తం రూ.55 వేల కోట్ల రూపాయలు బిసిల కోసం కేటాయింపులు చేయాలన్నారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ లో పేర్కొన్న విధంగా వివిధ సామాజిక తరగతులకు ఆర్థిక తోడ్పాటు కోసం ఈ నిధులను ఖర్చు చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. కాని ఇప్పటి వరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం బిసిలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పి ఈ రిజర్వేషన్లను సాధించడానికి కేంద్ర ప్రభుత్వం మీద ఎలాంటి ఒత్తిడి తేలేదన్నారు. ఇది ఒక రకంగా కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం బిసిలను వంచించడమేనన్నారు. ఇప్పటికైనా బిసిలు ఎడల చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా ప్రతి అంశాన్ని రాబోయే రెండున్నర సంవత్సరాలలో పకడ్బందీగా అమలు చేయాలని వెంకట్రాములు కోరారు. కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, సహాయ కార్యదర్శి చీకటి ప్రకాష్, నాయకులు ఓదెల భద్రయ్య ఓదెల రవి అడ్డగట్ల యువరాజ్, రామగిరి రామస్వామి, గాజుల సుమలత, శారద, కవిత, సలేహా, సుల్తానా, రజిత, రేష్మ, అమరున్నిసాబేగం తదితరులు పాల్గొన్నారు

## పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/వరంగల్:** పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్ష సమయంలో విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వని స్కూళ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్ డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ పట్టణంలోని శివనగర్ తమ్మెర భవన్‌లోని ఎఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి ఏప్రిల్ 16 తేదీ వరకు జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతి పరీక్షలు వేల మంది విద్యార్థులు హాజరవుతున్నారని, పరీక్ష కేంద్రంలో మాస్ కాపింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల దగ్గర సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షసమయంలో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వని ప్రైవేట్ స్కూల్ పై యజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అలాగే వేసవికాలం కావడంతో విద్యార్థులకు తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు ఉంచాలని, విద్యార్థులు 10 నిమిషాల లేటుగా వచ్చిన అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి భరత్, శ్రేయస్, రవితేజ, చందు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలి



మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/వరంగల్ :** గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాదని, గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లాలోని గీసుగొండ మండలం మరియపురం గ్రామంలోని ఎస్.ఎస్. ఫంక్షన్ హాల్‌లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికపై జిల్లాలోని ప్రజాప్రతినిధులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మార్చి 6 నుండి జూన్ 12 వరకు మొత్తం చేస్తున్న 99 రోజుల కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సర్పంచ్ నుంచి మంత్రి వరకు ప్రతి ఒక్కరూ స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి దార్శనికతకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని, సంక్షేమ పథకాలు, ప్రజా సేవలను ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లాలని ఆదేశించారు.ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్లియర్ చేయడం, గ్రామాలు , పట్టణాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను ప్రత్యేకంగా చేపట్టడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభతరం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే మన పనితీరుకు ప్రధాన ధ్యేయంగా ఉండాలని అన్నారు. ఈ 99 రోజుల ప్రణాళిక ద్వారా పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం సరఫరా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకుని ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని అన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో పారిశుధ్యం అత్యంత కీలకమని తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని, ప్రజల ఆరోగ్యం కాపాడటంలో శానిటేషన్ ముఖ్య పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు గ్రామాలు, పట్టణాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను నియంత్రిస్తూ పర్యావరణానికి హాని కలిగించని ప్రత్యామ్నాయాలను ఉపయోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామపంచాయతీలు అవసరమైన మొక్కల కోసం ఇండెంట్ పంపితే సంబంధిత శాఖ ద్వారా సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సారంగపాణి, లక్ష్మీ, డిసిపి అంకిత్ కుమార్, డిఎఫ్ ఓ అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, గణేష్, రామ్ రెడ్డి, డిపిఓ కల్పన, జిల్లాలోని సర్పంచులు, కౌన్సిలర్లు , జి.డబ్ల్యూ.ఎం.సి పరిధిలోని కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అజంజాహి మిల్లు కార్మికులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి



**ప్రజాపక్షం/ వరంగల్ :** అజంజాహి మిల్లు కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని రిటైర్మెంట్ కార్మికుల అధ్యక్ష, కార్యదర్శులు ఐనముల శ్రీనివాస్, ఆరెల్లి కృష్ణలు డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ పట్టణంలోని వెంకట్రామ జంక్షన్‌లో అజంజాహి మిల్లు కార్మికుల రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 318 మంది కార్మికులకు మిల్లు స్థలంలోనే ఇంటి నిర్మాణానికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అజంజాహి మిల్లు కార్మికులకు న్యాయం చేస్తామని ఇచ్చినటువంటి హామీని అమలు చేయాలన్నారు. గత 24 సంవత్సరాలుగా అజంజాహి మిల్లు కార్మికులకు 200 గజాల ఇంటి స్థలము ను సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కేటాయించాలని దశలవారీగా అనేక రూపాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడంలేదని మిల్లు కార్మికుల కుటుంబాలు అనేక రకాలుగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, చాలా దీనమైన స్థితిలో జీవితాలను గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, సామాజిక కార్యకర్త ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు జనగాం కుమారస్వామి, దళిత బహుజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు మంచురాజేందర్, భాముల హరి నారాయణ, యాకోబ్, సందీప్, శ్యామ్, ప్రవీణ్, సూర్య, భాను, బిక్షపతి, ఇష్టం, సంజీవ, ప్రభావతి, సనా, ఉమ, ప్రమీల, వీరాశామ్, బచ్చన్న, కుమారస్వామి, మల్లేషం, సోదాల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/హనుమకొండ :** వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధిని నిర్దేశిత లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం, స్థానిక అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలిపారు. గురువారం 12 డివిజన్ పరిధిలో రూ.1.35 కోట్ల నిధులతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ప్రజల మధ్యలోనే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి డివిజన్‌లో ప్రారంభించిన పనులు ఆలస్యం కాకుండా నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చినట్లు తెలిపారు.నియోజకవర్గంలో ఉన్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు మంత్రులతో సమన్వయం చేస్తూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కీలకమైన అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వరుణగంటి అరుణకుమారి, కాంగ్రెస్ నాయకులు దేవరకొండ అనిల్, కాంగ్రెస్ నాయకులు కొంక హరిబాబు, గడ్డం శివరాం ప్రసాద్, చిర్ర రాము, రవి యాదవ్, నన్నబోయిన రమేష్ యాదవ్, అరుణ్, కమలాకర్ తో పాటు డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు తూముకే గండి



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** మండల కేంద్రం లోని, పాత చెరువు, తూముకు, గండి పెట్టి, చెరువు వెనుకాల ఉన్న పంట పొలాలకు, నీరును తీసుకువెళ్లే వైనం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం, రైతులకు, పంట పొలాలకు నీరందించే లక్ష్యంతో, రిజర్వాయర్ నింపి, కెనాల్ కాల్వల ద్వారా, చెరువులోకి నీరు నిలువ చేసి, భూగర్భ జలాలు పొందేందుకు నీటిని నిలువ చేస్తే,, మరి కొంతమంది రైతులు, ప్రభుత్వం చేసే, పనులకు చట్టరీత్యమైన అడ్డుపడుతూ, చెరువులోనికి నీరు వచ్చే, దానికి నేరుగా కాల్వ చేసి, చెరువులోనికి తూము గండిపెట్టి పొలాలు పారించుకున్న వైనం వెలుగులోకి వచ్చింది. వేసవికాలంలో, ఎండ తీవ్రతలకు, పొలాలు ఎండిపోకుండా, చెరువులో నుండి వచ్చే ఊట నీరు, బావులుని బోర్లు, ఎండిపోకుండా, చెరువులో నీరు ఉంటేనే, భూగర్భ జలాలు పెంపొంది, బోర్లు మోటర్లు, పొలానికి నీరందే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు కాయ కష్టం చేసి, పొలాన్ని నాటు పెట్టుకుంటే, పొలం ఎండిపోయే ప్రయత్నం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి, తూమును మూత వేసి చెరువులో నీరు నిల్వ ఉండేటట్లు ప్రయత్నం చేయాలని రైతులు కోరుతున్నారు.

## గూడూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ



**ప్రజాపక్షం/గూడూరు:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గూడూరు కమ్యూనిటి హెల్త్ సెంటర్‌ను మానుకోట జిల్లా కో ఆర్డినేటర్ చింత రమేష్ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలోని వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు.మెదటగా డాక్టర్లు మురియు వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న రిజిస్టర్లను తనిఖీ చేసిన ఆయన ఆపరేషన్ థియేటర్ ఓపి విభాగం రోగుల వార్డులను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పోందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న భోజనాన్ని కూడా పరిశీలించి నాణ్యతను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యులు మరింత కృషి చేయాలని డాక్టర్లుకు సూచించారు.వైద్య సేవలు పోందుందుకు వచ్చే ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు తీసుకోని రావాలని రోగులకు సూచించారు.అలాగే ఆసుపత్రి వచ్చే రోగులను మర్యాదగా చూసుకుంటూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు లక్ష్మ ణ్ నవత హెడ్ నర్సులు ఇంద్ర సుజయ మంజూలరాణి అనురాధ వైద్య సిబ్బంది పాల్గోన్నారు.

## అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలపై ఫోటో ఎగ్జిబిషన్: కలెక్టర్, ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లా కేంద్రం లోని శ్రీనివాస ఫంక్షన్ హాలులో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో డిపిఆర్ఓ శీలం. శ్రీనివాసరావు ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే విధంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వీక్షించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/తొర్రూరు :** గ్రామాల అభివృద్దే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రతీ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్య తనిస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వెలికట్ట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల ప్రజలకు మెరుగైన రోడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో సీసీ రోడ్ల పనులు ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలి

ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



**ప్రజాపక్షం/హనుమకొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్య చరణ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమం పై గ్రామీణ, పట్టణ ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ రవి, ఆర్డీవో రాథోడ్ రమేష్, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం వందేమాతరం, జయ జయహే తెలంగాణ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్య చరణ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, ఈ కార్యక్రమంపై నూతనంగా ఎన్నికైన సర్పంచులకు, కౌన్సిలర్లకు, అదేవిధంగా జిడబ్ల్యూఎంసి పరిధిలోని కార్పొరేటర్లకు అవగాహన కార్యక్రమం గ్రామాలు డివిజన్ల అభివృద్ధికి చాలా ఉపయోగమైనది విలువైనదని అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్నప్పుడే మర్చిపోకుండా ప్రజలు గుర్తుంచుకుంటారని అన్నారు. గ్రామాలు, డివిజన్లలోని పూర్వ విద్యార్థులు, ఎన్నారైలు గ్రామ అభివృద్ధికి డివిజన్ల అభివృద్ధికి తోడ్పాటు, భాగస్వామ్యం కోసం ప్రజా ప్రతినిధులు సంప్రదించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశంతో గ్రామాలు, డివిజన్ల సమగ్ర అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులుగా ముందుకు వెళ్దామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడొద్దని ప్రజాప్రతినిధులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందించేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తమ తమ గ్రామాలు, డివిజన్లు అభివృద్ధినే ధ్యేయంగా ప్రజా ప్రతినిధులు ముందుకు సాగాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఇది మొదటి శిక్షణ కార్యక్రమం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఎండి అజీజ్ ఖాన్, పరకాల మున్సిపల్ ఛైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, జడ్పీ సీఈవో శేషాద్రి, వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లాలోని ఆయా గ్రామాల సర్పంచులు, పరకాల మున్సిపల్ కౌన్సిలర్లు, జిడబ్ల్యుఎంసి కార్పోరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో ఫోటో ప్రదర్శనను వీక్షించిన కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమం సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో హన్మకొండ కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తిలకించారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, ముఖ్యంగా పారిశుద్ధ్యం మరియు ఇతర థీమ్లపై జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే విధంగా ఈ ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. వివిధ శాఖల ద్వారా అమలు చేసిన పనులు, ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని చిత్రాల రూపంలో ప్రదర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రదర్శనలోని చిత్రాలను ఆసక్తిగా పరిశీలించి, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరే విధంగా అవగాహన కల్పించడంలో ఇటువంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ రవి, డిఆర్డీఓ మేన శ్రీను సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆదాయ మార్గాలను అన్వేషించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఆదాయ మార్గాలను పెంచుకుని గ్రామాలు, పట్టణాలను అభివృద్ధి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాలులో సర్పంచులు, కౌన్సిలర్లుకు 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విరిగిన వంగిన విద్యుత్తు పోల్స్, విద్యుత్తు వైర్లు, ఇండ్లపై నుండి వెళ్తున్న 11 కెవి విద్యుత్తు వైర్లు గుర్తించి వాటిని తొలగించాలని తెలిపారు. విరిగిన పోల్స్ స్థానంలో నూతన పోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. 99 రోజుల ప్రణాళికలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పంచాయతిలు, మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా తయారు చేయాలని తెలిపారు. వ్యర్థాలు తొలగించాలని, మురుగు కాల్వలు పరిశుభ్రం చేయాలని తెలిపారు. బాలికలు గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ బారిన పడకుండా హెచ్ పివి వాక్సిన్ వేయించాలని తెలిపారు. జిల్లాలోని 2425 మంది బాలికలను గుర్తించామని వారందరు తప్పకుండా వాక్సిన్ తీసుకునే విధంగా అవగహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. మార్చి 6 నుండి జూన్ 12వ తేదీ వరకు శాఖల వారిగా చేపట్టాల్సిన కార్యక్రమాల షెడ్యూల్ వివరించారు. గ్రామాలు, మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి జాబితా తయారు చేసి ప్రజలకు తెలియ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డిఓ హరికృష్ణ, ఎఎస్పీ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ప్రజాప్రతినిధులను కోరారు. గురువారం జనగామ పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో జిల్లాలోని సర్పంచ్‌లు, మున్సిపల్ వార్డు సభ్యుల శిక్షణ జరిగింది. ఈ కార్యక్రమాలన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రజాపాలన కార్యక్రమాల్లో పాల్గొంటామని ప్రజా ప్రతినిధుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు, పట్టణ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమైందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి జరుగుతుందని, ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలు అందడంతో పాటు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం అవుతాయన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం 99 రోజుల యాక్షన్ ప్లాన్ ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, జనగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కడకంచి బాలమని, విజయ్‌కుమార్, వైస్ ఛైర్మన్ పర్వతాలు, ఆర్డిఓ గోపిరాం, వెంకన్నతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు కాళేశ్వరం పర్యటనకు మంత్రి శ్రీధర్ బాబు రాక

మంత్రి చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం క్షేత్రంలో నేడు (శుక్రవారం) రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పర్యటించనున్నారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలలో పాల్గొననున్నారు.ఈ మేరకు కాళేశ్వరంలో మంత్రి పర్యటన వివరాలను ఆయన వ్యక్తిగత సహాయకులు విడుదల చేసారు.మంత్రి పర్యటనలో భాగంగా ఉదయం 11 గంటలకు కాళేశ్వరం వద్ద రూ.22 కోట్ల నిధులతో నిర్మించ తలపెట్టిన కాళేశ్వరం నుండి పల్గుల వరకు గ7 కి.మీ బీటీ రోడ్డు పనులకు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేయనున్నారు. 12 గంటలకు రూ.1.20 కోట్లతో చేపట్టనున్న మ్యూజియం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని ఆది ముక్తీశ్వర ఆలయం నుండి సరస్వతి పుష్కర ఘాట్ వరకు రూ.2.38 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం రూ.1.55 కోట్లతో నిర్మించిన దేవస్థానం అన్నదాన సత్రాన్ని మంత్రి ప్రారంభోత్సవం చేయనున్నారు.అనంతరం దేవస్థానం ఈఓ కార్యాలయంలో మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో అధికార యంత్రాంగంతో కలిసి ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో రాబోయే గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పనులపై మంత్రి సమీక్షించనున్నారు. ఈ సమావేశంలోనే మంత్రి చేతుల మీదుగా కాళేశ్వరం,అన్నారం గ్రామాల ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇంటి పత్రాలు అందజేయనున్నారు.

## పడమటి కేశవాపూర్‌లో తీరిన తాగునీటి కష్టాలు

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** గ్రామస్థుల తాగునీటి ఇబ్బందులను శాశ్వతంగా తొలగించడమే తమ లక్ష్యమని పడమటి కేశవాపూర్ సర్పంచ్ ఎర్రోల్ల విజయ సోములు అన్నారు. మండలంలోని పడమటి కేశవాపూర్‌లో గత కొంతకాలంగా నెలకొన్న తాగునీటి సమస్యకు అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో పరిష్కారం లభించింది. రెండు రోజులకు ఒకసారి సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీటిని ఇకపై ప్రతి రోజు గల్లీకి అందించేలా పక్కా ప్రణాళికతో చర్యలు చేపట్టారు. గేట్‌వాల్స్ ద్వారా నీటి వృధాను అరికట్టడంతో పాటు గ్రామంలో సమానంగా నీరు అందేలా పర్యవేక్షిస్తారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వేముల మహాదేవ్, కిషన్, సత్తయ్య, రమేష్, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికునికి అండగా ఖమ్మం కార్మిక శాఖ

బాధితునికి రూ. 24.50 లక్షల పరిహారం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కార్మిక కుటుంబానికి కార్మిక శాఖ మరోసారి అండగా నిలిచింది. ఎక్కడో పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మిక కుటుంబానికి చెందిన వ్యక్తి గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ పెద్ద ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. ఆర్థిక ఆసరా కోసం న్యాయవాదిని ఏర్పాటు చేసుకుని న్యాయపోరాటం చేయాలన్న కనీస అవగాహన లేని ఆ కుటుంబానికి ఖమ్మం కార్మిక శాఖ అండగా నిలిచింది. డిప్యూటీ కమిషనర్ కె. విజయ్ భాస్కర్‌రెడ్డి చనిపోయిన కార్మికుని కుటుంబానికి చట్టపరంగా దన్నుగా నిలిచారు. సంబంధిత గ్రానైట్ కంపెనీ నుంచి రూ. 24.50 లక్షల పరిహారాన్ని అందించారు. ఇంత పెద్ద పరిహారం ఒక సామాన్య కార్మికునికి అందటం అరుదైన ఘటన. పశ్చిమ బెంగాల్ నుంచి బాధిత కుటుంబాన్ని పిలిపించి పై మొత్తాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. కార్మిక శాఖ పనితీరును కార్మిక సంఘాలు సైతం అభినందించాయి. బెంగాల్ రాష్ట్రానికి చెందిన రాకేష్ జన గతేడాది ఫిబ్రవరి 23న ప్రాణాలు కోల్పోయాడు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయినందుకు చట్టపరమైన చర్యలు తీసుకుని గ్రానైట్ ఫ్యాక్టరీపై కార్మిక చట్టం ప్రకారం చర్యలు తీసుకుని ఈ మొత్తాన్ని ఇప్పించగలిగారు. ఇదే సందర్భంలో గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని పరుచూరి మురళీ కృష్ణ కూడా మంజూరైన రూ. 16.50 లక్షలకు తోడు మరో ఎనిమిది లక్షలు ఇచ్చి ఆ కుటుంబానికి బాసటగా నిలిచారు. కార్మికుని భార్య సోమశ్రీ, కుమార్తె మౌమిత, తల్లిదండ్రులు భాగమతి, ప్రదీప్‌లకు ఈ చెక్కును అందజేశారు.

## డ్రగ్స్‌ను తరిమికొడదాం..

ఈగల్‌టీం హైదరాబాద్ డిఎస్‌పి భిక్షపతి




**ప్రజాపక్షం/పాల్వంచ :** జీవితాలను చిన్నాభిన్నం చేసే డ్రగ్స్, మత్తుపదార్థాలను తరిమికొట్టి భవిష్యత్‌ను బంగారుమయం చేసుకొందామని ఈగల్‌టీం హైదరాబాద్ డిఎస్‌పి భిక్షపతి అన్నారు. మండల పరిధి కేశవాపురం, జగన్నాధపురం గ్రామాల మధ్యన ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ ఫంక్షన్‌హాల్‌లో పాల్వంచ గ్రామీణ పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగంపై జరిగే అనర్థాలపై హైదరాబాద్‌కు చెందిన ఈగల్ టీమ్‌చే అవగాహనా సదస్సు పాల్వంచ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ టీమ్ డిఎస్‌పి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయటానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడానికి ఏర్పాటు చేసిందే ఈగల్ టీమ్ అని అన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలైన మద్యం, గంజాయి, కొకైన్, హెరాయిన్ లాంటి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సరదాగా తీసుకొంటే అలవాటుగా మారే ప్రమాదం ఉందని, అనంతరం అది మీ జీవితాలను చీకటిమయం చేస్తుందని, ప్రమాదకరమైన మత్తు పదార్థాలు ముందుగా లివర్, ఊపిరితిత్తులపై ప్రభావం చూపి క్రమేణా శరీరం నీరసించి మృత్యువాత పడతారని హెచ్చరించారు. దీనితో మిమ్మలను నమ్ముకొని జీవిస్తున్న భార్యా పిల్లలు, తల్లిదండ్రులు అనాథలవుతారని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ విక్రయించిన వారిపైనే కాకుండా తాగిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. మాదకద్రవ్యాల నిరోధక కేసులో ఒక్కసారి ఇరుక్కొంటే జీవితాంతం దాని ప్రభావం ఉంటుందని, ముఖ్యంగా విద్యార్థులు ఉద్యోగాలకు దూరమవుతారని అన్నారు. విద్యార్థులు విద్యార్థి దశలోనే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. అప్పుడే సమాజంలో మంచి గుర్తింపుతో పాటుగా ఉజ్వలమైన భవిష్యత్‌ను పొందుతారని చెప్పారు. కావునా మనతో పాటుగా సమాజంలో డ్రగ్స్ వినియోగం, దాని వల్ల కలిగే అనర్థాలపై బాధ్యతగా అవగాహన కల్పించాలన్నారు. మనమంతా చేయి చేయి కలిపి రాష్ట్రాన్ని డగ్స్ రహితంగా చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు, ప్రజలచే డగ్స మహమ్మారిని తరిమికొడదామని ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణ పరిధి ఇందిరా కాలనీ, నెహ్రూనగర్‌లలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్, తహసీల్దార్ దారా ప్రసాద్, పాల్వంచ గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ. సురేష్, పట్టణ ఎస్‌ఐలు నాగరాజు, జీవన్‌రాజు, కల్యాణి, ఎక్సైజ్ సిఐ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ భార్గవ్, ఎంఇఒ శ్రీరామమూర్తి, మండల వ్యవసాయాధికారి శంభోశంకర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభించాలి

'ఆత్మ' చైర్మన్ దిరిశాల

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రైతులు ఆధునీక వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని ఖమ్మం డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మండల పరిధిలోని రాంక్యాతండా రైతు వేదిక నందు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ రైతులు ఆధునీక వ్యవసాయ పద్ధతులను అవలంభించాలన్నారు. ఖర్చు తగ్గించుకుని అధిక లాభాలు వచ్చేటటువంటి ఆయిల్ పామ్ సాగు చేపట్టాలన్నారు. వరిలో కూడా వెదజల్లే పద్ధతులను అవలంభించడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు ఆదాయం లభిస్తుందన్నారు. ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ సాగుతో సేంద్రియ పద్ధతులను అవలంభించాలన్నారు. పర్యావరణ హితమైన సాగు చేపట్టాలని తద్వారా రైతులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రైతులు యాంత్రీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం యాంత్రీకరణ పథకానికి సంబంధించి యంత్రాల కొనుగోలుకు రాయితీలు కూడా అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏవో నారాయణరావు, మండల వ్యవసాయ అధికారి కె. ఉమామహేశ్వర రెడ్డి, ఉద్యానవన అధికారి నగేష్, ఖమ్మం డివిజన్ ఆత్మ బిటిఎం కె. ఆనందరావు, ఏఈవో శివ, ఆత్మ డైరెక్టర్లు, ఇస్కో కంపెనీ ప్రతినిధి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ కాలనీగా వెలుగుమట్ల

ఉగాది లోపు విద్యుత్ సరఫరా

ఆత్మ గౌరవంతో జీవించేలా చర్యలు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్రంలోనే మోడల్ కాలనీగా వెలుగుమట్లను తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పేదలు ఆత్మ గౌరవంతో జీవించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. గురువారం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో 38 ఇండ్ల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదరికాన్ని ఆసరా చేసుకుని దనార్జన కోసం కొంత మంది దళారులు ఫేక్ డాక్యుమెంట్‌తో పేదలకు భూదాన్ భూములను మోసపూరితంగా అప్పగించారన్నారు. 1953లో ఆసామి 31.07 ఎకరాల భూమిని భూదాన్ బోర్డుకు దానం చేశారన్నారు. భూదాన్ భూముల్లో ఉన్న పేదలు గత ఎనిమిదేళ్లుగా అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు లేక బాధలు పడ్డారన్నారు. పేదలు పడుతున్న బాధలను నుంచి కాపాడాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం కఠినంగా వ్యవహరించిందన్నారు. భూదాన్ భూములను స్వాధీనపర్చుకోవాలని, సిసిఎల్ఎ ఇచ్చిన ఆదేశాల ప్రకారం కూల్చివేతలు జరిగాయన్నారు. వెలుగుమట్లను మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించిన సోనియా గాంధీ పుట్టిన రోజు డిసెంబర్ తొమ్మిది నాటికి ఇండ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పేదలకు ఇచ్చిన తర్వాత మిగిలిన భూమిలో అధునాతన స్కూల్, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టం జరుగుతుందన్నారు. నిరుపేదలకు సున్న వడ్డీతో రుణాలు అందిస్తామన్నారు. వెలుగుమట్ల లేఅవుట్‌లో విద్యుత్ సరఫరా పనులు యుద్ధ ప్రాతిపదికన ఉగాది లోపు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. త్రాగునీటిపై మిషన్ భగీరథ ద్వారా తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలన్నారు. దళారులకు ఎవరు ఎంత డబ్బులు ఇచ్చారో వివరాలను పోలీస్ అధికారులకు అందించాలని తెలిపారు. ప్రజలను మోసం చేసిన ఎవరినీ విడిచి పెట్టమని కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, హౌజింగ్ పిడి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రంజాన్ గిఫ్ట్‌ప్యాకెట్లు, మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



**ప్రజాపక్షం/కూసుమంచి :** మైనారిటీ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండలానికి చెందిన మస్జిద్ కమిటీలకు రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లు, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ముస్లిం మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాసం పాటిస్తూ అల్లాను ప్రార్థిస్తూ సమాజంలో శాంతి, సౌహార్దం నెలకొల్పాలని కోరుకోవడం అభినందనీయమని అన్నారు. అల్లా మైనారిటీ సోదరుల కోరికలు నెరవేర్చాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రతి పేదవానికి అండగా నిలుస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు 200 కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళలు తమ నైపుణ్యాన్ని ఉపయోగించుకుని కుట్టు మిషన్ల ద్వారా ఆదాయం పొందుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ నెలలో మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పాలేరు నియోజకవర్గానికి చెందిన 163 మంది ముస్లిం మైనారిటీ మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లు, కూసుమంచి మండల మస్జిద్ కమిటీలకు 350 రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లు మంత్రి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఖమ్మంలో.. మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం

**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో 29 బ్రాంచిలతో వస్త్ర ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మాంగళ్య షాపింగ్ మాల్ ఖమ్మం నగరంలో కొత్తగా 30వ బ్రాంచ్‌ను ఈ నెల 13వ తేదీన ఘనంగా ప్రారంభించబోతోంది. ఆధునిక ఫ్యాషన్ ట్రెండ్స్‌కు అనుగుణంగా, ఖమ్మం నగర ప్రజలకు ఇప్పటివరకు చూడని లేటెస్ట్ డిజైన్లు, విభిన్న మోడల్స్‌తో ఈ షాపింగ్ మాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.పెళ్లిళ్లు, శుభకార్యాలు, పండుగలు వంటి ప్రత్యేక సందర్భాలకు అవసరమైన అన్ని రకాల వస్త్రాలను ఒకే చోట అందించేలా ఈ మాల్‌ను ఏర్పాటు చేశారు. పెళ్లికూతురు, పెళ్లికొడుకు కోసం ప్రత్యేకంగా రూపొందించిన వెడ్డింగ్ కలెక్షన్లు, మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం వేలాది రకాల ఆధునిక ఫ్యాషన్ దుస్తులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందించడం మంగళ్య షాపింగ్ మాల్ ప్రత్యేకతగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఖమ్మం నగర చరిత్రలోనే అత్యాధునిక వసతులతో, విస్తృత స్థాయిలో ఏర్పాటైన ఈ షాపింగ్ మాల్ ప్రజలకు కొత్త షాపింగ్ అనుభూతిని అందించనుంది.ప్రారంభోత్సవానికి ముందే నగరమంతా ఆకట్టుకునే విధంగా హోర్డింగ్స్, బ్యానర్లు, సోషల్ మీడియా ప్రచారంతో మాంగళ్య షాపింగ్ మాల్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. దీంతో ఖమ్మం ప్రజల్లో ఈ మాల్ ప్రారంభంపై ఆసక్తి పెరిగింది.ఈ నెల 13న ప్రముఖ సినీ నటి అందాల తార శ్రీలీల చే జరగనున్న ఘన ప్రారంభోత్సవ కార్యక్రమానికి నగర ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి లేటెస్ట్ ఫ్యాషన్ కలెక్షన్లను వీక్షించాలని నిర్వాహకులు ఆహ్వానించారు.

## చెత్త రహిత వార్డుగా నిలబెట్టడమే లక్ష్యం

సిపిఐ కౌన్సిలర్ దండి శ్రీజ



**ప్రజాపక్షం/ఖమ్మం–రూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీలోనే 30వ వార్డును చెత్త రహిత వార్డుగా నిలబెట్టడమే లక్ష్యమని కౌన్సిలర్ దండి శ్రీజ అన్నారు. ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా డివిజన్‌లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను వేకువజామునే పరిశీలించారు. అలాగే వార్డుల్లోని ప్రజలతో మాట్లాడుతూ...చేపట్టాల్సిన పనుల గురించి తెలుసుకొని దగ్గరుండి వర్కర్స్‌తో చేపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పారిశుద్ధ్యంలో నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రధాన బాధ్యతగా తెలిపారు. వార్డులో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. రోడ్లు, కాల్వలు శుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షణను మరింత బలోపేతం చేసానని చెప్పారు. ప్రజలు కూడా తమ పరిశరాలను శుభ్రంగా ఉంచడంలో సహకరించాలని కోరారు. ప్రతి వీధిలో క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకుంటామని, కాల్వలు, డ్రైనేజీలు తరచూ శుభ్రం చేసేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచి ఆదర్శంగా నిలిపేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, కిరణ్ స్థానిక కాలనీల సభ్యులు, పారిశుద్ధ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## గ్యాస్ అక్రమ నిల్వలపై కఠిన చర్యలు: కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో గ్యాస్ అక్రమ నిల్వలు ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. గురువారం ఐడిఓసిలో వ్యవసాయ, ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిలాల్లో వ్యవసాయానికి సంబంధించిన సాగుభూమి వివరాలు,ప్రస్తుత సాగు పరిస్థితులు, ప్రధాన పంటల వివరాలు, రైతులకు అందుతున్న ప్రభుత్వ పథకాలు అమలు పరిస్థితిపై వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. పౌరసరఫరాల శాఖతో రేషన్ దుకాణాలు, సన్నబియ్యం పంపిణీ నిల్వల పరిస్థితిపై చర్చించారు. జిల్లాలో గ్యాస్ కొరత లేదని ప్రజలకు అవగాహన కల్పించాలని, అక్రమ నిల్వలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ, పౌరసరఫరాలు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఎమ్మెల్యే ఆదినారాయణ




**ప్రజాపక్షం/చంద్రుగొండ :** మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు యువత పూర్తిగా దూరంగా ఉండాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు. గురువారం ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చంద్రుగొండ జాతీయ రహదారిపై నిర్వహించిన మానవహారం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని హెచ్చరించారు. ఇలాంటి వ్యసనాలకు గురై ఎవరైనా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసినా, లేదా అక్రమంగా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే 1098టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి ప్రజలు సహకరించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం అవుతాయని తెలిపారు. అనంతరం చంద్రుగొండ రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, జూలూరుపాడు సిఐ రాయల శ్రీలక్ష్మి , డిఆర్ఓ లక్ష్మీ పతి, డాక్టర్ వెంకట ప్రకాష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, మసీదు కమిటీ బాధ్యులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## లారీ, బైక్ ఢీకొని ఇద్దరు మృతి

ఇద్దరూ జామకాయ వ్యాపారులే



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** అతివేగంగా, అజాగ్రత్తగా వెళుతున్న లారీ ఒకటి ఎదురుగా బైక్ పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గురువారం సత్తుపల్లి మండలం నారాయణపురంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే పెనుబల్లి మండలం, మండాలపాడుకు చెందిన పానెం సులేమాన్ (55), సత్తుపల్లి మండలం, రేజర్ల గ్రామానికి చెందిన సాలి నాగేశ్వరరావు (60) జామకాయలు అమ్ముతూ జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం నారాయణపురం సమీపంలోని జామ తోటకు వెళ్లి కాయలు తీసుకొని తిరిగి సత్తుపల్లి వస్తుండగా నారాయణపురం మూల మలుపు వద్ద అతివేగంగా, అజాగ్రత్తగా వస్తున్న ఎపి 16, టిటి 6677 నెంబర్ లారీ బలంగా ఢీకొన్నది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న108 సిబ్బంది హుటా హుటినా ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వాళ్ల వద్ద ఉన్న మొబైల్ ఫోన్లు, నగదు బంధువులకు స్వాధీనపరిచారు. సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనతో వారి గ్రామాల్లో విషాదం నిండుకున్నది. కుటుంబ సభ్యులు కన్నీరు, మున్నీరుగా రోదిస్తున్నారు.

## పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి వార్షిక పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు బుర్రా మనోజ్, చెన్నంశెట్టి ఆకాష్‌లు తెలిపారు. గురువారం ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మనోజ్, ఆకాష్‌లు మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 14 నుంచి ఏప్రిల్ 13 వరకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టిసి బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. సెల్ఫ్ సెంటర్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎఎన్‌ఎంలను అందుబాటులో ఉంచాలని, తాగునీరు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థులు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు పవన్, రవి, నాగరాజు, కుమారస్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది పరీక్షా సమయం..

జిల్లావ్యాప్తంగా 98 టెన్త్ పరీక్షా కేంద్రాలు

హాజరుకానున్న16,975మంది విద్యార్థులు

ఒత్తిడికి లోను కావద్దని నిపుణుల సూచన

**ప్రజాపక్షం/ఖమ్మం :** పరీక్షల సమయం వచ్చేసింది. విద్యార్థులకే కాదు వారికి చదువుచెప్పిన ఉపాధ్యాయులకు కూడా ఒత్తిడి ఎదురుకానుంది. ఎలాగైనా తమ పిల్లలు అందరికంటే మెరుగైన ఫలితాలు సాధించాలని ఇటు విద్యాసంస్థల యాజమాన్యాలు, అటు అధ్యాపకులు మాత్రమేకాదు తల్లితండ్రులు కూడా ఆశిస్తుంటారు. చదువు విషయంలో ఇంట్లో తల్లితండ్రులు నుంచి ఉపాధ్యాయుల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి లోనవుతుంటారు. ఒకవైపు ఆందోళన మరోవైపు అనారోగ్యం. పదవతరగతి పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**పరీక్షల సమయంలో ఆందోళన తగదు: ప్రముఖ వైద్యుడు నారగాని రాంప్రసాద్**

విద్యార్థులు ఎండలో ఆడటం ద్వారా వడదెబ్బకు గురవుతుంటారు. కీలకమైన పరీక్షల సమయంలో పిల్లలు అస్వస్థతకు గురవుతుండటం, అనారోగ్యం కారణంగా చదవలేకపోవడం, చదివిన అంశాలు గుర్తుండకపోవడం వంటివి జరుగుతుంటాయి. పరీక్షల్లో ఫెయిల్ అయితే తల్లితండ్రులతోపాటు బంధువులు, ఇరుగుపొరుగు వారు చులకనగా చూస్తారనే భయంతో విద్యార్థులు ఒత్తిళ్లకు లోనవుతుంటారు.

**తగిన జాగ్రత్తలు తీసుకోవాలి..**

**సిహెచ్ ప్రసాద్, న్యూవిజన్ విద్యాసంస్థలు**

పరీక్షల సమయంలో తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. తాజా ఆహారం, కూరగాయలు ఆకుకూరలు, మజ్జిగలాంటివి ఎక్కువగా తీసుకోవాలి. మసాలాలు, వేపుడులకు దూరంగా ఉండాలి. డీ హైడ్రెషన్‌కు గురికాకుండా ఎక్కువగా నీళ్లు తాగాలి. సరిపడా నిద్రపోవాలి. విశ్లేషణాత్మకంగా చదవాలి పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటే విశ్లేషణాత్మకంగా చదవాలి. ఎటువంటి ఒత్తిడిలకు గురికాకుండా, టీవి, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటు ఎప్పటికప్పుడు సందేహాలు నివృత్తి చేసుకోవాలి.

**పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ అమలు..**

పరీక్షల నిర్వహణ సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జీరాక్స్ సెంటర్‌లు మూసివేయించనున్నారు. ఫ్లయింగ్‌స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ పరీక్ష కేంద్రాలలో ఆకస్మికంగా సందర్శిస్తూ పరీక్షల నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా తీసుకోనున్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరికి మొబైల్‌ఫోన్ లు అనుమతిలేదు.

**మంచి మార్కుల సాధనకు చేతిరాత ముఖ్యమే**

**:డాక్టర్ పి భూమేశ్వరరావు, న్యూఇరా విద్యాసంస్థలు**

చాలామంది విద్యార్థులు పరీక్షలకు బాగా ప్రిపేర్ అవుతారు. ఎలాంటి కఠినమైన ప్రశ్నలు ఇచ్చినా రాసేందుకు సిద్ధమవుతారు. కాని చేతి రాత మాత్రం అంతంత మాత్రమే ఉంటుంది. ఫలితంగా వారు రాసింది. పేపర్ దిద్దేవారికి అర్థం కాకపోవడంతో వారు పడిన శ్రమకు తగిన గుర్తింపు లేకుండా పోతుంది. దీనివలన తక్కువ మార్కులు వస్తుంటాయి. అందుకే ఎక్కువ మార్కుల సాధనకు అందమైన చేతిరాత అతి ముఖ్యం.

## అక్క మృతితో దుఃఖంలోనూ పరీక్ష రాసిన చెల్లెలు



**ప్రజాపక్షం/ మధిర :** అక్క మరణంతో తీవ్రదుఃఖంలో మునిగిపోయినా తన భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం పరీక్షకు హాజరైన ఓ విద్యార్థిని మనస్సు కదలించే ఘటన మధిరలో చోటు చేసుకుంది. మధిరకు చెందిన స్వర్గం చంద్రహసిని అనే విద్యార్థిని ఖమ్మంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాస్తోంది. అయితే బుధవారం మధిర సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె అక్క శరణ్య ప్రమాదవశాత్తు మృతి చెందింది. అక్క ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అయినప్పటికీ తన విద్యను ఆపకూడదనే సంకల్పంతో కన్నీళ్లు దిగమింగుకుని చంద్రహాసిని పరీక్షా కేంద్రానికి వెళ్లి ఇంటర్ మొదటి సంవత్సరం కెమిస్ట్రీ పరీక్షను రాసింది. తీవ్ర మనోవేదన మధ్య కూడా ధైర్యంగా పరీక్ష రాసిన హాసిని పరిస్థితి అక్కడున్న వారందరినీ కదిలించింది. ఆమె పట్టుదల, ధైర్యాన్ని పలువురు అభినందించారు. అక్కను కోల్పోయిన దుఃఖంలోనూ భవిష్యత్ కోసం పరీక్ష రాసిన ఈ విద్యార్థిని ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శుక్రవారం
13-03-2026
www.prajapaksham.in

కాస్మోస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రెజెన్స్ , కార్తీక్ క్రియేషన్స్ బ్యానర్ పై మలయాళంలో అనుపమ పరమేశ్వరన్, సురేష్ గోపి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన కోర్ట్‌రూమ్ డ్రామా చిత్రం జానకి వర్సెస్ కేరళ (జెఎస్.కె ) తెలుగులో ఈ సినిమా మార్చి 13న విడుదల కాబోతుంది. ఎంజి మూవీస్ ద్వారా అచ్చిబాబు సినిమాను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో విడుదల చేస్తున్నారు. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ట్రైలర్ ఇటీవల విడుదలైంది.


రీల్

# నీ రుణం తీరేది ఎట్లా? పోస్టర్ ఆవిష్కరణ



సినీ నటుడు రచ్చ రవి మహిళా దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని 'నీ రుణం తీరేది ఎట్లా?' అనే పోస్టర్‌ను సినీ కవి రచయిత నటులు తనికెళ్ళ భరణి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తనికెళ్ళ భరణి మాట్లాడుతూ నీ రుణం తీరేది ఎట్లా అనే ఈ పోస్టర్ తో రచ్చ రవిలో మరో కోణం బయటికి వస్తోందని అన్నారు. ఆ కోణం ఏంటో త్వరలోనే తెలుస్తుందని భరణి చెప్పారు. రచ్చ రవిప్రకటన లో పోస్టర్ విడుదలకు కు సంబంధించిన విషయాలను తెలియజేస్తూ ప్రజల ప్రోత్సాహం తల్లి దండ్రుల ఆశీర్వాదంతో ఇప్పటివరకు బుల్లి, వెండితెరలపై అనేక వైవిధ్య పాత్రలను పోషించే అవకాశం దక్కిందని, ఇప్పటివరకు సుమారు 150 సినిమాలలో విభిన్న పాత్రలలో నటించే అవకాశం దక్కిందని తాను నటించిన అన్ని పాత్రలు సంతృప్తిని కలిగించాయని, మహిళ లేనిదే సమాజం లేదని అమ్మ గా అక్క గా చెల్లిగా భార్యగా విభిన్న పాత్రలు పోషించేది కేవలం మహిళలేనని , మహిళా దినోత్సవం సందర్భంగా 'నీ రుణం తీరేది ఎట్లా?' అనే పోస్టర్ ను ఆవిష్కరించుకోవడం జరిగిందని,ఇదే క్రమం లో మహిళా మణులను గౌరవించుకోవడం మన బాధ్యత అని ఇందుకోసం మే 10 మాతృ దినోత్సవం సందర్భం గా మరో ఆవిష్కరణకు సిద్ధం అవుతున్నట్లు రచ్చ రవి తెలిపారు.

## 'దీవాన' మూవీ టీజర్ రిలీజ్




శుభం సినిమాతో విజయాన్ని అందుకున్న యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'దీవాన'. స్నేహ మణిమేగలై హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయమవుతుంది. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి రూపొందిస్తున్నారు. 'దీవాన' సినిమా ఈ వేసవికి గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. 'దీవాన' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే మణిరత్నం సినిమా ఫీల్ కలుగుతోంది. ఈ టీజర్ ఎలా ఉందంటే ఓ పెళ్లి వేడుకల్లో హీరోయిన్ ను చూసి లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అన్నట్లు ప్రేమలో పడతాడు హీరో. అప్పటి నుంచి ఆ అమ్మాయే లోకంగా బతుకుతుంటాడు. ఆ అమ్మాయి తరుపు వాళ్లతో ప్రమాదమని స్నేహితులు చెప్పినా వినిపించుకోడు. ఇంతే ప్రేమ అమ్మాయి నుంచి కూడా ఈ అబ్బాయికి దక్కిందా లేదా అనేది థియేటర్స్ చూడాలి. టీజర్ లోని 'ప్రేమ ఇది ప్రేమ గుండెల్లోన సడిరేపేదే ప్రేమ...' సాంగ్ బీజీఎం హార్ట్ టచింగ్ గా ఉంది. టీజర్ చివరలో 'ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్త్రరా ఈ పోరీలు, అది నీ పానం పీక్కతినకపోతే నన్ను అడుగురా..' అనే డైలాగ్స్ ఆసక్తి కలిగిస్తున్నాయి. 'దీవాన' సినిమాలో ఒక ఇంటెన్స్ బ్యూటిఫుల్ మ్యూజికల్ లవ్ స్టోరీ చూడబోతున్నట్లు టీజర్‌తో తెలుస్తోంది. ఈ చిత్రానికి కాస్ట్యూమ్స్ మానస, ప్రొడక్షన్ డిజైనర్ ఝాన్సీ గోజల, ఎ డిటర్ హృషికేశ్ పాస్పల్, డీవోపీ వంశీ పచ్చిపులుసు, మ్యూజిక్ ఈశ్వర్ చంద్.

# 'గద్దర్'అవార్డు రావడం మరచిపోలేని అనుభూతి

**దర్శకుడు విజయ్ కుమార్, నిర్మాత శ్రీకాంత్**



స్వతంత్ర సమరయోధుడు, తెలంగాణ జాతిపితగా పిలుచుకునే కొండాలక్ష్మ ణ్ బాపూజీపై యువ దర్శకుడు బడుగు విజయ్ కుమార్ రూపొందించిన డాక్యుమెంట్రీ ఫిల్మ్ యూనిటీ. ది మ్యాన్ ఆఫ్ సోషల్ పేరుతో చిరందాస్ శ్రీకాంత్ నిర్మించిన ఈ డాక్యుమెంటరీ ఫిల్మ్‌కు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల్లో తొలి స్థానందక్కింది. 2025 సంవత్సరానికి గాను వెల్లడించిన గద్దర్ ఫిల్మ్ అవార్డుల్లోని డాక్యుమెంటరీ విభాగంలో తొలి ఉత్తమ డాక్యుమెంటరీగా గద్దర్ అవార్డును సొంతం చేసుకుంది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కొండా లక్ష్మ ణ్ బాపూజీ.... తెలంగాణ సమాజానికి మరో గాంధీ ఎలా అయ్యాడనే విషయాన్ని చాలా ఆసక్తికరంగా పెద్దల నుంచి పాఠశాల విద్యార్థులకు సైతం సులభంగా అర్థమయ్యేలా యూనిటీ డాక్యుమెంటరీని విజయ్ కుమార్ చిత్రీక రించారు. మైమ్ మధు, బాలనటుడు భాను ప్రధాన పాత్రలు పోషిస్తూ బాపూజీ కథను వివరించారు. నాణ్యమైన విజువల్స్, స్పష్టమైన వాయిస్ ఓవర్, చక్కని ఎడిటింగ్ తో ప్రేక్షకులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా సుమారు అరగంటపాటు యూనిటీ డాక్యుమెంటరీని తీర్చిదిద్దారు.ఇప్పటికే యూనిటీ డాక్యు మెంటరీ పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కూడా శభాష్ అనిపించుకొని అవార్డులు అందుకుంది. 2025లో ఢిల్లీలో జరిగిన 15వ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుల్లో ఉ త్తమ దర్శకుడిగా దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకోగా.... ముంబయిలో జరిగిన భారత్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్2023లో యూనిటీ డాక్యుమెంటరీకి రెండు అవార్డులు దక్కాయి. బెస్ట్ హిస్టారికల్ డాక్యుమెంట్ ఫిల్మ్, ఐకానిక్ ఫ్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డును యూనిటీ సొంతం చేసుకుంది. ఇలా... ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకున్న డాక్యుమెంటరీ ఫిల్మ్ ను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి గద్దర్ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల దర్శకుడు విజయ్ కుమార్, శ్రీకాంత్ ఆనందం వ్యక్తం చేశారు. అవార్డుకు ఎంపిక చేసిన జ్యూరీచైర్మన్ విజయ్ కనకమేడల, జ్యూరీ సభ్యులకు దర్శకుడు విజయ్, నిర్మాత శ్రీకాంత్‌తోపాటు అందులో నటిం చిన మైమ్ మధు, బాలనటుడు మాస్టర్ భాను ప్రత్యేక కృ తజ్ఞతలు తెలిపారు.

# ఇండస్ట్రీకి పెద్ద దిక్కు ఎవరూ లేరు: తమ్మారెడ్డి



తెలుగు సినిమా పరిశ్రమకు పెద్ద దిక్కు ఎవరో లేరని ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ సంచలన వ్యాఖ్యలు చేశారు. పెద్ద దిక్కు అనేది ఒక పదవి కాదని ఆయన అన్నారు. వదలా సినిమాకు సంబధించిన ప్రెస్ మీట్‌లో ప్రజాపక్షం ప్రతినిధి అడిగిన ఓ ప్రశ్నకు తమ్మారెడ్డి భరద్వాజ ఈ విధంగా స్పందించారు. ఎవరైనా చేసే పనులను బట్టి పెద్ద దిక్కు అవుతారు. ఒకాయన చేసిన పనుల వల్ల ఇండస్ట్రీకి ఆయన పెద్ద దిక్కు అయ్యాడు. ఆయన చేసిన మంచి పనుల వాళ్ళ, మేమంతా ఆయన దగ్గరికి వెళ్లడం వల్ల ఆయన పెద్దదిక్కు అయ్యారు. ఇవ్వాళ ఆయన లేరు కాబట్టి పెద్ద దిక్కు ఇంకెవరూ లేరు. కొత్తగా పెద్ద దిక్కు రావడం అనేది జరగదు. ఆయన ఒక్కడే. ఇంకొక్కడు రాడు...లేదు కూడా. అని తమ్మారెడ్డి భరద్వాజ పేర్కొన్నారు.నేను సినిమా తీసి దాదాపుగా పది సంవత్సరాలు అవుతోంది. సినిమా అంటే భయపడుతున్న సమయంలో కిషోర్ వచ్చే సినిమా చేద్దామన్నారు. జగపతి బాబుకి కథ చాలా నచ్చింది కథ పై నమ్మకంతో మొదలుపెట్టాం. అప్పటికి ఇప్పటికీ ఏం మారలేదు. ఈ సినిమా అని చేసినంతకాలం పని తప్పితే ధ్యాస లేదు. ఈ రోజుల్లో కూడా 24 గంటలు పాటు పనిచేస్తున్నారని ఈ సినిమా చేశాక తెలిసింది. అందరు కూడా చాలా సిన్సియర్ గా పనిచేశా రు. దానికి ఫలితం మీరు చూసిన గ్లింప్స్. జగపతిబాబు ఈ సినిమాకి ఒక నిర్మాత క ంటే ఎక్కువగా పని చేశారు. బాబు లేకుండా ఈ సినిమాని అసలు ఊహించలేము. చోటా కె నాయుడు గురించి ఎంత చె ప్పుకున్నా తక్కువే. వీళ్ళిద్దరికీ థాంక్యూ వెరీ మచ్. సునీల్ నారంగ్‌కి థాంక్ యూ. నేను పరిశ్రమలకు వచ్చి 50 ఏళ్ళు అవుతోంది. చాలా కాలం త ర్వాత ఈ సి నిమా చేస్తున్నాను.

# 'ఆయా షేర్' ఫుల్ కిక్ ఇచ్చింది

**గేయ రచయిత కాసర్ల శ్యామ్**



నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్.' ఈ సినిమాలో ఆయా షేర్ అనేపాట సంచలనం సృష్టించింది. ప్రస్తుతం ఆయా షేర్ ప్రపంచవ్యాప్తంగా టాప్ లో ట్రెండ్ అవుతూ భారీ రెస్పాన్స్ అందుకుంటుంది.ఈ సందర్భంగా ఆయా షేర్ పాట గేయ రచయిత కాసర్ల శ్యామ్ మీడియాతో చిట్ చాట్ చేశారు.ఆయా షేర్ పాట ప్రోమో విడుదలైనప్పటి నుంచి మంచి బజ్ క్రియేట్ చేసింది. పాట రిలీజ్ అయిన తర్వాత అన్ని రికార్డ్స్ బద్దలు కొట్టుకుంటూ అందరికి నచ్చింది. అనిరుధ్ నేను ఇచ్చిన పదాలు తీసుకొని జనాలకి రీచ్ అయ్యేవిధంగా ట్యూన్ చేశారు. మట్టి వాసన తెలిసిన జానపద గాయకులు జంగిరెడ్డి, దేవయ్య అద్భుతంగా పాడారు. ఇంత ఫిరోషియస్ సాంగ్ లో లిరిక్స్ గురించి ప్రత్యేకంగా మాట్లాడడం చాలా ఆనందాన్నిచ్చింది.నా కెరీర్లో ఈ పాట ఇచ్చినంత కిక్కు మరి ఏ పాట ఇవ్వలేదు. నేను ఉపయోగించిన భాష, యాసకి సోషల్ మీడియాలో చాలా అద్భుతమైన ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ స్పందన నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది.ఈ సినిమాలో నాని క్యారెక్టర్‌లో ఒక అద్భుతమైన ఎమోషన్ ఉంటుంది. ఆ రెండు జడల వెనుక మంచి కథ ఉంటుంది. ఇప్పుడు అందరూ ఆ రెండు జడల గురించి మాట్లాడుకుంటున్నారు. సినిమా చూసిన తర్వాత వాటికి అద్భుతమైన జస్టిఫికేషన్ ఉందని అనుకుంటారు. ఇప్పుడు అందరు కూడా జడలు వేసుకుని రీల్స్ చేస్తున్నారు.అనిరుద్ పాట చేస్తున్నప్పుడే పెద్ద హిట్ కొడుతున్నాం అని చెప్పారు. ఈ పాట సక్సెస్ కి ముఖ్య కారణం డైరెక్టర్ శ్రీకాంత్. జనం నుంచి పుట్టిన ఒక వీరుడు ఆ జనాలకు స్ఫూర్తిని ఇచ్చే క్రమంలో వచ్చిన పాట ఇది. ఈ పాట రాయడానికి వారం రోజులు పట్టింది. కొన్ని వెర్షన్స్ డెవలప్ చేసుకుంటూ చివరికి దీనిని ఫిక్స్ చేశాం. కాకపోతే సాంగ్ సెంట్రల్ ఐడియా మాత్రం ఇమ్మీడియట్ గా లాక్ చేశాం.ఈ సినిమాలో హీరో క్యారెక్టర్ చెప్పడానికి ఒక ప్రత్యేకమైన పల్లవి ఉంటే బాగుంటుంది అనుకున్నాను. సీనియర్ కవులని స్ఫూర్తిగా తీసుకునే ముందుకు సాగుతున్నాను. కొసరాజు , జాలాది ఈ యాసతో ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొందారు. నేను రాసిన ఎక్కువ పాటలు తెలంగాణ యాసలో వచ్చాయి. దాదాపు అన్ని రకాల పాటలు రాశాను.డైరెక్టర్ ఈ పాట గురించి పూర్తిగా వివరించారు. ఒక జాతి కష్టం నుంచి పుట్టే ఒక యోధుడు ఆ జాతికి స్ఫూర్తి నింపే నేపథ్యంలో వచ్చే పాటిది. 80 దశకాల్లో జరిగే నేపథ్యం కాబట్టి అప్పుడు ఉర్దూ ప్రభావం ఉంటుంది. అందుకే ఇందులో చాలా వరకు ఉర్దూ పదాలు ఉపయోగించడం జరిగింది. నేను గురువుగా భావించే మా చంద్రబోస్ నేషనల్ అవార్డు రాగానే నాకు ఫోన్ చేసి 'మీరు చాలా తక్కువ సమయంలో అచీవ్ చేశారు తమ్ముడు'అన్నారు. అది నాకు చాలా ఆనందాన్నిచ్చింది.నా మొదటి సినిమా చంటిగాడు. కృష్ణవంశీ దర్శకత్వంలో శ్రీకాంత్ హీరోగా నటించిన మహాత్మ సినిమాలో 'నీలపూరి గాజుల ఓ నీలవేణి నిల్చుంటే కృష్ణవేణి' అనే పాటతో నాకు ఫస్ట్ బ్రేక్ వచ్చింది. ఆ తర్వాత చాలా సినిమాలు రాశాను. తర్వాత ఇస్మార్ట్ శంకర్, రాములో రాములా, డిజె టిల్లు. వరుసగా విజయవంతమైన పాటలు వచ్చాయి. ఇటీవల శంకర వరప్రసాద గారు సినిమాలో చిరంజీవి, వెంకటేష్ కలిసి చేసిన డ్యాన్స్‌కు నేను పాట రాయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. విశ్వంభరలో కూడా నా పాట ఉంది. పవన్ కళ్యాణ్ కి ఉస్తాద్ లో రాశాను.'నాకు లైఫ్ లాంగ్ సరిపోయే కిక్ ఇచ్చారు. ధూమ్ ధామ్ దోస్తానా, చమ్కీలా అంగి, ఇప్పుడు ఆయా షేర్.. ఇలా నాకు మర్చిపోలేని హిట్లు ఇచ్చారు' అని చాలా అభినందించారు. ఇలాంటి అద్భుతమైన సెలబ్రేషన్‌కి నేను రాయడం చాలా ఆనందంగా ఉందని ఆయన ప్రత్యేకంగా ట్వీట్ కూడా చేశారు. డైరెక్టర్ సాంగ్ సిచువేషన్ ని చాలా క్లియర్ గా చెప్పారు. నేను నాని జడల్ క్యారెక్టర్ ని దృష్టిలో పెట్టుకున్నాను. హీరో ఎప్పుడూ కూడా పుస్తకాల్లో నుంచి పుట్టడు. కష్టం వస్తే జనం మధ్యలో నుంచి పుట్టుకొస్తాడు. అలా జనం మధ్యలో నుంచి పుట్టుకొచ్చిన ఒక వీరుని కథ ఇది. అలాంటి క్యారెక్టర్ కి ఒక ఎమోషన్ ఉంది. అందుకే పచ్చబొట్టు గాయం. గుంజుకున్న న్యాయం..ఇలాంటి పద ప్రయోగాలు చేశాను. ఈ సాంగ్ వచ్చిన తర్వాత సినిమాపై ఇంపాక్ట్ డబుల్ అయింది. కమర్షియల్ గా మార్కెట్ పరంగా స్కేల్ మారిపోయింది ఇదంతా డైరెక్టర్ శ్రీకాంత్ విజన్. ఇందులో ఎమోషన్స్ యాక్షన్ అన్ని కూడా నెక్స్ట్ లెవెల్ లో ఉంటాయి.నిర్మాత సుధాకర్ నిర్మాత ఎక్కడ కూడా ఖర్చుకి వెనకాడలేదు.

# రాష్ట్ర సమగ్రా అభివృద్ధికి రూరల్ అగ్రి రీజియన్‌పై దృష్టి

**మూడు ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం**
**పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగంలోకి తీసుకురండి**
**ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క**



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కీలకమని, ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వరాదని, ప్రతి కదలిక పోలీసుల కను సన్నల్లో ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విధుల నిర్వహణ క్రమంలో హోం శాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో గురువారం మొదట హోంశాఖ, అనంతరం తదుపరి మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి పరిశ్రమలు, ఐటి శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సిఎం పలు సూచనలు చేశారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు పోతున్న క్రమంలో ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని డిప్యూటీ సిఎం అన్నారు. 2047 త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష సాధనలో పబ్లిక్, ప్రైవేట్ (పిపి) మోడల్ అనివార్యమని, ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని పరిశ్రమల శాఖ అధికారులకు డిప్యూటీ సిఎం సూచించారు. హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని ఇందులో భాగంగా పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవి) వినియోగాన్ని పెంచాలని సూచించారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉంటుందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీసీ కెమెరాల వినియోగాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని చిన్న కదలికను సైతం వెను వెంటనే గుర్తించి నిఘాను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలని అందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. క్యూర్, ప్యూర్ ప్రాంతాలతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రేర్ (రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ) కు సమ ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సిఎం సూచించారు. రేర్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనేది ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. ఎంఎస్ఎంఈల ద్వారా రాష్ట్ర నలుమూలలోని యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధితో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న రంగమని తెలిపారు. మొత్తం 41 జిసిసిలతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, ఇదే వేగాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం కల్పిస్తామని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. డాటా సెంటర్లలో ఎఐ వినియోగాన్నిపెద్దఎత్తున చేపట్టాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సి.వి.ఆనంద్, టిజిఐఐసిసి ఎండి శశాంక, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


# రేపటి నుంచి పదవ తరగతి పరీక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 14 నుంచి ఉదయం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలను నిర్వహించగా, ఐదు నిమిషాల గ్రేస్ టైమ్‌తో విద్యార్థులు ఉదయం 9.35 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతినిస్తారు. ఆ తర్వాత వచ్చే వారికి అనుమతి ఉండబోదని పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. పరీక్ష హాల్‌లో హాల్‌టికెట్, పరీక్ష ప్యాడ్, పెన్,పెన్సిల్, స్కేల్, షార్ప్‌నర్, ఎరేసర్,జ్యామెట్రీ వాటిని మాత్రమే అనుమతినిస్తామనిఅధికారులు స్పష్టం చేశారు. పదవ తరగతి పరీక్షలకు మొత్తం 5,28,239 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 5,17,727 మంది, ఒకసారి ఫెయిల్ అయిన వారు 10,512 మంది ఉండగా, బాలురు 2,67,954 మంది, బాలికలు 2,60,285 మంది ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 2,07,573 మంది, సంక్షేమ పాఠశాలల నుంచి 60,139 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 2,50,015 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. బిఎస్ఇ వెబ్‌సైట్ (www.bse .telangana.gov.in)లో హాల్‌టికెట్లను అ ందుబాటులో పెట్టారు. విద్యార్థులు పరీక్ష కు కనీసం ఒక రోజు ముందే తమ పరీక్షా కేంద్రాన్ని సందర్శించాలని పాఠశాల విద్యా శాఖ సూచించారు. పరీక్ష రోజు ఉదయం 8.30 గంటల వరకే కేంద్రానికి చేరుకోవాలని, తద్వారా పరీక్ష సమయానికి లోపలికి వెళ్లడానికి అవకాశం ఉంటుందని అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రంలోనికి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి ఉండబోదని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. సెల్‌ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను పూర్తిగా నిషేధించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండే విధంగా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విద్యాశాఖ సూచించింది.

# నేడు,రేపు రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు

**ప్రారంభించనున్న కూనంనేని**
**హాజరుకానున్న నారాయణ, పల్లా, కె. రామకృష్ణ**




ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ తరుపున నేడు, రేపు రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. పాల్వంచలోని సుగుణ గార్డెన్స్‌లో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబ శివరావు తొలి రోజు శుక్రవారం ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథులుగా సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డా .కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకటిరెడ్డి, కే రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషాతో పాటు రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు హాజరుకానున్నారు.

**మొదటి రోజు 13వ తేది శుక్రవారం:**

- ఉ.10 గం.లకు ప్రారంభమయ్యే ఈ శిక్షణా తరగతుల్లో డాలర్ పుట్టుక, ప్రాధాన్యత, డాలర్ మారకపు విలువ, బడ్జెట్‌పై అవగాహన అనే అంశాన్ని కూనంనేని సాంబశివరావు వివరిస్తారు.
- ఉ.11 గం. నుండి 12 గం. వరకు ఆర్టికల్ 73,74 సవరణలు రాజ్యాంగ బద్ధత, స్థానిక సంస్థల ప్రాధాన్యత అనే అంశంపై మాడభూషి శ్రీధర్ మాట్లాడుతారు.
- మ.2 గం. నుండి 3 గం. వరకు ప్రజా స్వామ్యంలో స్థానిక సంస్థల పాత్ర అనే అంశంపై ప్రొఫెసర్ కోదండ రామ్ మాట్లాడుతారు.
- సా.4 గం. నుండి 5 గం. వరకు స్థానిక సంస్థలు, కమ్యూనిస్టుల పాత్ర అనే అంశంపై ప్రొఫెసర్ హరగోపాల్ వివరించనున్నారు.

**రెండో రోజు 14వ తేది శనివారం:**

- ఉ.10.30 గం. నుండి 11.30 గం. వరకు భారతదేశ సమాఖ్య విధానం, రాష్ట్రాలకు, స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపులో కేంద్రప్రభుత్వ వివక్షత అనే అంశంపై పరకాల ప్రభాకర్ వివరిస్తారు.
- మ.12 గం. నుండి 1 గం. వరకు ప్రభుత్వాలు,చట్టాల దుర్వినియోగం అనే అంశంపై ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతారు.
- సా.3 గం. నుండి 5 గం. వరకు ప్రజాప్రతినిధులుగా కమ్యూనిస్టుల పాత్ర అనే అంశంపై ప్రొఫెసర్ నాగేశ్వర రావు వివరించనున్నారు.

**ఏర్పాట్లు పరిశీలించిన సాబీర్ పాషా:**

రెండు రోజుల శిక్షణా తరగతులను పురస్కరించుకుని గురువారం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా సుగణ గార్డెన్స్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా తరలివస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా చూడాలని ఆయన వాలంటీర్లకు సూచించారు. ఈ శిక్షణా తరగతులను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులతో పాటు నియోజకవర్గ పుర ప్రముఖులు, వార్డు సభ్యులు హాజరుకావాలని పాషా కోరారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం. జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, వీశంశెట్టి పూర్ణచంద్రరావు తదితరులున్నారు.

## ... రూపొందించాలి

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, మహిళా నాయకురాలు విజయలక్ష్మి పండిట్, ప్రొఫెసర్ సారంగపాణి, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభులింగం, దొడ్డ వెంకటయ్య, మెడకంటి వెంకట్ రెడ్డి, ఒళ్ళు ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాస్, కోశాధికారి డి.జి. నరేంద్ర ప్రసాద్, రైతు మహిళా నాయకురాలు స్వరూప, ఎం. వెంకటేశ్వర్లు, లెక్చరర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాణి ప్రశంస మాట్లాడుతూ మహిళా రైతులపై సమగ్ర డేటా సేకరించి, వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక మహిళా రైతుల విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళా రైతులు ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నందున వాటిని అధిగమించేందుకు సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళలు కష్టపడి వ్యవసాయం చేసినప్పటికీ వారిని రైతులుగా అధికారికంగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారసత్వ హక్కులపై చట్టాలు ఉన్నప్పటికీ అమలు లోపాల వల్ల మహిళల పేరుపై భూమి దేశంలో కేవలం 14.7 శాతం మాత్రమే ఉందన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు జాయింట్ పట్టాలు ఇవ్వడం లేదా మహిళల పేరుతోనే భూమి పట్టాలు మంజూరు చేసే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

**కేరళలో అమలవుతున్న కుదుంబశ్రీ పథకం అమలు చేయాలి : పరుచూరి జమున**

పరుచూరి జమున మాట్లాడుతూ పితృస్వామ్య భావజాలం కారణంగా మహిళా రైతులు అనేక అణచివేతలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. మహిళలు సమూహాలుగా, సహకార సంఘాలుగా ఏర్పడి వ్యవసాయం కొనసాగించేందుకు కేరళలో అమలవుతున్న కుదుంబశ్రీ తరహా పథకాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలు తమ అస్తిత్వాన్ని, ఉనికిని బలపరచుకునేందుకు చైతన్యంగా ముందుకు రావాలని సూచించారు.

**రైతు, మహిళా ఉద్యమాల ఫలితంగానే రైతు సంవత్సరం : పశ్య పద్మ**

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ మాట్లాడుతూ రైతు, మహిళా ఉద్యమాల ఫలితంగా ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్‌పి), డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ సూచనల మేరకు ఐక్యరాజ్యసమితి 2026 సంవత్సరాన్ని అంతర్జాతీయ మహిళా రైతుల సంవత్సరంగా ప్రకటించిందని తెలిపారు. 'ఇది సంతోషకరమైన విషయం. 1908వ సంవత్సరంలోనే అమెరికా దేశం లో దర్జీ (మిషన్ కుట్టే మహిళలు) పనిచేసే మహిళలు 14 గంటల పని చేయడం వారి ఆరోగ్యాలని పూర్తిగా దెబ్బ తీసుకునే పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు. వారి శ్రమ దోపిడీ ద్వారా యజమానులు లాభపడుతున్నారన్నది అర్థం చేసుకున్న ఆ మహిళలు పోరాటాన్ని కొనసాగించడం ఉధృతం చేయటమే మహిళా హక్కుల సాధనకు మార్గదర్శకమైనది.1910 వ సంవత్సరంలో క్లారా జెట్కిన్ మహిళలకు ఓటు హక్కు కోసం, విద్య, ఉపాధి ఉద్యోగ చేయాలని, ప్రపంచ శాంతి సాధనకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి ఎనిమిదవ తారీఖున నిర్వహించమని పిలుపునివ్వడం జరిగింది. నాటి నుండి నేటి వరకు ఈ నినాదాలపై మహిళలు ప్రపంచవ్యాపితంగా పోరాడుతున్నారు. 1975వ సంవత్సరంలో అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. నేడు మహిళా రైతుల సంవత్సరంగా ప్రకటించటం సంతోషకరమైనది. ప్రపంచ వ్యాప్తంగా 41 శాతం మహిళలు రైతులుగా కొనసాగుతున్నారు' అని పశ్య పద్మ అన్నారు.

మహిళా కౌలు రైతులకు ప్రత్యేక సహాయం అందించాలి.. దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో మహిళా రైతుల వివరాలు స్పష్టంగా లేవన్నారు. మహిళా రైతు లకు సాంకేతికపరమైన శిక్షణలు ఇవ్వటం ద్వారా శ్రమను తగ్గించుకునే పరికరాల ద్వారా సులభతరంగా వ్యవసాయం చేయటానికి సంబంధిత చర్యలు పాలకులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం రంగంలో కొనసాగుతున్న మహిళలు పోషకాహారం కూడా తీసుకొని దుస్థితి దేశంలో నెలకొని ఉందన్నారు. పోషకాహార పంటలను పండించటానికి పంటల ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని, భర్తలు పని కోసం వలసకు వెళ్ళటం వల్ల ఒంటరిగా వ్యవసాయాన్ని కొనసాగిస్తున్న మహిళలకు, కౌలు మహిళ రైతులకు ప్రత్యేకంగా సహాయపడటానికి అవసరమైన చర్యలు అన్నింటిని తీసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేవలం 12 శాతం మహిళలకే భూమి ఉన్నదని, అది కూడా ఎక్కువగా భర్త మరణించిన తరువాత వచ్చిన హక్కు మాత్రమేనని తెలిపారు. కుటుంబం, సమాజంలో ఉన్న లింగ అసమానతలను తొలగించినప్పుడే మహిళలకు ఉన్న చట్టపరమైన హక్కులు పూర్తిగా అమలవుతాయని అన్నారు. వజ్రాల అరుణ, శోభ, శాంతి, పద్మ, రజినితో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళా రైతులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కౌన్సిల్ సభ్యులు సదస్సులో పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com